
ఆణిముత్యాలు
2000
కస్తూరి బెహెన్

# ఆణిముత్యాలు 2000



## కస్తూరి బెహెన్

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

కస్తూరీ బెహెన్ పుస్తకాల కొరకు

కె. రామదాస్ - 9440652774

కె. సుదర్శన్ - 9247805058

సంప్రదించగలరు.

**AVATARAN MAHOTSAVA OF SAMARTH SADGURU**

# SHRI LALAJI MAHARAJ

**(BASANT PANCHAMI, 28 January, 2012)**

# DIVYA PRASAD

## BLESSINGS

How pleasant truth it is that one who is Omnipresent, does not appear before us. Though He is ours, yet we do not meet Him. The difference is this much that He is Reality and we are mortals. To bring down that Reality in the Divine Mirror of this "Divya Prasad", this is our effort to present that Reality before human beings because Truth is that which cannot remain hidden while mortal is one who does not remain forever.

Many devotees like Mirabai, Surdas and Tulsidass etc. have presented the Reality of this Truth. For feasibility of this Divine Truth (God Realisation), I expect that the efforts with experiences of the abhaysis of Sahaj Marg will definitely be successful.

**WITH DIVINE BLESSING,**

**SISTER KASTURI**

**28.01.2012**

# శ్రీ లాలాజీ మహరాజ్ అవతరణ మహోత్సవం

# బసంత్ పంచమి 28.01.2012

## దివ్య ప్రసాదం

### ఆశీర్వచనం

వారు సమస్తమందూ వ్యాపించి ఉండి కూడా మనకు ప్రత్యక్షం కాకపోవటం అనేది ఒక అనిర్వచనీయమైన సత్యం (యదార్థం). 'వారు' మనవారే అయి ఉండి కూడా మనం వారిని పొందలేకపోతున్నాం. వారికీ మనకు ఉన్న తేడా ఎంతగానంటే 'వారు' శాశ్వతులు, మనం అశాశ్వతులం. ఈ "దివ్య ప్రసాదం" అను దివ్య దర్పణంలో ఆ సత్యస్వరూపుని మానవాళికి ప్రత్యక్షం గావించటానికే మన ఈ ప్రయత్నం, ఇది తప్పక ఫలిస్తుంది కూడ. ఎందుకంటే సత్యం ఎప్పుడూ సత్యమే, అది దాగి ఉండలేదు. అశాశ్వతమైనదేదో అశాశ్వతమే, అది శాశ్వతంగా (ఎల్లప్పుడూ) ఉండలేదు.

భక్త మీరాబాయి, సూరదాసు మరియు తులసీదాసు వంటి అనేక భక్తిపరులు ఈ సత్యత్వం యొక్క యదార్థాన్ని నిరూపించారు. ఈశ్వరప్రాప్తి అను ఈ దివ్య సత్యాన్ని ప్రత్యక్షం గావించుకోవటంలో సహజమార్గం అభ్యాసుల యొక్క అనుభవపూర్వక కృషి తప్పక ఫలిస్తుందని నేను ఆశిస్తున్నాను.

దివ్య ఆశీస్సులతో,

బసంత పంచమి, కస్తూరి బెహెన్

**28.01.2012**

లక్నో.

# ఆణిముత్యాలు - 2000

దేశ విదేశాల నుండి సహజమార్గ్ అభ్యాసీలు 2000 సంవత్సరం సెప్టెంబర్, ఆక్టోబర్ నెలల్లో లక్నో నగరంలో కస్తూరీ సోదరిని దర్శించినప్పుడు సహజమార్గ విధానంలోని మెళకువలు, సాధనను గురించి, శ్రీ బాబూజీ మహరాజ్ ఎన్నెన్నో సందర్భాల్లో వివరించిన అద్భుత వివరణలు సెయింట్ కస్తూరీజీ ముఖతః వెలువడ్డ అమృత ధారావాహినే ఇది. తనివితీర గ్రోలి 'వారి' మ్రోల నిలుద్దాం!

తెలుగు తర్జుమాలోగాని, అవగాహన లోపంతోగాని జరిగిన తప్పులను మన్నించండి.

బాబూజీ కృపార్థులు

**– మీ సహ అభ్యాసీలు**

వసంత పంచిమి,
29.01.2001

**గమనిక:** 2010 సెప్టెంబర్ 28, 29, 30వ తేదలలో సోదరి కస్తూరిగారి గృహము నందు, మరియు బసంత్ ఉత్సవ్ – 2011 రోజులలో అభ్యాసీ సోదరీ సోదరుల పలుసందేహాలకు ఆమె ఇచ్చిన వివరణాత్మక సూచనలు, మార్గదర్శనాలు ఈ పుస్తకం నందు పొందుపర్చబడ్డాయి.

# ఆణిముత్యాలు - 2000

**ప్రశ్న: ధ్యానంలో ఉన్నప్పుడు కలిగే స్థితులు ఎలా తెలుసుకోవాలి? వాటిని తెలుసుకోవడం అవసరమా? అభ్యాసీకి ధ్యానంలో ఏమీ తెలియడం లేదు అంటే ఏమని భావించాలి?**

**జవాబు:** అది సెన్సిటివిటి. అనగా సూక్ష్మ గ్రాహ్యతకు సంబంధించిన విషయం. ధ్యానంలో అప్పుడప్పుడు మీ హృదయం దేనితోనో కనెక్షన్‌ను కలిగి ఉన్నట్లుగా మీరు అనుభూతి చెందుతారు. బాబూజీతో ఒక కనెక్షన్ ఏర్పడినట్లుగా మీరు హృదయంలో అనుభూతిని చెందుతారు. కాని ఆ కనెక్షన్ ఎక్కడ అంతమవుతుందో మీరు చెప్పలేరు. కనెక్షన్ అనేది ప్రారంభమైంది, కాని మనం ఈ కనెక్షన్ అనేది దేనితో కనెక్ట్ అయ్యిందో ఆ స్థితిని చేరుకోవాలి. ధ్యానంలో (ఫీలింగ్) అనుభూతి అనేది ఉంటుంది. కాని ఒక్కోసారి దానిని సరిగ్గా వివరించలేము.

కాని కొంతమంది, ధ్యానంలో మేము ఏమీ ఫీల్ కావడంలేదు అని అంటారు. ఒక్కొక్కసారి అభ్యాసీ తన స్థితిని ఫీల్ కాలేడు. ధ్యానంలో ఏ విధమైన ఫీలింగ్ కలగకపోతే, వెంటనే "ధ్యానంలో నా అటెన్షన్ (దృష్టి) ఎల్లప్పుడూ కూడా బాబూజీ మహరాజ్‌తోనే కనెక్ట్ చేయబడి ఉన్నది" అని భావించాలి. మీరు ఈ విధంగా బాబూజీతో లింక్‌ను ఏర్పరచుకొన్నట్లయితే మీకు ధ్యానంలో ఫీలింగ్ కలుగుతుంది. "నా కనెక్షన్ బాబూజీ మహరాజ్‌తో కలపబడింది" అని అనుకొనిన ప్రతీసారి, మీరు ప్రాణాహుతిని అనుభూతి చెందుతారు.

మనకు బ్యాలెన్స్‌డ్ స్టేట్ (సామ్యతా స్థితి) ఇవ్వబడుతుంది. కాని ఆ స్థితిని మనం ఉపయోగించుకోవటం లేదు. ఎప్పుడైనా మీరు కోపంగా ఉన్నప్పుడు, బాబూజీచే ఇవ్వబడిన బ్యాలెన్స్‌డ్ స్టేట్ (సామ్యతా స్థితి) మీలో ఉన్నదనే విషయాన్ని మీరు మరచిపోతారు. అప్పుడు బ్యాలెన్స్‌డ్ స్టేట్ (సామ్యతా స్థితి) మీలో ఉన్నదని మీరు అనుకుంటే కోపం చాలా తగ్గిపోయి కొద్దిగా ఉంటుంది. కాబట్టి మీరు ఆ కండిషన్‌లో ఉండి పనిచేసుకోవాలి. కాని మనం ఆ కండిషన్‌లో ఉండి పనిచేసుకోము. "అభ్యాసీ దివ్యలక్షణాలు అలవరుచుకొని దైవంవలె ఉండాలి" అని బాబూజీ కోరేవారు. బాబూజీ ఆశించినట్లుగా మీరు డివైన్‌వలె తయారుకావాలంటే ఏం చేయాలి? ఉదాహరణకు మీరు ఏ పని లేకుండా ఖాళీగా కూర్చున్నారు అనుకోండి. మీ మనస్సులోకి ఏవో కొన్ని ఆలోచనలు వస్తాయి. నేను ఖాళీగా కూర్చున్నాను నాకేమి పనిలేదు అని అనిపించినపుడు వెంటనే మీ ఖాళీ సమయాన్ని బాబూజీ మహరాజ్‌తో కనెక్ట్ చేయండి. అప్పుడు ఆ ఖాళీ సమయం అంతా కూడా దివ్యత్వంతో నింపబడుతుంది. ఈ విధంగా మీరు 'నా కనెక్షన్ ఎప్పుడూ కూడా బాబూజీ మహరాజ్‌తో కనెక్ట్ చేయబడింది" అని అనుకుంటూ మీ మాటల్లో, చేతల్లో, ప్రవర్తనలో అన్నింటిలో కూడా దివ్యలక్షణాలు వెల్లడి అయ్యేట్లుగా ప్రయత్నించండి. ఆధ్యాత్మికతలో మనం జీవించే విధానం చాలా ముఖ్యమైంది.

అభ్యాసుల నుండి జన్మదిన సందర్భంగా కానుకగా డబ్బు స్వీకరించే సందర్భంలో ఇస్తున్న వ్యక్తిని పేరుతో గుర్తించకుండా సామాన్యంగా స్వీకరిస్తే ఏ విధమైన సంస్కారం ఏర్పడదు. ఫలానా వ్యక్తి అని అనుకుంటే బంధనం ఉంటుంది, సంస్కారం ఏర్పడుతుంది. దానిని నిష్కామంగా, నిష్క్రియగా స్వీకరించి దైవ కార్యానికే వినియోగించాలి. ఒకసారి ఈశ్వర్‌సహాయ్‌జీ బాబూజీ ముందు కూర్చొని, "బాబూజీ! ఇప్పుడు మీరు నా ఎదుట ఉన్నారు. అందువలన నాకు చాలా ఆనందంగా ఉంది. నా కండిషన్ కూడా చాలా

బాగుంది” అని అన్నప్పుడు, వారు “ఈ విధంగా భౌతికంగా ఆలోచిస్తే నీవు ఎప్పటికీ ఈ భౌతిక బంధనాల నుండి విడుదల పొందలేవు” అని అన్నారు.

బాబూజీ యొక్క ఉనికిని అనుభూతి చెందినపుడు – నేను మాట్లాడుతున్నాను, నేను చూస్తున్నాను –అనే ప్రాపంచికమైన విషయాలన్నింటినీ అభ్యాసీ మరచిపోతాడు. ఎందుకంటే వాస్తవానికి ఇప్పుడు మీ దృష్టి బాబూజీ మహరాజ్‌తో కనెక్ట్ చేయబడి ఉంది. కాబట్టి, బాబూజీ మహరాజ్ ఉనికిని అంటే భౌతికమైనది కాదు, కాని మీ కనెక్షన్ ‘వారి’తోనే ఉంది. ఇప్పుడు ఈ ప్రాపంచిక విషయాలతో మీ కనెక్షన్ తెగిపోతుంది. దీని అర్థం ఏమిటంటే, “బాబూజీతో మీరు కనెక్షన్ ఏర్పరచుకోవడం” అనేది చాలా ముఖ్యమైన విషయం. ఎప్పుడైతే మీకు ‘వారి’తో కనెక్షన్ ఏర్పడుతుందో, అప్పుడు మీరు ఈ ప్రాపంచిక బంధనాల నుండి విడుదల పొందుతారు. బాబూజీ మనకు అత్యంత విలువైన వాటిని ఇవ్వడానికే ఈ భూమి మీద అవతరించారు. మీరు మాట్లాడుతున్నప్పుడు ‘నేను’ ఈ విధంగా మాట్లాడాలి అని అనుకుంటే, మీరు బాహ్యం గురించి మాట్లాడుతున్నట్లే.

నిజమైన అభ్యాసీ 7 రోజుల్లోనే తన జీవన విధానాన్ని దివ్య జీవన విధానంగా మలచుకోగలడు, అని బాబూజీ అన్నారు. కాబట్టి మన జీవన విధానం పవిత్రతతో ఉండే విధంగా మార్చుకోవాలి. అభ్యాసీ ‘దివ్యత్వం’లో మునిగిపోయి జీవించినప్పుడే ‘బాబూజీ’ని చూడగలడు. ‘జనం నన్ను చూడడానికి వస్తారు, కాని చూడరు’ అని బాబూజీ అనేవారు.

బాబూజీ మహరాజ్ ‘మన సిస్టంలో ధ్యానం, క్లీనింగ్ మరియు ప్రార్థన చేయాలి’ అని చెప్పారు. వీటిని మనం సహజంగా చేయాలి. వీటిని రిజిడ్‌గా (ఛాందసంగా) చేయడంవలన, అదే ఒక బంధనంగా ఏర్పడుతుంది. ఉదాహరణకు మనం ఏదో పనివలన ఉదయం ధ్యానానికి కూర్చోలేదు. అయ్యో! ధ్యానం చేయలేదు, ధ్యానం చేయలేదు అని బాధపడకూడదు. ధ్యానం చేసుకోలేదు అని బాధపడ్డానికి బదులుగా – ‘బాబూజీ నా **వారు**, **వారి** దర్శనం ఎప్పుడు లభిస్తుంది. ఎప్పుడు మనం **వారిని** కలుసుకుంటాం?’ అనే తపనను కలిగి ఉండాలి. సాయంత్రం క్లీనింగ్ చేసుకోవడానికి వీలుకాలేదు. దానిని తేలికగా తీసుకోండి. అయ్యో! క్లీనింగ్ చేసుకోలేదు, క్లీనింగ్ చేసుకోలేదు, అని అనుకుంటే అదొక సంస్కారంగా ఏర్పడుతుంది. క్లీనింగ్ అనేది బాబూజీ చెప్పిన ఒక విధానం. అంతేగాని ఒక క్రియగా చేయకండి. ధ్యానం, క్లీనింగ్ చేయడానికి వీలుకాకపోతే, మీ దృష్టిని వాటి మీద పెట్టకుండా, మీ దృష్టిని పూర్తిగా ‘లయావస్థ’ – ‘బాబూజీతో లయావస్థను పొందాలి’ అనే దానిపై ఉంచండి. అయ్యో! ధ్యానం చేసుకోలేదు, క్లీనింగ్ చేసుకోలేదు, ప్రార్థన చేసుకోలేదు’ అని బాధపడకుండా, “నేను బాబూజీని పొందాలి, **వారు** నా **వారు**, **వారు** నాకు అత్యంత సమీపంగా నా హృదయంలోనే ఉన్నారు. అయినా **వారిని** నేను చూడలేకపోతున్నాను” అని తపనను, అవేదనను పెంపొందించుకోండి.

మోక్షం (సాల్వేషన్), పునర్జన్మ రాహిత్యం మరియు ముక్తి (లిబరేషన్) ఈ మూడు ప్రాథమిక, మధ్యమ, అత్యున్నత స్థితులకు చెందినవై ఉంటాయి. ఇందుకు ఉదాహరణగా, మీరు నా వైపు తిరిగి కూర్చున్నారనుకోండి. మీ ముఖం ఇటువైపు ఉంటే మీ శరీరం వెనుక భాగం వ్యతిరేక దిశలో ఉంటుంది. మీ శరీరం ఇక్కడ ఉంది కాని ప్రపంచాన్ని చూడటం లేదు. కనుక అటువంటి దృష్టితో మన లక్ష్యంవైపుకే చూస్తూ ఉన్నట్లయితే మరణానంతరం శరీరక ధ్యాసలేకపోవటంవల్లను, ఆత్మ ముందుకే (ఊర్ధ్వంగా) ప్రయాణిస్తూ ఉండటంవల్లనూ

పునర్జన్మ కలగదు. మన సహజమార్గ విధానంలో విశ్వాసం ఉన్న వారందరికీ పునర్జన్మ ఉండదు అన్నారు బాబూజీ. ఇదే దృష్టితో ఆత్మ అనంతంవైపు కొనసాగుతూ ఉంటే, అభ్యాసి కృషికొద్దీ మోక్షం కలుగుతుంది. మోక్షం ఫలితంగా పునర్జన్మ కలగకపోవటం అనేది వంద లేక రెండు వందలు లేదా కొన్ని వందల సంవత్సరాలు కావచ్చు. ఆత్మ అలా ఇంకా ఉన్నతినందుతూ అనంతంలో పరమాత్మలో లయమైపోయినపుడు, ఆత్మకు వ్యక్తిత్వం లేదా గుర్తింపు లేదు కనుక విముక్తి చెందుతుంది. అదే ముక్తి – సంపూర్ణ జన్మరాహిత్యం. కనుక నిజమైన ప్రతి అభ్యాసికి ఈ ముక్తి లభించాలి అని నేను కోరుతున్నాను.

**ప్రశ్న: రియల్ అభ్యాసి అంటే ఎవరు?**

**జవాబు:** ఎవరి అటెన్షన్ (దృష్టి) అయితే బాబూజీ మహరాజ్‌తో కనెక్ట్ అయి ఉంటుందో అతడే నిజమైన అభ్యాసి.

**ప్రశ్న: రుచిలేని రుచి (టేస్ట్‌లెస్ టేస్ట్) అంటే ఏమిటి?**

**జవాబు:** మీరు భోజనం చేస్తున్నప్పుడు మీ అటెన్షన్ (ధ్యాస) దానిమీద లేదు. కాని వడ్డించిన అహారాన్నంతటిని తింటారు. కాని ఎవరైనా దాని రుచి ఎట్లా ఉంది అని అడిగితే మీరు ఏమీ చెప్పలేరు. అదే విధంగా మీరు ధ్యానంలో కూర్చొన్నప్పుడు టేస్ట్ (అనుభూతి) ని అనుభవం చేసుకోవాలి. "నేను బాబూజీ చరణాలవద్ద కూర్చున్నాను. **వారు** నా **వారు**" అని అనుకుంటే టేస్ట్ అనుభవం అవుతుంది.

ఏభై సంవత్సరాల క్రితం నాకు కలిగిన స్థితిని నేను గుర్తించగలను. మీరు కూడా అభిరుచిని కలిగించుకొని, పూర్తిగా జీర్ణించుకున్నట్లయితే మీరు దానిని చెప్పగలరు, వ్రాయగలరు. అలా జీర్ణించుకొనకపోతే మీరు చెప్పలేరు, వ్రాయలేరు. కనుక మీ అనురక్తి, అనుభూతి పెంచుకోవలసింది ప్రాపంచిక విషయాల మీదనా లేక దివ్యత్వం మీదనా అని మీరే నిర్ణయించుకోవాలి.

మీరు గతంలో చూసిన విషయాలను కొంతకాలం తర్వాత మరచిపోయి మీ అంతరంగంలో బాబూజీతో అనుబంధం కలిగి ఉంటే అది ఉత్తమం. అలా కాకుండా ప్రాపంచిక విషయాలకే మ్రొగ్గుచూపుతూ వాటినే దృష్టిలో ఉంచుకుంటూ ఉంటే అది అధమం. అది మీరే నిర్ణయించుకోవాలి.

మీరు ప్రాపంచిక విషయాలతో సంబంధం కలిగి దానితో ఆనందం పొందుతూ ఉంటే అది రుచి అవుతుంది. అలా కాకుండా మీరు దివ్యత్వంతో సంబంధం (అనుబంధం) కలిగి ఉండటం ద్వారా పొందే అనుభూతి రుచిలేని రుచి అవుతుంది.

నేను ఒకసారి మద్రాస్‌కు వెళ్ళినప్పుడు సత్సంగ్ తరువాత కొంతమంది సోదరీమణులు మాట్లాడుకొంటున్నారు. తాను ఎప్పుడు చాలా ఖరీదైన చీరలనే ధరిస్తాను అని ఒక సోదరి అన్నప్పుడు నేను "మీరు ధరించిన చీర విలువను మీ శరీరం గుర్తించగలదా?" అని అడిగాను. ఆమె అటెన్షన్ (దృష్టి) ఆ విలువైన చీరమీదనే ఉంది. బాబూజీ ఎన్నో సార్లు చెప్పారు, "నాకు కేవలం అభ్యాసీ యొక్క అటెన్షన్ (దృష్టి) మాత్రమే కావాలి. ఇంకా వేరే ఏమీ వద్దు. అభ్యాసీకి నా మీద అటెన్షన్ (దృష్టి) ఉంటే, నేను అతని అటెన్షన్ గుండా అతనిలో మొత్తం ఆధ్యాత్మికతను నింపివేయగలను. కాని అభ్యాసీకి నా మీద అటెన్షన్ (దృష్టి) లేనప్పుడు, నేను బలవంతంగా అతనిలో ఆధ్యాత్మికతను నింపవలసి వస్తుంది. అభ్యాసీ మీద బలవంతంగా పనిచేయడం వలన అతడు అలసట చెందుతాడు. ఆ సిట్టింగ్‌లో అతనికి ఆనందం కలగదు" అని.

నేను భూమి మీద ఆనకుండా జీవిస్తున్నాను, అని శ్రీ బాబూజీకి వ్రాసినపుడు బాబూజీ ఆ స్థితిని చిత్రపట రూపంలో నాకు చూపించారు. భూమిమీద నిలవకుండా అంతిమంతో సంబంధం కలిగి అభ్యాసీ ఎలా జీవించటం జరుగుతుందో బాబూజీ దానిలో చూపించారు. ఇదే లైఫ్‌లెస్‌లైఫ్ అనగా జీవిస్తూ జీవించకపోవటం అవుతుంది. భూమియొక్క స్పర్శగాని, శరీరం యొక్క స్పర్శగాని తెలియదు. ఆ స్థితిలో శరీరంలో ఎక్కడైనా తీవ్రమైన నొప్పి, బాధ అనేవి ఉంటే, అది నాది కాదు, ఆ నొప్పి ఎవరిదో అని అనిపించేది. కాని శరీరంలో ఎప్పుడైనా తీవ్రమైన నొప్పి, భరించరాని బాధ ఉన్నప్పుడు, ఎవరో నాలో ప్రవేశించి నాకు గుర్తు చేసినట్లుగా పైనుండి ఎవరిదో అటెన్షన్ నా మీద కేంద్రీకరించినట్లుగా అయి అప్పుడు ఓహ్, చాలా నొప్పిగా ఉంది అని దాని బాధ అప్పుడు తెలిసేది. బాబూజీగారు ఎటువంటి రిసెర్చి (దివ్య పరిశోధన) చేసారంటే, **వారు** మనలను అత్యున్నతమైన అల్టిమేట్ (అంతిమం) స్థితికి తీసుకొని వెళ్ళిన తర్వాత, ఇక్కడ ఈ భూమి మీద **వారి** కృప వలన మనలను ఏ విధంగా జీవించి ఉండునట్లుగా చేస్తారో దీనివలన తెలుస్తుంది. ఈ అంతిమస్థితిలో భూమీమీద ఈ శరీరం ద్వారా అన్ని పనులు వాటంతట అవే జరుగుతూ ఉంటాయి. కాని ఎప్పుడైనా మన గురించి మనకు జ్ఞాపకం వచ్చినప్పుడు, ఎవరో పై నుండి మన గుర్తింపు 'ఐడింటిటి'ని చూస్తున్నట్లు అనిపిస్తుంది.

శరీరంలో కడుపునొప్పి, లేదా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా అయినపుడు, అంటే శరీరకమైన బాధ ఉన్నప్పుడు **వారి** ప్రజెన్స్‌ను చూడగానే నాకు రిలీఫ్ (ఉపశమనం) కలిగేది.

కాని **వారి**ని పొందడానికి ఏదైతే పెయిన్ (బాధ) ఉందో దానిని **వారే** చూసుకుంటారు. **మనలను అత్యున్నత స్థితికి తీసుకొని పోవడానికి వారు ఎంతో కష్టపడతారు. మనకు మాత్రం ఎప్పుడూ ఆనందాన్నే ఇస్తారు. మనల్ని అత్యున్నత స్థితికి చేర్చిన తరువాత, ఈ భూమి మీద మనం జీవించునట్లుగా, ఆ రక్షణ బాధ్యతను కూడా వారే తీసుకుంటారు.** మన పెయిన్ **వారి**ని చేరుకోవాలనే బాధను 'అక్కడ' ఉంచి ఆ స్థితిలో మనం మరణించకుండా, జీవించి ఉండునట్లుగా చేస్తారు. బ్లిస్ (పరమానందం) యొక్క స్థితి యందు **వారి** కృప లేకుండా ఇక్కడ మనం జీవించలేము. బ్లిస్ (పరమానందం) స్థితిలో మనకు తీవ్రమైన హార్ట్– ఎటాక్‌వలె నొప్పి కలుగుతుంది. ఎందుకంటే, ఆ పరమానందంవలన, ఇన్నర్ (ఆంతరికం) వెంటనే **వారి**లో విలీనం కావాలని, ఆ సమయమందు తనకు బంధనంగా ఉన్న శరీరాన్ని తొలగించుకోవాలని, ఛేదించుకోవడానికి ప్రయత్నిస్తుంది. అందువలన ఆ తీవ్రమైన నొప్పి అనేది కలుగుతుంది. కాని హార్ట్–ఎటాక్ వంటి ఆ తీవ్రమైన నొప్పిని **వారే** చూసుకుంటారు. (మనం విచారపడవలసిన అవసరంలేదు)

ఈశ్వర్‌సహాయ్‌గారు బాబూజీని తరచుగా ప్రశ్నిస్తూ ఉండేవారు, **వారి** నుండి ఆధ్యాత్మిక విషయాలు సంగ్రహించటానికి అని. ఒకసారి వారు బాబూజీతో "మీరు అభ్యాసికి లయావస్థ ఇవ్వటానికి ఇంత శ్రమ, సమయం ఎందుకు తీసుకుంటారు. వెంటనే ఇవ్వవచ్చును కదా!" అని అన్నారు. అపుడు బాబూజీ, "నేను అభ్యాసిని పైకి తీసుకువెళ్ళి రుచి లేని రుచి స్థితిని చూపించవలసి ఉంటుంది. అది లేకుండా అతడు అక్కడ జీవించి ఉండలేడు" అని అన్నారు. ఈ రుచి అనేది అంచెలంచెలుగా ఆధ్యాత్మికత స్థితులను వాతావరణాన్ని అనుసరించి మారుతూ ఉంటుంది. ఉన్నత దశలో రుచిలేని రుచి స్థితి ఉంటూ ఉండగా అది క్రిందికి దిగుతున్నకొద్దీ పరిసరాల ప్రభావంతో మార్పు చెందుతూ చివరకు భూమిమీద శరీరస్థాయికి వచ్చేసరికి రుచి

కలిగిన స్థితికి వస్తుంది. ఈ విధంగా పైనుంచి రుచి కాని రుచి (రుచి లేని రుచి) స్థితి నుండి భిన్న వాతావరణాల నుండి మారుతున్న రుచులతో చివరకు భూమి మీదకు వచ్చేసరికి రుచికర స్థితి కలుగుతుందని, ఇలా అనుభవించకుండా అభ్యాసి జీవించి ఉండలేడని **వారు** చెప్పారు. అనగా లైఫ్‌లెస్‌లైఫ్ (జీవంలేని జీవితం) నందే ఈ టేస్ట్‌లెస్ టేస్ట్ (రుచి లేని రుచి) ఉంటుంది. లైఫ్‌లెస్ లైఫ్ నందు శరీరం చనిపోయి రియల్‌లైఫ్ (వాస్తవమైన జీవితం) అనేది మొదలవుతుంది. అభ్యాసి ఇక్కడే ఉండి 'అక్కడ' అనగా ఆ 'అంతిమం' నందు జీవిస్తాడు. అభ్యాసి సూటిగా 'అంతిమం' తోనే కనెక్షన్‌ను కలిగి ఉండి, అది నా ఇల్లు అని అంటాడు. యధార్థానికి ఎటువంటి అభ్యాసి ఈ అత్యున్నతమైన స్థితిని పొందుతాడంటే, ఎవరైతే "బాబూజీ నా **వారు**" అని హృదయపూర్వకంగా అంటారో "బాబూజీ! నా **వారు**" అని భావించినపుడు ఆ 'నా' అనేది నెమ్మది-నెమ్మదిగా మరచిపోతూ, అతని దృష్టిలో "బాబూజీ నా **వారే**" అనేది నిండిపోతుందో, ఎప్పుడైతే అతని దృష్టిలో కేవలం **వారు** మాత్రమే నిండిపోతారో, అప్పుడే ఆ 'అంతిమం' యొక్క స్థితిని పొందటానికి ఆ అభ్యాసి అర్హుడవుతాడు.

ధ్యానంవలన మన హృదయం ప్రాణాహుతితో నింపబడుతుంది. ఉదాహరణకు టీ కప్పులో కెటిల్‌తో టీ పోస్తూ ఉంటాము. పోయగా పోయగా అది నిండిపోతుంది. ఒకవేళ మనం అమనస్కంగా (పరధ్యానంగా) ఇంకా పోసినట్లయితే అది పొర్లిపోతుంది. కనుక ధ్యానంలో మన హృదయాన్ని కూడా పూర్తిగా తెరచి ఉంచినట్లయితే, బాబూజీ ప్రవహింపజేసేటటువంటి ప్రాణాహుతితో అది పూర్తిగా నిండిపోయి మనమే 'వారి'లో ఇమిడిపోయినట్లుగా అనిపిస్తుంది. హృదయం అంటే భౌతిక-హృదయం కాదు. హృదయం అంటే డివైన్-హార్ట్, విరాట్-హృదయం. భౌతిక హృదయం అంటే ఒక బిందువు మాత్రమే. మొత్తం సిస్టమ్‌ను అంతా కూడా సంపూర్ణ-హృదయంగా భావించాలి. ధ్యానంలో మన మనస్సును హృదయం మీద నిలపడానికి ప్రయత్నిస్తాం. కాని మీరు ఈ హృదయాన్ని మరచిపోండి. మొత్తం సిస్టమ్ అంతటా కూడా కేవలం 'వారే' నిండిపోయినట్లు భావించండి. 'వారి' దర్శనం కావాలని కోరండి. 'వారి' రూపం మీ ఎదుట కనబడినా, కనబడకపోయినా సరే!

పార్షద్ అంటే ఉపనిషత్‌లో తురీయావస్థ, మహాపార్షద్ అంటే తురీయాతీతావస్థ అని బాబూజీ చెప్పారు.

మనం నిద్రపోతున్నామనుకుందాం. నిద్రపోతూనే ఉన్నా కాని ఏదో స్థితిని చూస్తూ ఉంటాం. దాని నుంచి దృష్టి మరల్చి తిరిగి రాము. కారణ శరీరంయొక్క జ్ఞానం అనగా ఆత్మజ్ఞానం గాఢ నిద్రావస్థలో ఉంటుంది. అదే సుషుప్తావస్థ. యోగి నిద్రిస్తున్నట్లయితే అతను ఎక్కడ ఉన్నాడో తెలియదు. ఎప్పుడైతే మేల్కొని బాహ్యస్థితిలోకి వస్తాడో అప్పుడు అతనికి తాను ఎక్కడి నుంచో తిరిగి వచ్చినట్లనిపిస్తుంది. అంటే అతడు నిద్రలో ఉన్నప్పుడు, అంతరంగం అతని స్థాయినిబట్టి దివ్యలోకంలో వ్యాప్తి చెందుతూ ఉంటుంది.

మనం నిద్రపోతున్నప్పటికీ ఆ నిద్రలోనే దేనినో చూస్తూ ఉంటాం. ఏదో కొంత జ్ఞాపకం ఉంటుంది. అనగా నిద్రావస్థలో జాగ్రదావస్థ. దీనినే స్వప్నావస్థ అంటాం. ఇక్కడ భౌతికంగా శరీరం నిద్రిస్తూ ఉంటుంది. మైండ్ మేల్కొని ఉంటుందన్నమాట.

యోగి భౌతికంగా నిద్రిస్తున్నపుడు అతని ఆంతరికం అనంతంలో వ్యాప్తి చెందుతూ ఉంటుంది. కాని అతనికి దాని స్పృహ ఉండదు. ఇక్కడ మైండ్ అచేతనంగా ఉంటుంది. భౌతికంగా మేల్కొన్నాక ఎక్కడి నుంచో తిరిగి వచ్చినట్లనిపిస్తుంది. దీనినే తురీయావస్థ అంటాం. ఇది నిద్రావస్థలో జాగ్రదావస్థ వంటిది. కాని యోగి

లోతుగా దివ్యస్థితిలోనే మునిగి ఉండి, భౌతికంగా మెళకువతో సంచరిస్తున్నపుడు కూడా స్పృహ లేని వాడై ఉంటాడు. అంటే భౌతికంగా జాగ్రదావస్థ (మేల్కొన్నస్థితి) లో ఉన్నా అతని మైండ్ కోల్పోయినవాడై ఉంటాడు. అటువంటి స్థితిలో అతని భౌతిక శరీరానికి ఏదైనా తగిలినపుడు అతడు ఎక్కడి నుండో వచ్చినట్లుగా మళ్ళీ స్పృహలోనికి వస్తాడు. దీనిని జాగ్రదావస్థలో నిద్రావస్థ లేదా చేతనావస్థలో నిద్రావస్థ అంటాము.

**ప్రశ్న: ఈశ్వరుడు సర్వవ్యాపి, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు అని అంటారు కదా! వీటిని ఏ విధంగా తెలుసుకోవాలి?**

**జవాబు:** ఎప్పుడైతే బాబూజీని 'సర్వవ్యాపి' అని అంటామో అప్పుడు ఒక్కసారిగా మనం ఈ విశ్వమంతటా వ్యాపించినట్లుగా అనిపిస్తుంది. దీని అర్థం ఏమిటంటే, ఇప్పుడు మనం 'సర్వవ్యాపి'గా అయినామని. కాని అందులో శరీరం ఉండదు. ఇన్నర్ (ఆంతరికం) సర్వత్రా వ్యాపిస్తుంది. అప్పుడు మనకు 'బాబూజీ' సర్వవ్యాపి అనే నిరూపణ లభిస్తుంది. బాబూజీ మహరాజ్‌నందు 'లయావస్థ'ను పొందినపుడే ఈ స్థితులను పొందగలం.

"**వారు** ఎల్లవేళల మనతోనే ఉన్నారు" అనే అనుభూతితో **వారి** ఉనికి (ప్రజెన్స్) మొదలవుతుంది. పురోగమించిన కొలదీ,– ప్రేమ, భక్తి ప్రగాఢమైనపుడు చివరకు **వారే** ఈ సర్వవ్యాపి స్థితిని మనకు ప్రసాదిస్తారు. ఎవరైనా బాబూజీ గురించి మాట్లాడినపుడు, నా గురించే మాట్లాడుతున్నారని మనం దృఢ నిశ్చయంతో ఉంటాం. ఈ మూడు స్థితులు వేర్వేరుగా, అనుభూతులు వేరుగా ఉంటాయి.

**ప్రశ్న: మహాప్రళయం అంటే ఏమిటి?**

**జవాబు:** అది కండిషన్ (స్థితి)కి సంబంధించింది. ప్రళయం అనగా లయావస్థ. మహాప్రళయం అనగా లయావస్థ లయం కావడమే. ప్రళయమనేది డివైన్ ఓషన్ అనగా దివ్యసాగరంలో మునిగి కరిగిపోవటం. మనిషి సాగరంలో మునిగిపోయినపుడు క్రమంగా శరీరం లోతుకు వెళ్ళుతుంది. అలా మునిగిపోయి మరణించాక 'తాను' అను లోపలిది కరగిపోగా శరీరం నీటిపైకి తేలుతుంది. ఇది మహాప్రళయం అవుతుంది. అనగా దివ్యసాగరంలో మునిగిపోవటం ప్రళయమైతే అందులో 'తాను' అనునది పోయాక తేలటమనేది మహాప్రళయం. అనగా మొదటిది లయావస్థ అనగా ప్రళయం. అయితే సంపూర్ణ లయావస్థలో 'నా' లేదా 'నేను' అనగా తనను కోల్పోవటమనేది మహాప్రళయం అవుతుంది. మహాప్రళయం తర్వాత అభ్యాసి ఈ ప్రపంచంలో జీవిస్తూనే ఉన్నా అతనిని ఈ ప్రాపంచిక జీవితం స్పర్శించదు.

అభ్యాసి ఒకరు బాబూజీతో ఫిర్యాదు చేశాడు – "అభ్యాసుల్లో గ్రాస్‌నెస్ – స్థూలత్వం ఎక్కువగా ఉన్నట్లయితే అది ఇతరులకు అంటుతుంది. కనుక రెండు అడుగులు దూరంగా జరిగి కోర్చో"మని ఒక ప్రిసెప్టర్ ఆదేశించాడట. అపుడు బాబూజీ చెప్పారు, ఒకరి గ్రాస్‌నెస్ (స్థూలత్వం) వలన ఇతర అభ్యాసులకు నష్టం కలగదు అని. అందువలన వందలాదిగా ఒకేచోట అభ్యాసులు సత్సంగ్‌లో కూర్చున్నా, ఎక్కువ మంది సిట్టింగ్‌లో కూర్చున్నా ఒకరి గ్రాస్‌నెస్ మరొకరికి కలగటమనేది లేకపోగా పవిత్రతే చేకూరుతుంది. ఇక అది ఆ ప్రశిక్షకునికి స్థూలత్వం గురించి ఉన్న భయం, అపోహ మాత్రమే. నాకు అలాంటి భయం లేదు కనుక మిమ్మల్ని దగ్గరగా వచ్చి కూర్చోమంటున్నాను.

బాబూజీ టూర్ వెళ్ళినపుడు, **వారు** పరుండబోయే ప్రక్కమీద **వారి** వెంట ఉన్న ఈశ్వర్ సహాయ్‌గారు బాబూజీ యొక్క మరో దుప్పటిని దానిమీద పరచేవారు. అప్పుడు ఒక అభ్యాసి అది చూసి ఆ ప్రక్కమీద మురికి

ఏమీ లేకుండా శుభ్రంగా ఉన్నా ఈ దుప్పటి ఎందుకు పరచారు అని అడిగాడట. దానికి బాబూజీ "ఆ ప్రక్కను మామూలుగా వాడుతున్న వ్యక్తి ఆరోగ్యవంతుడు కాకపోతే ఏవైనా వ్యాధి కారకాలు ఉండవచ్చు. అందువలన వాటిని నివారించటానికి ఈ విధంగా చేయబడుతోంది. ఇది నా ఆరోగ్య రక్షణకు అవసరమని, లాలాజీ సాహెబ్ ఇచ్చిన సలహా మేరకు ఆచరిస్తున్నాను" అని సమాధానం చెప్పారు.

మనం హృదయాన్ని తెరచి ఉంచాలి. దాపరికం లేకుండా సన్నిహితత్వం పెంచుకోవాలి. ఒకసారి నా తల్లిగారు అనారోగ్యంగా ఉండగా బాబూజీ చూడటానికి వచ్చినప్పుడు ఆమె సంకోచించకుండా "బ్రతుకు నిచ్చేది గుండె. ఈ గుండె, పోటుకు గురైంది. నీవు మానవులను ఉద్ధరించటానికి పైనుంచి దిగి వచ్చావు. మరి నా గుండె గురించి ఏం చేస్తున్నావు" అని ప్రశ్నించింది. అలా అడిగేటపుడు బాబూజీ దివ్యపురుషుడు, అలా అనదగునా లేదా అని ఆమె సంకోచించకుండా హృదయం విప్పి అడిగింది. అదే విధంగా మనం మన హృదయాన్ని పూర్తిగా తెరచి ఉంచాలి. బాబూజీతో మనం సహజంగానే అన్యోన్యత కలిగి ఉంటే, **వారు** కూడా ఏమీ దాచుకోకుండా సహజ రీతిలో మనకు అన్నీ ఇస్తారు. ఎప్పుడైతే మనం హృదయం విప్పి **వారి**కి అర్పించుకుంటామో అపుడు మనలోని అహం కూడా తొలగిపోతుంది. ఆత్మ పరమాత్మల సంబంధం పెరుగుతుంది.

బాబూజీని ఒక అభ్యాసి మెడిటేటివ్‌మూడ్ 'ధ్యాన నిమగ్నతా స్థితి' అంటే ఏమిటి అని అడిగినపుడు **వారు** ఇలా జవాబు ఇచ్చారు– "ధ్యానంలో శారీరకమైన నొప్పులు అనేవి బాహ్యమైనవి. ధ్యానంలో ధ్యాన నిమగ్నత అనేది ఆంతరికమైనది."

మీరు ధ్యానంలో కూర్చున్నప్పుడు ఏ విధంగా అంటే మీ ఇన్నర్ (ఆంతరికం) సంపూర్ణంగా **వారి**కి సమర్పించబడిన స్థితిలో ఉన్నదనే భావనలో, మీ హృదయం 'వారి'నే చూస్తున్నదనే భావనతో ఉండాలి. ఆ థాట్ (ఆలోచన) కాదు. ఆలోచన ఉంటే మెడిటేటివ్ మూడ్ (ధ్యాన నిమగ్నత) లేనట్లే. బాబూజీ దీనికి ఒక చక్కని ఉదాహరణ ఇచ్చారు. ఒక బిచ్చగాడు ఒక ఇంటి ముందు తన భిక్షాపాత్రను పట్టుకొని నిలబడతాడు. నోటితో ఏమీ అడగడు. ఎప్పుడు వేస్తారా అని వేచి ఉంటాడు. అదే విధంగా అభ్యాసీ కూడా తన హృదయాన్ని విప్పి, హృదయమనే భిక్షాపాత్రతో, 'మీ ఇష్టం మీరు ఏ విధంగా చేయాలనుకుంటే ఆ విధంగా చేయండి' అని 'వారి' ముందు నిలబడాలి. అతనిలో ఏ ఆలోచన, ఏ కోరిక ఉండకూడదు. తన హృదయం (భిక్షాపాత్ర) నిండిందా లేదా అనే ఆలోచన కూడా అతనికి రాదు. తన హృదయాన్ని విప్పి 'వారి' పాదాలవద్ద ఉంచుతాడు. "నేను ఏదో కోరడానికి వచ్చాను" అనేది కూడా మరచిపోతాడు.

**సహజమార్గంలో ప్రార్థన:** ప్రార్థన సహజమార్గానికి ఆత్మ (ప్రాణం) వంటిది. మరియు ప్రార్థన ద్వారా మనకు దైవంతో సంబంధం కలుగుతుంది. దీనిని ఉదయం, రాత్రి పరుండబోయే ముందు చేయాలి. ఉదయం చేసేటపుడు "మేము మీ వారము, మీరు మా వారు" అను భావంతో చేయాలి. దీనితో ఆత్మీయత, సంబంధం ఏర్పడతాయి. "నేను పురోగతి చెందుతున్నాను" అనే భావన ఉండాలి. రాత్రి చేసే ప్రార్థన సర్వమానవాళికి సమస్త ప్రకృతికి సంబంధించి ఉంటుంది. మిగతా సమయాల్లో హృదయంలో **వారి** జ్ఞాపకం ఉంచుకోవాలి. ఇది మాటల్లో (మంత్రంలా) కాకుండా, ఆంతరికంగా ఉండాలి. హృదయాన్ని బాబూజీ మహరాజ్ పాదాలవద్ద సమర్పించాలి. బాబూజీ ప్రార్థనను 'శక్తి'తో ఛార్జ్ చేసారు. ప్రార్థనవలన మన హృదయం ఒక సమర్పణా భావంలో ఉంటుంది.

బాబూజీని ఒక అభ్యాసి ఇలా ప్రశ్నించాడు – "ఆధ్యాత్మిక ప్రగతికి కోరికలు అనేవి ప్రతిబంధకాలని అంటారు కదా! మరి సాక్షాత్కారం పొందాలనేది కూడా కోరికే కదా! అది కూడా ప్రతిబంధకమే కదా?" అని. దానికి సమాధానంగా "సాక్షాత్కారం అనేది కోరికతో సిద్ధించేది కాదు. అది కోరికకు అతీతమైనది. భగవత్ సాక్షాత్కారం పొందటం మానవుని విధి, దేహం అందుకే ఇవ్వబడింది" అని అన్నారు బాబూజీ.

థాట్‌లెస్‌నెస్ – భావరహిత స్థితి అనేది ప్రాపంచిక విషయాలోచన లేకపోవటం. బాబూజీ ఈ స్థితిలో ఉంటారు. అట్టి స్థితిలో దివ్యం నుంచి వచ్చే ఆలోచన 'వారి'ని పనిచేయటానికి సూచనలు ఇస్తుంది. దివ్యశక్తి నింపబడుతూ ఉంటుంది. దివ్యసంకల్పంతో దివ్యకార్యం నిర్వహించబడుతూ ఉంటుంది. బాబూజీ నిరాలోచన స్థితిలో ఉంటూనే, భౌతికమైన అవసరాలు (అనగా పప్పు, కూరలు, రొట్టెలకు పిండి విషయాల) గురించి ప్రస్తావిస్తూ ఉండేవారు. ఈశ్వర్ సహాయ్‌గారు, బాబూజీని "మీరు ఆలోచనారహిత స్థితిలోనే ఇటువంటి విషయాలు ఎలా మాట్లాడగలుగుతున్నారు, ఇది ఆలోచనలు ఉండటంవల్లనే గదా!" అని అడిగారు. బాబూజీ దీనికి సమాధానంగా "ఈ థాట్‌లెస్ స్థితిలో ఉన్నప్పుడే సద్గురువు యొక్క అవసరం ఉంటుంది. నేను థాట్‌లెస్ స్థితిలో ఉన్నాను కాబట్టి ఇక్కడ నా బాధ్యత అంతా లాలాజీ సాహెబ్ తీసుకున్నారు. అవసరాన్నిబట్టి లాలాజీ సాహెబ్ ఇచ్చే సూచనల ప్రకారం ఇక్కడి ఈ పనులన్నీ జరుగుతున్నాయి" అని అన్నారు. ఉదాహరణకు– ఒకసారి బాబూజీ ఇంటికి బంధువులు వచ్చినపుడు భోజనం ఏర్పాటు చేస్తూ వారి కుమార్తె మాయ వడ్డన చేయటానికి దేశవాళీ నెయ్యి లేదు అని బాబూజీతో చెప్పటం జరిగింది. అపుడు బాబూజీ ఫలానాచోట ఫలానా పాత్రలో ఉన్నది అని చెప్పారు. ఆమె వెళ్ళి వెదికేసరికి అది అక్కడ సిద్ధంగా ఉంది. తర్వాత ఆమె బాబూజీని ప్రశ్నించింది – "దీనిని ఆ స్థానంలో నేను ఎప్పుడూ చూడలేదు, కాని ఎలా వచ్చింది" అని. దానికి సమాధానంగా "అదే లాలాజీ సాహెబ్ మహిమ. నాకు అది అక్కడ ఉందని వారే చెప్పారు" అన్నారు బాబూజీ. దివ్యమహిమ అనేది ఇలా ఉంటుంది.

మానవుడు ఆధ్యాత్మికతను తన మనస్సుతో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. కాని ఆధ్యాత్మికత అనేది విరాట్–హృదయంతో మాత్రమే అర్థమవుతుంది.

కొందరు ప్రిసెప్టర్స్ ట్రాన్స్‌మిషన్ తాము ఇస్తున్నాము అనుకుంటారు. మన సహజమార్గ విధానంలో ట్రాన్స్‌మిషన్ అనేది డివైన్ నుండి వస్తుంది. అనగా మన బాబూజీ నుంచి వస్తుంది. అలా వచ్చే శక్తిని తన స్వంతం చేసుకొని దానిమీద ఆత్మవిశ్వాసం, అధిపత్యం పొందగలిగితే అదే అన్ని పనులు నిర్వహిస్తుంది. ఆ శక్తి స్వాధీనంలో లేకపోతే ట్రాన్స్‌మిషన్ ఇవ్వలేరు. ఆ శక్తి బాబూజీది మాత్రమే.

బాబూజీ ఇచ్చేటటువంటి భావరహిత స్థితిలో పొందే శక్తి ద్వారా కుటుంబ బాధ్యతలు, ఆధ్యాత్మిక విధులు అన్నీ సక్రమంగా నిర్వహించబడతాయి.

గురువు, సద్గురువు కానట్లయితే అతడు ఆచరణ చేయకుండా శిష్యులకు నియమాలు, నీతులు వల్లిస్తూ మోసపూరితంగా, ఆషాడభూతిలా వ్యవహరిస్తూ ఉంటాడు. అటువంటి సందర్భంలో గురువు వంచన చేయకుండా శిష్యులు గురువు యొక్క ఆట కట్టించవచ్చు. గురువును సరిదిద్దవచ్చు. మీరు ఆచరించని మంచి పనులు మాకు ఎలా బోధిస్తారని గురువును నిలదీయవచ్చు.

ఈశ్వర్ సహాయ్‌గారు బాబూజీతో – "అభ్యాసులు తప్పుదారి పట్టితే మీరు సరైన దారిలోకి మళ్ళిస్తారు, మరి గురువే తప్పుదారి పట్టితే ఎవరు సరిచేస్తారు" అని అన్నపుడు **వారు** అందుకు సమాధానంగా "శిష్యులే చేస్తారు" అన్నారు.

మనం ప్రతి దానిలోను అది తప్పు, ఇది తప్పు అని ఎప్పుడూ తర్కించుకుంటూ ఉంటే చివరికి ఆ తప్పులన్నీ మనవే అవుతాయి. సహజమార్గం ఒక సిస్టమ్ (విధానం). ఈ సిస్టమ్‌లో ప్రిసెప్టర్ ద్వారా ట్రాన్స్‌మిషన్ వస్తుంది. ప్రిసెప్టర్ ఎవరైనా కావచ్చు. వచ్చే ట్రాన్స్‌మిషన్ బాబూజీదే అనుకోవాలి. ప్రిసెప్టర్ అనగా శక్తి–కేంద్రం నుండి కనెక్షన్ కలవాడు, ఆ శక్తితో అతను పనిచేస్తాడు.

**ప్రశ్న: నిరంతర స్మరణ అంటే ఏమిటి?**

**జవాబు:** నిరంతర స్మరణ అంటే నేను గ్రహించిన దాని ప్రకారం ఎప్పుడైతే ఇన్నర్ (హృదయం) 'వారి' స్మరణలో ఉండదో అప్పుడు దానికి శాంతి ఉండదు. ఎప్పుడైతే స్మరణకు అంతరాయం (బ్రేక్) కలుగదో అది నిరంతర స్మరణ అవుతుంది.

మనం ఏదైనా పనిలో మునిగిపోయాము. ఆ పని అయిపోయిన వెంటనే ఈ పనివలన మనం ఇంతవరకు 'వారి' స్మరణను మరచిపోయామనే ఆలోచన వస్తుంది. మనం 'వారి'ని మరచిపోయాం అనే ఆలోచన మనకు రాగానే మన నిరంతర స్మరణ అక్కడితో బ్రేక్ అవుతుంది, తెగిపోతుంది. కాని స్మరణ అనేది నిరంతరంగా ఉండాలంటే బ్రేక్ (అంతరాయం, తెగిపోవటం) అనే పదాన్ని ఎప్పుడు కూడా తీసుకొని రాకూడదు. పనిలో ఉండి 'వారి'ని మరచిపోయినపుడు గుర్తుకు రాగానే వెంటనే "ఇప్పటివరకు కూడా మన జ్ఞాపకం, మన హృదయం, మన అటెన్షన్ (దృష్టి) అంతా కూడా కేవలం 'వారి' వద్దనే ఉన్నది **వారి** కోసం" అని అనుకోవాలి. అప్పుడు స్మరణ నిరంతరంగా ఉంటుంది. మనం నిద్రపోయే ముందు మన హృదయం 'వారి' చరణాలవద్దనే ఉంది. 'వారి' స్మరణలోనే మునిగిపోయిందనే భావనతో నిద్రించాలి. అప్పుడు నిద్ర లేవగానే మీకు 'వారి' స్మరణలోనే ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఇది నెమ్మది – నెమ్మదిగా జరుగుతుంది. ఈ విధంగా ఒక నిరంతర ధార – అదే స్పృహ పెట్టుకోవాలి బ్రేక్ లేకుండా. మనలో ఒక ఆలోచన కలిగిందనుకుందాం. అది మన అంతరంగంలోకి వెళ్తుంది. మన అంతరంగమేమో దేనితోనో కనెక్ట్ (అనుసంధానం) కలిగి ఉందనిపిస్తుంది. ఆ కనెక్షన్ ద్వారా మనకు శక్తి లభిస్తూ ఉంటుంది. ఆ శక్తి నిరంతరం మన హృదయంలోనికి ప్రవహిస్తూన్నట్లు మనకు తెలుస్తూ ఉండటంవలన మనకు నిరంతర స్మరణ ఉన్నట్లే. మన హృదయం దేనితోనో కలపబడి ఉన్నదనుకోవటం ఎ,బి,సి,డి పాయింట్లతో కాదు, అది డివైన్‌తో, అనగా బాబూజీతో. ఈ కలపబడి ఉండటమనేది జీవాత్మ పరమాత్మతో అనుసంధానమై ఉండటమే. అభ్యాసి గ్రహించవలసిన మొట్టమొదటి రహస్యం ఏమంటే, అతని ఇన్నర్ (ఆంతరికం) డివైన్‌తో కనెక్ట్ అయిందని తెలుసుకోవటమే –అన్నారు బాబూజీ. వారిని చూడగలగటానికి ఒక పల్చని తెర మన ముందు అడ్డుగా ఉంటుంది. మనలో పవిత్రత నెలకొని ఉంటే అది తొలగిపోయినట్లవుతుంది. ఈ తెర అనేది మన కవరింగ్స్ అనగా మన ఆత్మను ఆవరించి ఉన్న సంస్కారాలు. అవి తొలగిపోతే ఆ తెర తొలగిపోయి **వారి** దర్శనం కలుగుతుంది. వాస్తవానికి ఆ తెర అన్నది మనపై ఉన్నదే కాని **వారి** పైన ఉన్నది కాదు. చాలా (సింపుల్‌గా) సామాన్యంగా ఉండాలనీ, తాను గొప్ప అని అనుకోరాదని బాబూజీ చెప్పారు. మనయొక్క నిరంతర స్మరణతోను, సాధనతోనూ **వారి**ని దర్శించగలుగుతాం.

ఒక ముఖ్య విషయం ఏమిటంటే, బాబూజీ యొక్క 'సామీప్యత'ను అనుభూతి పొందడమనేది మన పురోభివృద్ధికి చిహ్నం. ఎవరి శరణులో ఉన్నామో 'వారి' ప్రజెన్స్‌ను అనుభూతి చెందుతూ ఉంటే ప్రోగ్రెస్ ఉన్నట్లే. మనం బాబూజీ గురించి మాట్లాడుకుంటున్నప్పుడు మన దృష్టి నిరంతరం 'వారి' మీదే ఉంటుంది.

ఒకసారి ఈశ్వర్ సహాయ్‌గారు బాబూజీని "మీరు దివ్య పురుషులు, మీరు యదార్థం, సత్యం, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు యదార్థ సత్యం. మాలోనూ ఆ దైవం ఉన్నాడు. మేము మాత్రం యదార్థం, సత్యం ఎందుకు కాదు" అని అడిగారు. దానికి సమాధానంగా "నేను దివ్యత్వంతో అనుసంధానమై ఉన్నాను. నీవు భౌతికత్వంతో అనుసంధానమై ఉన్నావు" అన్నారు బాబూజీ.

మరుపు స్థితిలో శరీరంయొక్క స్పృహ పోతుంది. సూక్ష్మశరీరం కరిగిపోతూ ఉంటుంది. దివ్యంలో (డివైన్) కలిసిపోతుంది. కారణశరీరం కారణంలో కలుస్తుంది. ఆత్మ పరమాత్మలో విలీనమైపోతుంది. అప్పుడు రియాలిటి (సత్యత్వం) ప్రారంభమవుతుంది.

భూమా అనే పూదోటలో విరబూసిన బాబూజీ అను పుష్పంలో లాలాజీ సాహెబ్ యొక్క సుగంధం వ్యాపించి ఉంది.

సహజమార్గం అనే వనంలో వికసించిన పుష్పాలు అవి మనలో విరజిమ్ముతున్న పరిమళం శ్రీ బాబూజీది.

సహజమార్గం అనే దివ్వె బాబూజీయొక్క భక్తులతో ప్రకాశిస్తోంది.

అభ్యాసులు నా కృషిని ప్రశంసించాలని నేను ఎప్పుడూ కోరను. నా కృషిని బాబూజీ మహరాజ్ ప్రశంసించాలని కోరతాను.

బాబూజీ ముఖ్యంగా 'లయావస్థ'ను గురించి చెప్పారు. అభ్యాసీ స్వయంగా 'వారి'లో లయం కావలసి ఉంటుంది. ఉదాహరణకు నది వెళ్ళి సముద్రంలో కలుస్తుంది. కాని సముద్రం వెళ్ళి నదిలో కలవదు. అదే విధంగా అభ్యాసులమైన మనమే వెళ్ళి 'వారి'లో లయం కావాలి.

మాస్టర్ (బాబూజీ) రచనలను మరియు మాస్టర్ ఆలోచనలను మనం అర్థం చేసుకోలేము. ఒకవేళ అభ్యాసీ వాటిని అభ్యాసీ-భాషలో వ్రాసినట్లయితే మనం అర్థం చేసుకోగలం. అందుకని బాబూజీ నన్ను ఆధ్యాత్మిక స్థితులను అన్నింటిని గురించి అనుభవపూర్వకంగా వ్రాయమని కోరారు. 'వారి' కృపవలననే నేను అన్ని స్థితులను గురించి వివరంగా వ్రాయగలుగుతున్నాను. ఈ స్థితులను గురించి ఎవరో ఒకరు అనుభవపూర్వకంగా వ్రాయకపోతే ప్రతి ఒక్కరు తమ తమ సొంత భాష్యాన్ని చెబుతారు.

సాధనయందు, ధ్యానంలోను ఎక్కువగా ఆలోచనలు వస్తున్నాయి అని చాలా మంది అభ్యాసులు అంటూ ఉంటారు. సాక్షాత్కారం అనే లక్ష్యాన్ని పొందుట కొరకు "ఈశ్వరుడు నా హృదయంలోనే ఉన్నాడు" అనే ఒక సంకల్పం మనకు ఇవ్వబడింది. కాని ఈశ్వరుని గురించి మనకు తెలియదు. మనకు బాబూజీ తెలుసు. కాబట్టి ఎక్కువగా ఆలోచనలు వచ్చినప్పుడు "బాబూజీ నా లోపల ఉన్నారు" అనే ఒక ముఖ్యమైన డివైన్-థాట్ (దైవీయ ఆలోచన) ను మరల-మరల అనుకోవడంవలన ఇతర ఆలోచనలన్నీ కూడా అశ్రద్ధ చేయబడుతాయి. కాని వాస్తవానికి ఆలోచనలకు ప్రాణం లేదు. కాని మనమే ఆలోచనలకు ప్రాణం పోస్తున్నాం. ఆలోచనలవైపు చూడడంవలన మనం వాటికి ప్రాణం ఇస్తున్నాం. ఆ ఆలోచనలు వస్తున్నాయి, ఈ ఆలోచనలు

వస్తున్నాయి అని మనం వాటి పైననే దృష్టిని ఉంచడంవలన మనమే వాటికి ప్రాణం పోస్తున్నాం. మనం ఆలోచనలవైపు చూడకపోతే వాటికి ప్రాణం ఇవ్వడమనేది ఆగిపోతుంది. ధ్యానంలో "బాబూజీ నాలోనే ఉన్నారు" అనే డివైన్–థాట్‌ను మరల మరల అనుకుంటాం. బాబూజీ థాట్‌లెస్ (శూన్యభావ) వ్యక్తి.

ఈ విధంగా మనం మరల–మరల 'వారి'ని స్మరించడంవలన ఆలోచనలు దూరమైపోతాయి. మన దృష్టిని దైవం (డివైన్) మీద ఉంచినప్పుడు, మనకు డివైన్ (దైవం)తో ఎటాచ్‌మెంట్ (బంధం) ఏర్పడుతుంది. దీని ఫలితంగా ఇతర ఆలోచనలు నశించిపోతాయి. ఆలోచనలకు ప్రాణం లభించదు. ఎప్పుడైతే బాబూజీతో మన ప్రేమ, మన ఎటాచ్‌మెంట్ (బంధం) అనునవి అధికమవుతాయో, అప్పుడు 'వారి'లో ఉన్నటువంటి ఆ 'థాట్–లెస్' స్థితి అనునది మనకు కూడా వస్తూ ఉంటుంది.

ఈ సృష్టి అంతా కూడా కేవలం ఒక "దివ్య–సంకల్పం" వలన ఏర్పడింది. ఆ దివ్య సంకల్పమే సృష్టికి ప్రాణం ఇస్తున్నది, కాపాడుతున్నదీ. ఆ ఒక్క దివ్య సంకల్పంవల్లనే ఇప్పటివరకు కూడా ప్రపంచం నడుస్తూ ఉన్నది. సృష్టి అంతా నడుస్తూ ఉన్నది. ఆ ఒక్క దివ్య సంకల్పంవల్లనే సృష్టికి ప్రాణం లభించింది. థాట్–లెస్ స్థితి యొక్క ఆఖరి దశ యందు బాబూజీ ఎప్పుడైతే మనలను ఆ "దివ్య సంకల్పం"తో కలుపుతారో, అప్పుడు మనం ఆ థాట్‌లెస్ స్థితిలో, అక్కడ ఉండి కూడా ఇక్కడ అన్ని పనులు సహజంగా మన ద్వారా జరుగుతూ, ఆ దివ్య–సంకల్పం యొక్క ఆధారంవలన మనం ఈ భూమిమీద జీవించి ఉంటాం.

**ప్రశ్న: థాట్‌లెస్ స్థితి మనలో ఏర్పడిందని ఏ విధంగా తెలుస్తుంది?**

**జవాబు:** ఎప్పుడైతే మన అటెన్షన్ (దృష్టి) యందు కేవలం బాబూజీ యొక్క ప్రజెన్స్ (సాన్నిధ్యత) మాత్రమే ఉంటుందో, మన ఆలోచనలలో కేవలం బాబూజీ యొక్క స్మరణ మాత్రమే ఉంటుందో అనగా ఎప్పుడైతే మన ఆలోచనలలోను, మన జ్ఞాపకమునందు, మన దృష్టిలోను కేవలం బాబూజీయే ఉంటారో అప్పుడే మనం థాట్–లెస్‌గా ఉన్నట్లు తెలుస్తుంది. అప్పటి నుండి బాబూజీ యొక్క పని ప్రారంభమవుతుంది. అంటే ఈ థాట్‌లెస్ స్థితిలో ఇక్కడ మనలను, 'వారు' ఏ విధంగా ఉంచుతారు? ఇప్పుడు మనకు 'వారు' ఎటువంటి స్థితిని ఇస్తారంటే ఇప్పుడు మన అటెన్షన్ (దృష్టి) యందు కేవలం బాబూజీ మహరాజ్ ప్రజెన్స్ (ప్రత్యక్షత) తప్ప ఇంకా ఏమీ కనబడదు. మీ చుట్టూ అందరూ కూర్చొని ఉన్నా కాని, మీకు ఎవ్వరూ కూడా కనబడరు. కేవలం బాబూజీ యొక్క ప్రజెన్స్ మాత్రమే కనబడుతుంది. ఇంకొక విషయం ఏమిటంటే, మీరు ఏదైనా వస్తువును చూసినపుడు, ఇది చాలా బాగుంది అని నోటితో అంటారు. కాని మీరు దానితో ఎటాచ్‌మెంట్ (సంబంధాన్ని) ఏర్పరచుకోలేరు. మీ ఎటాచ్‌మెంట్ (సంబంధం) అనునది పూర్తిగా డివైన్ (దైవం)తోనే ఉంటుంది. ఇది అంతా కూడా థాట్–లెస్ స్థితి యొక్క ప్రారంభం మాత్రమే. ఎప్పుడైతే మన ఎటాచ్‌మెంట్ మరియు అటెన్షన్ నందు కేవలం బాబూజీయే ఉంటారో, మన అటెన్షన్ (దృష్టి) యందు 'వారు' మరల–మరల స్మరణకు రావడం, మనం అందరిని చూస్తున్నప్పటికిని కేవలం బాబూజీ తప్ప ఇంకా ఏమి కనబడక పోవటం, అనగా ఏ అటెన్షన్ (దృష్టి) నయితే మనం మొదట దైవంవైపు మరల్చాలి అని అనుకున్నామో, ఆ అటెన్షన్ మన దృష్టి యందు బాబూజీయే లయమయ్యారని అర్థం చేసుకోవాలి. ఇది థాట్–లెస్ స్థితి యొక్క ప్రారంభదశ.

ఎప్పుడైతే అభ్యాసికి బాబూజీ ఎడల ఎటాచ్‌మెంట్ (సంబంధం) అనునది ప్రగాఢమవుతుందో, అప్పుడు అభ్యాసీ ఏ పని చేసినా, ఎవరిని చూసినా, అన్నివైపుల అతనికి కేవలం బాబూజీయే కనబడతారు. ఈ స్థితిలో అభ్యాసీ ఎదురుగా కూర్చొని ఉన్న తన తల్లిని చూడాలని ప్రయత్నించినా కూడా చూడలేడు. ఆమె శరీరాన్ని స్పర్శిస్తాడు. కాని బాబూజీ తప్ప ఇంకా ఎవ్వరు కూడా అభ్యాసీకి కనబడరు. అభ్యాసీ మనస్సు యందు, దృష్టి యందు డివైన్-పర్సనాలిటీ (దివ్య పురుషుడు) యొక్క డివైన్-ప్రజెన్స్ (దివ్య-సాన్నిధ్యత)అనునది ఏ విధంగా ఉంటుందంటే, అతడు బాబూజీని తప్ప ఇంకా ఎవరిని కాని, దేనిని కాని చూడలేడు.

థాట్-లెస్ స్థితి యొక్క చివరి స్థితి ఏమిటంటే, ఏ 'సంకల్పం' వలన అయితే ఈ సృష్టికి ప్రాణం లభిస్తున్నదో, ఆ 'దివ్య-సంకల్పం' నందు బాబూజీ మనలను లయం చేస్తారు.

అభ్యాసీ సామాన్యంగా తన ఇష్టప్రకారం తన కోర్కెలకు (అభిరుచులకు) అనుగుణంగా ఆలోచిస్తూ ఉంటాడు. అందుచేత అతనికి ఆలోచనలు కలుగుతూ ఉంటాయి. అలా కాకుండా కేవలం నోటితో ఉచ్చరించటం కాకుండా 'వారి'కే సమర్పితమై ఉండి, మన (స్వ) లేకుండా 'వారి'నే మన హృదయంలో (అంతరంగంలో) నిలుపుకుంటే 'వారి' ఇష్ట ప్రకారమే జరుగుతుంది. అలా 'వారు' ఇచ్చిన స్థితులే మనవవుతాయి.

బాబూజీ చెప్పారు- "నేను ఏ ఒక్కరికి మాత్రమే ముక్తి కలిగించి లయావస్థను ప్రాప్తింపజేయటానికి రాలేదు, అందరికీ అది లభ్యం కావాలనే తలంపుతో వచ్చాను. కనుక అందరూ దానిని సిద్ధింపజేసుకోవటానికి ప్రయత్నించాలి" అని. కనుక మళ్ళీ మళ్ళీ అభ్యాసులందరికీ ఈ విషయాన్ని గుర్తు చేస్తూ, అందరూ కూడా ఆ లయావస్థను పొందటానికి ప్రయత్నించమని కోరుతున్నాను.

**ప్రశ్న: లయావస్థ అన్నా, థాట్‌లెస్ కండిషన్ అన్నా ఒకటియేనా?**

**జవాబు:** ఆ రెండూ ఒకటి కాదు. లయావస్థలో శరీరం యొక్క స్పృహ ఉండదు. అది సిద్ధించిన అభ్యాసికి ఈ శరీరంతో ఉన్నప్పటికీ తనకు ఎదురుగా ఉన్నదేమీ పట్టదు. తామరాకు మీద నీటిబొట్టు నిలవనట్లే అతనికి ప్రాపంచిక విషయాలు ఏమీ పట్టవు. లయావస్థ కలగనంతవరకు, తన శారీరక స్పృహ ఉండి, ఆలోచనలు వస్తూ ఉంటాయి. ఈ థాట్‌లెస్ కండిషన్ బాబూజీ అనుగ్రహంవలన కలుగుతుంది.

**ప్రశ్న: ధ్యానంలో ఒక్కోసారి బాగుంటుంది. మరోసారి అంత బాగుండదు. కారణం ఏమిటి?**

**జవాబు:** ధ్యానం మనం 'వారి' ఆనందం కొరకు చేయాలి. మన ఆనందం కొరకు కాదు. ధ్యానం ఎట్లా ఉన్నా, అంటే ధ్యానంలో ఆనందాన్ని పొందినా, పొందకపోయినా అది కూడా 'వారి' కృపయే అని భావించాలి. బాబూజీ మనకు ఎప్పుడూ సాక్షాత్కార స్థితిని ప్రసాదించటానికి ఎదురుచూస్తుంటారు. కాబట్టి 'వారి' ఆనందం కొరకు మనం ధ్యానం చేయాలి. ఎప్పుడూ మనం 'వారి' కనెక్షన్ (సంబంధం)ను మాత్రం కలిగి ఉండాలి.

మైండ్ అనేది సమస్యల కోసం, ఆలోచనల కోసం ఇవ్వబడితే హృదయం దైవం (దివ్యత్వం) కోసం ఇవ్వబడింది. సమస్యను గురించిన ఆలోచనలోనే మనకు ఆనందం కలుగుతుంది. బాధకు మందు తీసుకుంటున్నా దాని గురించే ఆలోచన ఉంటుంది. బాబూజీ చెప్పారు- మనిషికి సుఖమే ఎక్కువ కాలం ఉంటుంది. దుఃఖం చాలా తక్కువ సమయమే ఉంటుంది. కాని మానవుడు సుఖాన్ని తలచుకోకుండా కష్టాన్నే నెమరువేసుకుంటూ ఉంటాడు. వ్యాధికి గురైన వ్యక్తి అది తగ్గిన తర్వాత కూడా తనకు వ్యాధిలో కలిగిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ

ఉన్నటువంటిదే ఇది. జీవితమన్నాక కష్టసుఖాలు కావడికుండలని అనుభవపూర్వకంగా చెప్పబడుతున్న విషయమే ఇది.

**ప్రశ్న: సంస్థలో ఏదో కలవరం కొనసాగుతోంది. మాస్టర్ అభీష్టానికి అనుగుణంగా సాగటంలేదు.**

**జవాబు:** మనం సహజమార్గంలో ప్రయాణిస్తున్నాం, సాధన చేస్తున్నాం. బాబూజీ నుంచి ప్రాణాహుతి పొందుతున్నాం, 'వారి' నుంచి అనుగ్రహం పొందుతున్నాం. ఇంక మనకు కలత ఎందుకు ఉండాలి? అశాంతి లేదా కల్లోలం అనేది మన మనస్సులోని భావం. అటువంటి ఊహాగానాలు చేయటం మన అలవాటు. మిషన్‌లో ఏమీ కలవరంలేదు, మనల్ని మనమే కలవరపరచుకుంటున్నాం. అందుచేత మన బుద్ధిని దైవంవైపు మరల్చి సాక్షాత్కారం పొందాలి. సంస్థను నిర్వహించే బాధ్యతను బాబూజీ మరొకరికి అప్పగించారు అంతే. కనుక నీలోని నీవైపు తొంగిచూడకుండా బాబూజీ మహరాజ్ వంక చూసినట్లయితే ఏ ఇబ్బందీ కలుగదు. సమస్యకు పరిష్కారం పొందాలంటే బాబూజీవైపు దృష్టి సారించాలి. కనుక బాబూజీయే పరిష్కారం.

**ప్రశ్న: ఆత్మ శరీరాన్ని విడిచిపెట్టాక ఎక్కడకు వెళ్తుంది?**

**జవాబు:** ఆత్మ ఎక్కడకు వెళ్తుంది అని అడగటానికి బదులు ఏమవుతుంది అని అడిగి ఉండాల్సింది. స్వర్గనరకాలు అనేవి లేవు. శరీరం విడిచిపెట్టాక ఆత్మ మళ్ళీ జన్మ తీసుకునేవరకు వాతావరణంలో ఉండిపోతుంది. ఆత్మ సూక్ష్మశరీరానికి సంబంధించినది. జీవితకాలంలో మానవుని చర్యలవలన అనగా చెడువలన స్థూలత్వం (గ్రాస్‌నెస్) చెంది ఉంటే నరకమని, మంచి చేసి సూక్ష్మత్వం చెంది ఉంటే దాని ఆనందం వలన స్వర్గమని అనిపిస్తుంది. ఎవరికైతే సహజమార్గం మీద శ్రీ బాబూజీ మీద పూర్ణ విశ్వాసం ఉంటుందో, వారి దృష్టి బాబూజీవైపే ఉన్నప్పుడు మరణానంతరం కూడా అట్టి వారి ఆత్మ బాబూజీవైపు లాగబడుతూ ఉంటుంది.

**ప్రశ్న: మరణానంతరం ఆత్మ వాతావరణంలో పది పన్నెండు రోజుల వరకూ పరిభ్రమణం చేస్తూ ఉంటుందంటారు, ఏమిటి?**

**జవాబు:** ఆత్మ వీడిపోతుంది. కాని సూక్ష్మ శరీరం దాని అనుబంధాన్ని బట్టి కొంతకాలం ఉంటుంది. ఆత్మ వేరు, సూక్ష్మ శరీరం వేరు. ఆత్మ అంటే శరీరం కాదు.

**ప్రశ్న: మరణించినపుడు బంధువులు విలపిస్తూ ఉంటారు. ఆత్మకు శరీరం వదలినట్లు తెలుస్తుందా?**

**జవాబు:** ఆత్మకు మైండ్ లేదు, మరణం లేదు. కాబట్టి దానికి తెలియదు. మనిషికి మాత్రమే మైండ్ ఉంది.

**ప్రశ్న: మరణానంతరం వీడిపోయిన ఆత్మకు కర్మలు ఆచరించాలా?**

**జవాబు:** కర్మలు చేయనవసరంలేదు. ఆచారాలు ఏర్పడి ఉన్నాయి. కనుక ఇతరులు ఏమైనా అనుకుంటారేమోనన్న అభిప్రాయం ఉంటే చేయవచ్చు. గృహస్థుగా ఉన్నప్పుడు కుటుంబీకులు తృప్తి చెందకపోతే అశాంతి వాతావరణం ఏర్పడుతుంది కనుక వారి తృప్తి కోసం చేయవచ్చు.

తృప్తి గురించి ఒక ఉదాహరణ చెప్తాను. ఒక అభ్యాసీ దేవాలయం చూసినపుడు నమస్కారం చేయాలనుకునేవాడు. కాని బాబూజీ సమక్షంలో అలా చేయటానికి వెనకాడుతూ ఉండేవాడు. బాబూజీకి అతడి సంగతి తెలిసి గమనిస్తూ ఉన్నారు. కాని ఎప్పుడైతే బాబూజీ గమనించటం లేదని అనుకున్నాడో అప్పుడు బాహ్యంగా గుడివైపు చూస్తూ నమస్కారం చేశాడు. అంటే బాబూజీయే సమస్తమూ అని పూర్ణ

విశ్వాసం అలవరచుకోనంతవరకు మనస్సు అలా లాగుతూ ఉంటుంది. కేవలం "బాబూజీ నా వారు" అనుకోవటంతో సరిపోదు. హృదయాంతరాళంలో ఆ విశ్వాసం, సమర్పణ ఉండాలి. బాబూజీని ఆరాధించేవారు ప్రోగ్రెస్ పొందుతూనే ఉంటారు. ప్రోగ్రెస్ నిలిచిపోవటం జరగదు.

**ప్రశ్న: ఆత్మకు మైండ్ లేదు. దాని మీద ఆలోచనల ప్రభావం పడుతుందా?**

**జవాబు:** ఆలోచనలు ఆత్మతో కాక వేరుగా ఉంటాయి. ఆత్మపై వాటి ప్రభావం పడదు. మనం చేసే చర్యలు చెడ్డవైతే ఆత్మకు దూరంగా వెళ్తాయి. అవే మంచివైతే సామీప్యం చెందుతూ అవి దివ్యమైపోతాయి.

ఒక స్థితిని గురించి – నా ఆత్మ దివ్యానందంతో నృత్యం చేస్తున్నట్లుగా అనిపిస్తున్నది అని బాబూజీకి వ్రాశాను. అప్పుడు దానికి జవాబుగా **వారు**, "ఆత్మ పరమాత్మతో విలీనమయ్యే సమయం వచ్చినప్పుడు పరమాత్మ యొక్క వైబ్రేషన్స్ (తరంగాలు, కంపనాలు) ఆత్మను స్పర్శించడంవలన, ఆత్మ దివ్యానందంతో నృత్యం చేస్తుంది. ఆ ఆత్మ–నృత్యం కేవలం ఒక్కసారి మాత్రమే జరుగుతుంది.

చాలామంది అభ్యాసులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందలేకపోతున్నామంటారు. దానికి కారణం– అభ్యాసి తన మనస్సు యొక్క కార్యకలాపాలను మర్చిపోలేకపోవటం. వాటిలోనే మునిగి తేలడం మూలంగా అవుతుంది. అందుచేత మనస్సు తన కార్యకలాపాలను స్మరించుకుంటూ వాటిలో రమించటం మానివేస్తే ఆధ్యాత్మికానందం చోటుచేసుకుంటుంది. మనకు ఆ ఒక్కొక్క స్థితిలో కలిగే ఆనందం మనదే అవుతుంది. కాని మనస్సు యొక్క ఆలోచనలవలన దానిని అనగా ఆ అనుభూతిని గ్రహించలేకపోవటం జరుగుతుంది. నిన్న కలిగిన అనుభూతి ఈ రోజు కలగలేదు అని అనుకోవటం అది మనస్స యొక్క చర్యలవలన కలిగే సంశయం. పూర్వం ఉన్నంత ప్రోగ్రెస్ ఇప్పుడు ఉండడం లేదని అనుకుంటారు. మీరు బాబూజీ మాటలపై ఎందుకు విశ్వాసం ఉంచరు? ఇంకొకటి ఏమిటంటే, డివైన్ (దైవం) నుండి మనకు లభించే వరదానం (అనగా ప్రాణాహుతి శక్తి) శక్తివంతమైనది. దాని వలన ప్రోగ్రెస్ తప్పకుండా ఉంటుంది. ఆలోచనలు రాకపోతే ధ్యానం బాగా ఉంది అనీ ఆలోచనలు వస్తే ధ్యానం జరగలేదని, మనం మన ప్రోగ్రెస్ కొరకు ఆలోచనల (మనస్సు) మీద ఆధారపడుతున్నాం. కాని ఇది చాలా తప్పు. ప్రోగ్రెస్ అనేది ఫీలింగ్ (అనుభూతి) హృదయం మీద ఆధారపడి ఉన్నది.

**ప్రశ్న: నాకు ధ్యానంలో ఇదివరలో కలిగిన ఆనందం ఇప్పుడు కలగటంలేదు, ఎందుచేత?**

**జవాబు:** నీవు పదిహేనేళ్ళ క్రితం అస్వస్థుడవైనపుడు పడిన బాధల్ని తర్వాత మెరుగుపడిన ఆరోగ్యాన్ని గుర్తు చేసుకోగలవు. అలాగే నీవు పదిహేనేళ్ళుగా అభ్యాసిగా ఉండి మొదట్లో పొందిన అనుభూతుల్ని జ్ఞాపకం చేసుకొని ఇప్పుడు పొందుతున్న దానిని పోల్చుకుంటే నీవు పొందుతున్న ఆనందం ఏమిటో నీకు తెలుస్తుంది. దానిని తెలుసుకోవటానికి నీవు ప్రయత్నించటంలేదు. కనుక నీ అనుభూతుల్లో మార్పును గుర్తు చేసుకుంటే నీకే తెలుస్తుంది.

మనందరికీ సాక్షాత్కారం కలిగించాలని, అందుకు మనందరినీ యోగ్యులుగా చేయాలని బాబూజీ మహరాజ్ యొక్క సంకల్పం. అందుచేత మనం హృదయం విప్పి వారినే ఆరాధిస్తే మనకు ప్రోగ్రెస్ కలుగుతుంది. అలా కాకుండా మన గురించే మనం ఆలోచించుకుంటూ, మన మనస్సుకే (మానసిక ఆలోచనలకే) పరిమితమై పోతూ ఉంటే మనకు ప్రోగ్రెస్ తెలియదు. అందుచేత ఎంతసేపూ హృదయంలో వారినే దర్శిస్తూ ఉండాలి.

ఒక అభ్యాసీ, "బాబూజీ! మా కోసం ఇది చేయండి, అది చేయండని అంటారు. మీరు మహాత్ములు కదా! అవి మీరే చేయవచ్చును కదా?" అని అడిగినపుడు, **వారు** నవ్వుతూ సోదరితో, "బిటియా! ఇది ఎటువంటి యుగం! మందు నేను త్రాగాలి, ఫలితం మాత్రం అభ్యాసీకి కావాలి" అని మరల ఈ విధంగా అన్నారు– "రోగికి జబ్బునయం కాకపోతే అతడు డాక్టర్‌ను మార్చగలడు. కాని డాక్టర్ రోగిని మార్చడు, వెళ్ళిపో అని అనడు కదా!" (అంటే మనం బాబూజీని విడిచిపెట్టినా 'వారు' మనలను విడిచిపెట్టరని అర్థం).

'వారి'కి మన మీద ఎంత విశ్వాసం ఉంది. ఎంత ప్రేమ ఉంది, అనే విషయాన్ని మనం గమనించడంలేదు. మన కష్టాలను 'వారు' తీసుకుని సుఖాలను మనకు ఇస్తున్నారు. 'వారు' మేల్కొని, మనకు విశ్రాంతిని, నిద్రను ఇస్తున్నారు. 'వారి' ప్రేమ– వర్షమును పొందుతున్న మనం, ప్రోగ్రెస్ కావడంలేదని ఏ ఒక్క క్షణం, ఒక్క రోజు, ఒక్క ధ్యానం నందు కూడా అనుకోకూడదు. ప్రతీరోజు కూడా మనం పురోగమిస్తున్నాం. ఎందుకంటే, "ధ్యానం అనగా ఏదో కొంత పొందడం" అని బాబూజీ అన్నారు. కొంత పొందడం యొక్క అర్థం ఏమిటంటే, "వారు మన వారు" అని.

**ప్రశ్న: బాబూజీ యొక్క వ్యక్తిత్వం అనుభవంలోనికి రానిదే 'వారి' మీద మాకు విశ్వాసం ఎలా కలుగుతుంది?**
**జవాబు:** మీరు అలహాబాద్‌లో ఉన్నారు. నేను ఇక్కడ ఉన్నాను. నేను మీ గురించి ఎలా తెలుసుకోగలను? ఇప్పుడు మీరు నా ఎదుటనే, నాతోనే ఉన్నారు. కాబట్టి నేను మీ గురించి తెలుసుకోగలను. కాబట్టి మీరు సాధన ద్వారా 'వారి' సామీప్యతను పొంది 'వారి' వ్యక్తిత్వమును గురించి తెలుసుకోండి.

బాబూజీ యొక్క వ్యక్తిత్వం మనకు తెలియాలంటే, మనకు 'వారి' నిరంతర స్మరణ ఉండాలి. దానివలన నిరంతర సంబంధం ఉంటుంది. ఎప్పుడైతే బాబూజీ యొక్క జ్ఞాపకం వస్తుందో, బాబూజీ మన వారేనన్న భావం, మనతోనే ఉన్నారన్న భావం వస్తుంది. వారిపై మన దృష్టి నిలిచి ఉంటే మనకు వారితో సంబంధం కూడా నిలిచి ఉంటుంది. అది నామమాత్రంగా ఎక్కువసార్లు తలచుకోవటం కాదు. హృదయంతో సంబంధం ఏర్పరచుకోవాలి. అపుడు మనకు విశ్వాసం కలుగుతుంది.

ఈశ్వరుడు ఉన్నాడు అనగా బాబూజీ ఉన్నారు. 'వారు' మనకు ఎంత సమీపంగా ఉన్నారంటే, మన కష్టాల్ని తొలగించటానికి శక్తిని సమీకరించి సహాయపడటానికే సిద్ధంగా ఉన్నారు. మనకు 'వారు' ఎంతో సమీపంగా ఉన్నా మనం గుర్తించలేకపోతున్నాం. వారితో సదా సంబంధం ఏర్పరచుకోలేకపోతున్నాం. 'వారు' మనతోనే ఉన్నారన్న అనుభూతి పొందలేకపోతున్నాం. మనకోసమే 'వారు' ఉన్నారు కాని **వారి** కోసం కాదు. దీన్ని అనుభూతి చెందితే విశ్వాసం కలుగుతుంది.

మీ సెంటర్‌కు నేను వచ్చినప్పుడు చాలా బిజీగా ఉండటంవలన మీకు ప్రశ్నలు అడిగే అవకాశం తక్కువ. ఇక్కడైతే బాగా అవకాశం ఉంది కనుక అడగండి. డాక్టర్ పార్థసారాధిగారు చాలా అంకిత భావంతో, బాబూజీ యొక్క చాలా సామీప్యస్థితితో పని చేస్తారు. అందుకే నాకు వారన్నా, ఆ సెంటరన్నా చాలా అభిమానం. అలాగే తిరుపతి సెంటర్‌లో పాండురంగారావుగారు సెంటర్ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు అభ్యాసులు అందరూ బాబూజీ మహరాజ్ సామీప్యతను పొందేవారు. బాబూజీకి కూడా చాలా ఇష్టంగా ఉండేది. అందుచేత బాగా పనిచేసే సెంటర్లను చూసినపుడు మరింత ఆనందం కలిగి ఎక్కువ పనిచేయాలనిపిస్తుంది. ఈ విధంగా

మంచి "సెంటర్ ఇన్‌చార్జి" దొరకడమనేది ఆ సెంటర్ అభ్యాసుల అదృష్టం. అటువంటి మంచి సెంటర్లు చాలా అరుదుగా ఉంటాయి.

మనం మిషన్‌లో చేరాం. శ్రీ బాబూజీ మహరాజ్ చరణాలవద్ద ఆశ్రయం పొందామంటే మనం దీనులము కాము. హీనులమూ కాము. బికారీలమూ కాము. బాబూజీ చెప్పారు – "నేను ఆధ్యాత్మికత గురించి ఎవరినీ కూడా బికారీలుగా ఉండనివ్వను, అంతా ఇస్తూనే ఉన్నాను. అయినా కొంతమందికి తాము పొందటం లేదనే స్వల్ప ఆలోచనలు ఎందుకు వస్తాయో తెలియదు. నేను అందరినీ అనంతానికి తీసుకు వెళ్ళటానికే వచ్చాను" అన్నారు బాబూజీ. సంస్థలో చేరిన ఆరంభదశలో మనం 'వారి' చరణాలవద్ద ఉన్నాం అనుకొంటాం. కొంతకాలం గడిచేసరికి, మేము బిచ్చమెత్తకోవటానికి రాలేదు, మీ నుంచి ఆధ్యాత్మికతను పొందటం మా హక్కు అనిపిస్తుంది.

మనిషి చాలా తెలివైనవాడు. ఒక అభ్యాసి బాబూజీ ఎదుట తలవంచి నాకు అది ఇవ్వండి, ఇది ఇవ్వండి అని అడిగాడు. బాబూజీ అపుడు – ఎంత వినయం నీది – అని చమత్కరించారు.

మనం దీనంగా అడగటం కాదు. ఆధ్యాత్మికతను (స్పిరిట్యుయాలిటీ) హక్కుగా పొందాలి గాని దైన్యం పనికిరాదు. వారిపైన మనకు ఎంత హక్కు ఉందంటే, ఒకటి– 'వారు' మానవమాత్రులమైన మన కోసమే వచ్చారు. రెండవది– 'వారు' తెచ్చినదేదో మనకోసమే తెచ్చారు. మూడవది– మనపై ప్రేమ వర్షింపజేయటానికే వచ్చారు. కనుక మనకు దక్కనిది ఏముంటుంది! ఉదాహరణకు మన సేవకుడు విశ్వాసంగా ఉన్నాడనుకుందాము. అతను ఏమీ అడగడు. కాని అది ఇద్దాం, ఇది ఇద్దాం అనుకుంటూ ఏమేమో ఎన్నో ఇవ్వాలనిపిస్తుంది మనకు. అందుచేత హక్కు ప్రసక్తి లేకపోయినా ఏమీ ఇవ్వకుండా ఉండలేము. అలాగే మనం వారిపట్ల ప్రేమ, విశ్వాసం కలిగి ఉంటే 'వారు' మనకు అన్నీ ఇస్తారు. మనకు ఏమీ ఇవ్వకుండా ఉండలేరు.

డాక్టర్. కె. సి. వరదాచారిగారు ఒకసారి బాబూజీతో, "మీరు దివ్య పురుషులు కదా! మీ కుమారుడు దినేష్‌ను రక్షించి ఉండవలసింది కదా!" అని అన్నారు. బాబూజీ అందుకు సమాధానంగా– "నేను నా కుమారుడిని సృష్టి (విధి) నిర్ణయానికి వ్యతిరేకంగా జీవింపజేసి ఉన్నట్లయితే అదే విధంగా మరొకరు కూడా అలాగే కోరటం జరుగుతుంది. అందుచేత జనన మరణాల విషయంలో సృష్టి తలంపు (విధి విధానం) ప్రకారమే జరగనివ్వాలి. నేను నేచర్‌ను మరల ఆ దివ్య–సౌందర్యముతో అలంకరించడానికి వచ్చాను, కాని నేచర్ (ప్రకృతి) యొక్క నియమాలను చెడగొట్టడానికి రాలేదు" అని అన్నారు.

**బీజ–దగ్ధ స్థితి:** సూక్ష్మ శరీరం కరిగిపోతుంది, లయమైపోతుంది. కాని కారణ శరీరం లయం కాదు. బాబూజీ దివ్యప్రేమ యొక్క వేడిమి వలన కారణ–శరీరం దగ్ధమవుతుంది. దీనిని "బీజ–దగ్ధ" స్థితి అని అంటారు.

**ప్రశ్న: ఈ హక్కును పొందటం ఎలా?**

**జవాబు:** బాబూజీతో కనెక్షన్ (సంబంధం) కలిగి ఉండటం ద్వారా 'వారి' నుండి పొందే హక్కు లభిస్తుంది.

ఒక అభ్యాసి బాబూజీ మహరాజ్‌తో "మీరు మా కోసం వచ్చారు. మీతో మాకు కనెక్షన్ ఏర్పడింది" అన్నప్పుడు 'వారు' ఏమన్నారంటే, "అవును, అది నిజమే. కరెంటు కనెక్షన్‌లాగా అది స్విచ్ వేస్తేనే కాని వెలగదు" అన్నారు. అనగా సాధన ద్వారానే అది సాధ్యపడుతుందని అర్థం.

"మీరు మాకు తండ్రివంటివారు, మేము మీ బిడ్డలము, కనుక మాకు మీ నుండి పొందే హక్కు ఏర్పడుతుంది" అని అభ్యాసులు అన్నపుడు, బాబూజీ "ఏ రోజునయితే మీరు నా బిడ్డలుగా తయారు అవుతారో, ఆ రోజున మీకు లభించవలసిన దానిని మీరు పొందుతారు" అని అన్నారు. దీనిని సోదరి వివరిస్తూ, మనం చిన్న పిల్లలుగా మారడం, తయారు కావడమనేది చాలా కష్టమైన విషయం. చిన్న పిల్లవానికి కేవలం అమ్మ గురించే తెలుస్తుంది. అమ్మ తనకు ఏదైనా ఇస్తుందా, లేదా అనేది కూడా తెలియదు. కాని చిన్నపిల్లవాడు తన తల్లి లేకుండా మాత్రం ఉండలేడు" అని అన్నారు. మరల సోదరి "బాబూజీ మన వారు" అనే ఒకే భావనను కలిగి ఉండండి. అప్పుడు అన్నీ లభిస్తాయి" అని అన్నారు.

**లిబరేషన్ (ముక్తి) అనేది మూడు దశలుగా ఉంటుంది. అవి**

**1) ఆత్మ పరమాత్మ యందు విలీనమైనప్పుడు.**

**2) మానవుని యొక్క ఐడెంటిటీ (అస్థిత్వం) అనేది దాని మూలం (సోర్స్)లో విలీనమైనప్పుడు.**

**3) ఎక్కడి నుండి అయితే సృష్టి ప్రారంభమైనదో అక్కడికి మానవుడు చేరుకొన్నప్పుడు.**

బ్రైటర్‌వరల్డ్ (తేజోలోకం)లో ఉన్నప్పుడు ఆత్మకు కనీసపు వ్యక్తిత్వం ఉంటుంది. అక్కడ ఆత్మ ఆనందావస్థలో ఉంటుంది. ఆత్మలు అక్కడ మరపు స్థితిలో ఉంటాయి. ఎవరైనా దివ్యశక్తివంతుడు వాటిని జాగృతపరచి తమ ఇచ్ఛాశక్తితో పని చేయించాలనుకుంటే పని చేస్తాయి. అంతేగాని స్వయంగా పనిచేయటం ఉండదు.

"అభ్యాసం మినహా నాకేమీ తెలియదు. నేను పుస్తకాలేమీ చదవలేదు. ఇదెలా అర్థమవుతుంది" అన్నాను బాబూజీతో. అపుడు బాబూజీ, "నీవు సాధన ద్వారా పూర్ణస్థితిని పొందాక అపుడు చదవటం ప్రారంభిస్తే నిజమైన అర్థం తెలుస్తుంది. ప్రేమ, భక్తి పెంపొందించే పుస్తకాలను తప్పకుండా చదువవచ్చు" అని అన్నారు.

బాబూజీతో ఒక అభ్యాసీ, "నేను మిమ్మల్ని బాగా ఎక్కువసార్లు గుర్తుంచుకుంటూ ఉంటాను. మీరు నన్ను ఎలా గుర్తుంచుకుంటారు" అని అడగగా బాబూజీ అన్నారు, "నేనొక ప్రశ్న అడుగుతాను. నీవు జవాబు చెప్పు. అందులోనే సమాధానం వస్తుంది. నిన్ను నీవు ఎన్నిసార్లు మరచిపోయావో చెప్పు" అన్నారు. దానికి ఆ అభ్యాసి జవాబు చెప్పలేకపోయాడు. అప్పుడు మరల బాబూజీ రెండు జ్ఞాపకాలు ఒకేసారి ఉండవు. నన్ను జ్ఞాపకం పెట్టుకోవాలంటే నిన్ను నీవు మరచిపోవాలి. నీ జ్ఞాపకం నీకు ఉంటే నేను అక్కడ లేను. నీకు నా జ్ఞాపకం ఉంటే నీవు అక్కడ లేవు" అని అన్నారు.

**ప్రశ్న: ఒక్కొక్కసారి ఉన్నట్లుండి బాబూజీ రూపం కనపడుతుంది. అది భౌతిక రూపమా?**

**జవాబు:** ఎప్పుడైతే మనకు బాబూజీ ఎడల ప్రగాఢమైన అనుబంధం ఏర్పడుతుందో అప్పుడు ఒక్కొక్కసారి 'వారి' రూపం మనకు కనపడుతుంది. కాని అది షాజహాన్‌పూర్–బాబూజీ కాదు. అది 'వారి' యొక్క ప్రజెన్స్ (ప్రత్యక్షత) మాత్రమే. ఒక్కొక్కసారి మనలో ప్రేమను అధికం చేయడానికి అప్పుడప్పుడు 'వారి' రూపం కనపడుతుంది. నాకు కూడా ఆ విధంగా చాలాసార్లు జరిగింది. తరువాత మరల కనపడలేదు.

1) భౌతక రూపం

2) అంధుడైన సూరదాసు బావిలో పడినప్పుడు శ్రీకృష్ణుడు అతనిని పైకి తీసుకొని వచ్చిన తరువాత, భక్త సూరదాసు నుండి తన చేతులను శ్రీకృష్ణుడు విడిపించుకొని పోతూన్నప్పుడు "నీవు భౌతికంగా నన్ను

విడిపించుకొని వెళ్ళావు కాని ధైర్యం ఉంటే నా హృదయంలో నుండి వెళ్ళిపో" అని భక్త సూరదాసు శ్రీకృష్ణునితో అంటాడు. (సూరదాసు హృదయంలో ఉన్నది శ్రీకృష్ణుని యొక్క ప్రెజెన్స్ అన్నమాట)

మనకు అప్పుడప్పుడు బాబూజీ రూపం మన ఎదుటనే ఉన్నట్లుగా కనపడతుంది. అది భౌతిక రూపం కాదు. అది 'వారి' ప్రెజెన్స్ మాత్రమే.

3) మూడవ దశలో మనకు 'వారి' ప్రజెన్స్ మన ఎదుట కాని, వేరే చోట కాని, ఎక్కడ గాని ఉన్నట్లుగా అనిపించదు. ఏ విధంగా అంటే ఇప్పుడు 'మన' ప్రెజెన్స్ 'అక్కడ' ఉన్నట్లుగా అనుభూతిని చెందుతాము.

4) ఒక్కొక్కసారి ఉన్నట్లుండి మన ఎదుట ఒక ఫ్లాష్ (తేజస్సు) లాగా కనపడుతుంది.

ఈ విధంగా బాబూజీ యొక్క ప్రెజెన్స్ అనేది మనం పొందే స్థితులను బట్టి మారుతూ ఉంటుంది.

చెట్లు, ముళ్ళు ధరించి పూలను మనకు ఇచ్చినట్లుగానే మహాత్ములు కష్టాలు అనే ముళ్ళను వారు ధరించి పుష్పాలు అనే సుఖాలను మనకు అందిస్తారు.

'వారు' మన ప్రతి తప్పిదాన్నీ మన్నిస్తున్నారు. మన తప్పులన్నీ 'వారు' స్వీకరిస్తున్నారు. మనల్ని ఉన్నతికి తీసుకు పోవటానికి ప్రయత్నిస్తున్నారు. మనం పతనమవుతున్నామన్న ఆలోచనలో లయమై ఉంటున్నాం. ఎంతగా దిగజారిపోయామో కూడా ఆలోచించలేకపోతున్నాం. కాని 'వారు' మనల్ని తమ ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) ద్వారా మనల్ని సరిచేసి ఉద్ధరించటానికే ప్రయత్నిస్తున్నారు.

ఎవరైనా మానసికంగా గాని, శారీరకంగా గాని బాధతో ఉన్నప్పుడు దానిని కూడా దైవకృప అనియే భావించాలి అని బాబూజీ చెప్పారు.

**ప్రశ్న: వారంటే మహాపురుషులు, మనమేమో కేవలం అభ్యాసులం. అప్పుడప్పుడు మన కుటుంబ విషయాల గురించి, పిల్లల గురించి ఆలోచించవలసి ఉంటుంది గదా!**

**జవాబు:** ఇబ్బందులు వస్తాయి. ఆలోచిస్తాము, మన సంస్కారాలు వేరు, వారివి వేరు. మనకు అభ్యాసిగా వారిపై విశ్వాసం ఉంటుంది. పిల్లలకు ఉండకపోవచ్చు. మనం బాబూజీ ముందు మన సమస్యలు నివేదించుకుంటాం. 'వారి' కృపతో ఎంతవరకు మేలు జరగాలో అంతవరకు జరుగుతుంది. మనం యోగక్షేమాల గురించి అవసరం వచ్చినప్పుడు వారికి నివేదించుకుంటే దివ్యకృప ప్రసారమవుతూ ఉంటుంది. మేము ఇంత విశ్వాసంగా ఉన్నాం, మాకు మేలు జరగాలనే డిమాండ్ చేయటం మంచిది కాదు. మనం ఈ ప్రపంచంలోకి ఎందుకు వచ్చామో తెలుసుకొని ఆ వైపు మన ఉన్నతి కొరకు అభ్యర్థిస్తున్నాం. 'వారు' మనకు ఆధ్యాత్మికోన్నతి కలిగించటానికే వచ్చారు కాని సామాన్య విషయాల కోసం కాదు. బాధలు కలిగినప్పుడు సహనం వహించాలి. 'వారు' మనకు దైవత్వం (డివినిటీ) చేకూర్చటానికే వచ్చారు కనుక దానినే మనం కోరుకోవాలి.

"మా అబ్బాయి చాలా అనారోగ్యంగా ఉన్నాడు. చాలా కష్టాల్లో ఉన్నాడు. మా కోసం ప్రార్థన చేయండి" అని నాతో అంటారు. "బాబూజీ! ఇతడు మీ బిడ్డ. ఇతనిని మీరు ఏ విధంగా అనుకుంటే ఆ విధంగా ఉంచండి. మీకు ఇష్టమైతే ఇతని బాధను దూరం చేయండి లేదా ఆ బాధను భరించే సహనశక్తిని ఇతనికి ప్రసాదించండి. అంతా మీ కృప" –అని నేను బాబూజీని ప్రార్థిస్తాను.

ఎవరైనా తమ సమస్యలను, కష్టాలను గురించి బాబూజీకి చెప్పినప్పుడు, ఆ అభ్యాసితో **వారు**, "నీవూ నేను ఇద్దరం కలిసి భగవంతుడిని ప్రార్థన చేద్దాం. ఆయనే మాలిక్" అని అనేవారు.

కాబట్టి అనారోగ్యం, ప్రాపంచికమైన సమస్యలు, కష్టాలు మొదలైనవి ఎప్పుడైనా మనకు జ్ఞాపకం వచ్చినప్పుడు 'వారి'ని ప్రార్థించడానికి బదులుగా ఆ సమస్యలను వెంటనే 'బాబూజీ' చరణాలకు సమర్పించాలి. ఈ విధంగా చేయడం చాలా మంచిది. చాలా సులభం. సమస్యలు గుర్తుకు వచ్చినప్పుడు "బాబూజీ! ఈ కష్టాన్ని, సమస్యను మీ పాదాల దగ్గర ఉంచుతున్నాను. మేము ఏమీ చేయలేము, అంతా మీ కృప" అని అనుకోవాలి.

**"ఆప్‌నే సిజ్ దేకె సివా దూస్‌రే కా సిజ్‌దా హరామ్"** దీని అర్థం ఏమిటంటే, ఇది సారూప్యతా స్థితికి సంబంధించినది. నిన్ను నీవు చూసుకొనినప్పుడు, నీకు నీవు కనపడవు కాని 'వారి' దర్శనం అయినట్లుగా ఉంటుంది. ఎవరికైనా నీవు నమస్కారం చేసినపుడు మనమే మనకు నమస్కారం చేస్తున్నట్లుగా అనిపిస్తుంది. దీనికి నిరూపణ 'అనంత యాత్ర' పుస్తకంలో ఉంది. ఒకసారి నేను వారికి "బాబూజీ! చాలా రోజుల నుండి నేను తల దువ్వుకోవడం లేదు. ఎందుకంటే, అద్దం ముందు ఎప్పుడు నిలబడినా నాకు మీ ముఖమే కనపడతున్నది. అందువలన మరల వెనుకకు వచ్చేదానిని" అని వ్రాసినపుడు వెంటనే **వారు** "బిటియా! నేను కూడా చాలా రోజుల నుండి గడ్డం కత్తిరించుకోవడం లేదు. ఎప్పుడు అద్దంలోకి చూసినా నీ ముఖమే నాకు కనపడుతోంది" అని వ్రాశారు.

**ఆప్‌నీ మౌజోం మే జరా ఝూంక్ కె దేఖో**

**తూహీ తూ హోగా న దరియా న కినారా**

ఇది బాబూజీ ఋతవాణి పుస్తకంలో వ్రాయబడినది. "దివ్యత్వం అనే సముద్రంలో మునిగిపో" అని దీని అర్థం. దివ్యత్వం అనే సముద్రంలో మునిగిపోయినపుడు కండ్లు తెరచినా, త్రాగినా, స్పర్శించినా ఆ దివ్య-జలం అనగా దివ్యత్వం మాత్రమే కనపడుతుంది.

ఈ స్థితి మీ ఒక్కరికేనా!

నాకు ఈ స్థితి వచ్చినప్పుడు, మీ అందరికీ కూడా వస్తుంది. ఇది మానవ శరీరం. ఈ స్థితిలో ఇప్పుడు మీకు కేవలం "అదే" కనపడుతుంది. అది శరీరం కాదు. ఆ దివ్య శక్తి మీకు కనిపిస్తుంది. మనకు సారూప్యతా స్థితి కలిగినదని చెప్పడానికి గుర్తుగా 'వారు' గడ్డంతో మనలో కనపడతారు. ఈ స్థితిలో 'వారి' స్వరూపమే నా స్వరూపంగా అయిపోయింది. మీరు ఎవరిని చూసినా, మీ సోదరిని చూసినా, ఎక్కడ చూసినా మీకు 'వారే' కనపడతారు. ఎందుకుంటే, 'వారే' మన నేత్రాలలో పొదగబడినారు కాబట్టి.

మూడు పదాలు ఉన్నాయి. వాటి స్థితులు వేరు వేరుగా ఉంటాయి అని సోదరి వివరించారు.

**1) సామీప్యత:** ఈ గదిలో మీరు కూర్చుని ఉన్నారు. 'వారు' కూర్చొని ఉన్నారు. ఇది సామీప్యత. అంటే మనకు వారికి మధ్య దూరం ఉంది కాని మనం 'వారి' సమీపంలో, వారికి దగ్గరలో ఉన్నామని అర్థం.

**2) సాన్నిధ్యత:** మీరు ఇక్కడ ఉంటారు. కాని మీ స్థితి మాత్రం ఎప్పుడూ 'వారి' వద్దనే ఉంటుంది.

'సామీప్యత' యందు మీరు ఇక్కడే ఉంటారు. కాని మీరు 'వారి'కి సమీపంలో, దగ్గరగా ఉన్నాను అనే దృష్టి, అనుభూతి మీకు ఉంటుంది.

'వారి' సాన్నిధ్యతను పొందినపుడు మిమ్మలను మీరు ఎప్పుడు వెదికినా, మీరు మాత్రం 'వారి' వద్దనే ఉంటారు.

'సామీప్యత' అనునది 'వారి' దృష్టిలోని ఫోమెంటేషన్‌తో ఫలిస్తుంది.

సాన్నిధ్యత అనునది 'వారి' యొక్క దివ్యత్వంతో ఫలిస్తుంది. అందువలన సామీప్యతకు, సాన్నిధ్యతకు చాలా తేడా ఉంది.

**3) సంపన్నత:** బాబూజీ యొక్క సంపద అనగా దివ్య శక్తిని మనకు అనుగ్రహించి మనలను సంపన్నముగా చేయడం. మీరు ఇక్కడ కూర్చున్నారు. ఇప్పుడు మీ దృష్టి (ధ్యాస) ఎక్కడి వరకు వెళ్ళితే అక్కడి వరకు కూడా ఆ శక్తి వ్యాపించినట్లుగా మీకు అనిపిస్తుంది.

ఈ స్థితులు ఏవి కూడా ఉండిపోయేవి కావు. ఈ పై స్థితులు అన్నీ కూడా తిరిగి 'వారి'లోనే లయమైపోతాయి. అందుకనే బాబూజీ, దివ్యత్వం యొక్క సముద్రాలను ఎన్ని త్రాగినా అభ్యాసి ఇంకా కావాలి, ఇంకా కావాలి – అని అంటాడు అని అన్నారు. ఎన్ని సముద్రాలను త్రాగినా, అది అంతా కూడా లయమై మీ లోపల ఇంకా ఖాళీగా ఉన్నట్లుగా ఫీలింగ్ కలుగుతుంది. ఖాళీగా ఉన్నటువంటి ఫీలింగ్ అంటే 'ఇంకా కావాలి' అని అర్థం.

**ప్రశ్న: ఒక్కొక్కసారి నిండిపోయినట్లుగా ఉండి ధ్యానానికి కూర్చోవాలని అనిపించదు. ఎందువలన?**

**జవాబు:** ఎందుకంటే 'వారు' ప్రసాదించిన దానిని మీరు ఎబ్జార్బ్ (జీర్ణం) చేసుకోలేదు (ఇంకించుకోలేదు) కాబట్టి. మీ ఎదుట రకరకాలు వంటకాలు ఉన్నాయి. కాని మీరు ఎంతైతే జీర్ణం చేసుకోగలరో అంతే తినగలరు. అంతకంటే ఎక్కువగా తినలేరు. అందుకనే బాబూజీగారు ఏమన్నారంటే, 'లయావస్థ' లేనిదే ఆధ్యాత్మిక ఆనందం అసంపూర్ణం అని. 'వారు' మనకు ఎంతో ఇవ్వాలని అనుకుంటున్నారు. కాని మనం దానిని జీర్ణం చేసుకోవడం లేదు.

**అభ్యాసి: బెహెన్‌జీ! దయచేసి లయావస్థ గురించి వివరించండి.**

**వివరణ:** నీటిలో మునిగిపోయినప్పుడు వెంటనే మరణించం. నీరు త్రాగిన కొద్దీ మునుగుతూ లేస్తూ పూర్తిగా ఊపిరి పోయాక శరీరం పైకి తేలుతుంది. అలాగే లయావస్థ పొందటానికి కూడా చాలా అంచెలు (స్టేజెస్) ఉంటాయి. అలా అంచెల వారీగా స్థితులు పొందాక లయావస్థ సిద్ధించటం జరుగుతుంది. లయావస్థ పొందిన తర్వాత మనల్ని మనం 'అక్కడి' నుండి చూడటం జరుగుతుంది. అప్పుడు మనకు నీటిలో ఉన్న తామర పూవుకు నీరంటనట్లే, ప్రాపంచిక విషయాలు మనకంటవు. అటువంటి స్థితిని 'వారు' కలిగిస్తారు.

బాబూజీ చెప్పారు –"నేను నీ మీద పరిశోధన చేస్తున్నాను. నీవు పొందిన ప్రతి కండిషనూ వ్రాయి" అన్నారు. "నీవు వ్రాయకపోతే రామచంద్ర పెద్ద పెద్ద మాటలు ఎన్నో చెప్పారు. కాని చేతల్లో ఏమీ చేసి చూపలేదు అని ప్రజలు నన్ను అంటారు" అని బాబూజీ అన్నారు. ఇప్పుడు బాబూజీ గురించి ఒక్క మాటా ఎవరూ అనలేరు. నా ఒక్కో పుస్తకం 'వారు' చేసిన పనికి నిరూపణగా ఉంటుంది.

**ప్రశ్న: ధ్యానంలో ఉన్నప్పుడు వర్తమానం, భూత భవిష్యత్తులు అనేవి తెలియవు. ఎందుకని?**

**జవాబు:** మీకు డివైన్ కనెక్షన్ దైవంతో సంబంధం ఏర్పడటం వలన. అది ఎల్లప్పుడు కూడా ఉండటంవలన అవి మీ ధ్యాసకు రావు.

బాబూజీ సహజమార్గ్ సిస్టమ్ అంటే సహజమైన జీవన విధానం అని అన్నారు. సాధన వలన ఒక రోజున మన జీవన విధానం ఎంత సహజంగా అవుతుందంటే, "నేను ఎవరు?" అనే విషయం మీకు ఎప్పుడూ గుర్తుకు రాదు. 'నేను' అనేది మీ జ్ఞాపకానికి రాదు. ఎందుకంటే మీ జీవన విధానం సహజంగా మారిపోయింది. నేచర్ (ప్రకృతి)కి మొత్తం శక్తి అంతా 'అక్కడ' నుండియే వస్తుంది. కాని ఆ శక్తి ఎక్కడ నుండి వస్తుంది? ఎందుకు వస్తుంది అనేది ప్రకృతికి కూడా తెలియదు. మన సాధన అంతా సహజంగా అయినపుడు 'వారు' చెప్పినట్లుగా సహజ-జీవనం గడుపుతున్నామని అర్థం చేసుకోవాలి.

షాజహాన్‌పూర్‌లో బాబూజీ ఎదుట ఎవరికి వారు ముందు కూర్చోవటానికి ప్రయత్నించేవారు. ఒక అభ్యాసి మాత్రం ఇతరులకు భంగం కాని, ఇబ్బంది కాని కలిగించకూడదని నిశ్శబ్దంగా చివర కూర్చుండిపోయేవాడు. 2,3 రోజుల తరువాత ధ్యానం పూర్తయిపోయాక బాబూజీ అతణ్ణి పిలిచి "నీవు చేసిన పని నాకు నచ్చింది. నీవు ఇతరులకు డిస్టర్బ్ (ఇబ్బంది) కలిగించకుండా కూర్చున్నావు కాని డిస్టర్బ్ (ఇబ్బంది) కలిగించడం అంటే ఇతరులను ప్రక్కకు నెట్టడం కాదు. నేను (బాబూజీ) అన్నివైపుల ఉన్నాను. ప్రతిచోట నీవు నన్ను చూడగలననే ఫీలింగ్ నీలో ఉండడం వలన నీవు ఎవరిని కూడా డిస్టర్బ్ చేయడం లేదు. నీలో గల ఈ ఫీలింగ్‌కు నేను చాలా సంతోషిస్తున్నాను" అని అన్నారు. ఇది మన అందరికి కూడా గొప్ప శిక్షణ. మీరు ఎక్కడ కూర్చొని ఉన్నా, మీ యొక్క 'ఐ' అనేది 'వారి'కి సమర్పణ కావాలి" అని సోదరి చెప్పారు.

ఒకరోజు రాత్రి ప్రొద్దుపోయాక బాబూజీ ఎదురుగా మేము కొంతమంది కూర్చొని ఉన్నాం. అప్పుడు ఈశ్వర్‌సహాయ్‌జీ "బాబూజీ! ఎప్పుడైనా మీరు ప్రసాదాన్ని ఆఫర్ (నివేదన) చేయాలి అని అనుకొన్నప్పుడూ, లాలాజీ సాహెబ్ మంచం ఎదురుగా కూర్చొన్నప్పుడూ మీరు ప్రతిసారి తెల్లటోపీని పెట్టుకుంటారు. అంటే పెద్దవాళ్ళను గౌరవించడాని కొరకు టోపీని పెట్టుకున్నాను అని అంటారేమో, గౌరవం, మర్యాద అనేవి మనస్సుకు సంబంధించినవి. ఇవి మీలో సంపూర్ణంగా ఉన్నాయి. మరి మీరు ఎందుకు టోపీ పెట్టుకుంటున్నారు?" అని అడిగారు. అప్పుడు బాబూజీ ఈ విధంగా జవాబు నిచ్చారు: "ఈశ్వర్ సహాయ్‌జీ! నీకు తెలుసు కదా! లాలాజీ సాహెబ్ నా ప్రాణం. **వారు** సద్గురువు. కవరింగ్ (తెర) లేకుండా నేను 'వారి' ఎదుట ఏ విధంగా కూర్చోగలను. ఎందుకంటే **వారు** అత్యంత శక్తివంతులు. అందువలన కవరింగ్ (తెర) లేకుండా నేను ఆ మహాశక్తి (లాలాజీ సాహెబ్)ని ఏ విధంగా చూడగలను!" అని అన్నారు. మరల "ఇది కరెంట్ తీగ, దీని చుట్టూ కవరింగ్ ఉంది. ఈ కవరింగ్ లేకపోతే, దీనిలో ఉన్న రాగి తీగెను ఎవరు ముట్టుకున్నా వెంటనే చనిపోతారు. అందుకని మేమిద్దరం కూడా ఒకరిలో ఒకరు కలిసిపోకుండా ఉండడానికి రక్షణకు గాను నేను టోపీని కవరింగ్ (తెర)గా పెట్టుకుంటాను" అని అన్నారు. లాలాజీ (శక్తి), బాబూజీ (శక్తి) ఇద్దరి మధ్యన కవరింగ్ లేకపోతే ఆ రెండు శక్తులు ఏకమైపోతాయి అని అర్థం.

**ప్రాణోం సే ప్యారే హై**

**బాబూజీ హమారే హై**

పై చరణం నేను వ్రాసిన పాటలోనిది. నీ ప్రాణం ఎక్కడ ఉంది? అని ఎవరైనా మిమ్మలను అడిగితే మీకు 'ప్రాణం' అనే మాట మీకు వినపించదు. దానికి బదులుగా 'బాబూజీ' అనే శబ్దం వినిపిస్తుంది. "బాబూజీ నా ప్రాణానికంటే కూడా నాకు ఎక్కువ ఇష్టమైనవారు"అని అప్పుడు మీరు చెప్పగలరు. కాని ఒకవేళ మీకు నా 'ప్రాణం' అనేది ఇంకా గుర్తుంటే, బాబూజీ మీకు మీ ప్రాణానికంటే కూడా ఇష్టమైనవారు కాదు అని అర్థం. ఎప్పుడైతే 'ప్రాణం' అనే స్థానంలో 'బాబూజీ'యే ఉంటారో అప్పుడు 'లయావస్థ' అనునది మొదలవుతుంది.

గురుదేవుడు అనే మాట బాబూజీకి అయిష్టమైనది. (గురుడం) గురువు అనిపించుకునే తత్త్వాన్ని బాబూజీ నిరసించారు. అలా అనిపించుకోవటంవలన దైవానికి దూరం కావటం జరుగుతుంది. సహజమార్గ విధానంలో గురుపరంపర లేదు. సోదరభావంతో అందరికీ దైవసాక్షాత్కారం కలిగించటానికే బాబూజీ వచ్చారు కాని గురువుగా వ్యవహరించబడటం కోసం రాలేదు. పైగా, **వారు** గురడమ్ అనగా గురుత్వం అనే భావాన్ని తొలగించడానికే వచ్చారు. రావణాసురుడు, రావణాసురుడులాగానే ప్రవర్తిస్తే అతని వినాశనం జరిగేది కాదు. కాని నేను దేవుడిని అనే అహంకారం ప్రదర్శించటంవల్లనే రావణాసురుని పతనం జరిగింది. కనుక తానే దైవం అని చెప్పుకోవటం వినాశానికి హేతువవుతుంది.

బాబూజీ మహరాజ్ లాలాజీని సమర్థ సద్గురువు అనేవారు. సత్ అనగా ఈశ్వరుడు. ఎవరైతే ఈశ్వరుని వద్దకు మానవులను చేర్చగల సమర్థులై ఉంటారో వారే సమర్థ సద్గురువు అనబడతారు.

బుద్ధిని సరిగా ఉపయేగిస్తే సత్ఫలితం కలుగుతుంది. లేకపోతే దుష్ఫలితం కలుగుతుంది. మనం గుడికి వెళ్తున్నాం. గుడిలో మూర్తిని అనగా విగ్రహాన్ని దర్శిస్తున్నామంటే మన ధ్యాస దాని రూపం మీద ఉంటుంది కాని భగవంతుని మీద ఉండదు. దాన్ని విగ్రహం అంటున్నాం కాని దైవమనటం లేదు. ఆ శబ్ద ప్రయోగంలోనే అంగీకారం ఉంది. కాని రియాల్టీ అనగా వాస్తవికత లేదు. అలా అనుకున్నప్పుడు ఎదుట ఉన్న వారిని కూడా భగవంతుడు అనుకోవచ్చు. అది ఒక రకంగా ఫీలింగ్ అనగా అనుకోవటం మాత్రమే. మన అంతరంగంలో ఏముందో మనకు తెలుసు. కాని దానిని మనం అనుసరించటం లేదు. ఆంగీకరించటం లేదు. ఎక్కడైతే ఆత్మ నివేదన ఉంటుందో అక్కడ (రియాలిటీ) సత్యత్వం యొక్క భావన ఉంటుంది. భగవంతుడు మూర్తిలో ఉన్నాడనుకోవటం వేరు. భగవంతుడే అది అని నిశ్చయించుకోవటం వేరు. సాహిత్యంలో కూడా హృదయమే మందిరం అంటారు. అందులో వాస్తవం ఉంది. ప్రతి హృదయమూ మందిరమే. దైవం అక్కడే ఉన్నాడు. దానినే అంగీకరించి హృదయంలో ఉన్న దైవాన్ని దర్శించి అనుభూతి పొందాలి.

పెద్దలు చెపుతారు గంగలో మునిగితే పవిత్రమవుతాం అని. దానిని అంగీకరిస్తాం కాని బుద్ధిని ఉపయోగించి అది ఎంతవరకు వాస్తవమో గ్రహించలేము. కనుక మన అంతరాత్మ ఏది చెబుతుందో అదే వాస్తవం. మన అంతరంగంలో ఈశ్వరుడు కొలువై ఉన్నాడు అని అనుభూతి చెందాలి. అనుకోవడం అనే శబ్దం కరక్టు కాదు. దానికి నిరూపణ ఏమిటంటే, సహజమార్గ సిస్టమ్ రియాలిటీ అనగా సత్యత్వం లేదా వాస్తవికత మీద ఆధారపడి ఉంది.

ఒక విషయం చెపుతాను– మన మందరం అనుకుంటూ ఉంటాము ఈయన మాస్టర్, ఈయన మాస్టరే అని. ఇలా మాస్టర్ అనుకోవటంలో రియాలిటీ, సత్యం ఉంటే మన అంతఃకరణ ప్రేమతో నిండి ఉంటుంది. కేవలం అది చేశారు, ఇది చేశారు కనుక మాస్టర్ అనుకోవటం కాదు. వారు నా వారు, నాలో ఉన్నారు. నా కొరకై ఉన్నారు అనే భావనలో ఉండాలి. బాబూజీ మహరాజ్‌కు ఏవైతే ఉన్నాయో అవన్నీ మరొకరిలో ఉన్నాయనుకొని బాబూజీని అనగా డివైన్ పర్సనాలిటీ అని విశ్వసించి కూడా మార్చి వేయటం తగదు.

ప్రిసెప్టర్ తన పేరు చెప్పుకుని తానే ఇస్తున్నాననుకోవడం తప్పు. అతనికి శక్తి ఇవ్వబడింది. "శక్తి – కేంద్రం" నుండి శక్తి ప్రవహిస్తోంది. కనెక్షన్ ఇవ్వబడింది. కనుక శక్తి – కేంద్రం నుండి వచ్చే దానినే అందరికీ ఇవ్వడం జరుగుతోంది.

ఒక అభ్యాసి బాబూజీతో, తన దినచర్య చేస్తున్నప్పుడు – బాబూజీయే అన్నీ చేస్తున్నారని తలుస్తూ కొనసాగిస్తానని చెప్పినప్పుడు అందుకు సమాధానంగా బాబూజీ "నీవు రెండు రకాల భారం వహిస్తున్నావు. ఒకటి నీవు పని చేయటం. రెండవది నేను చేస్తున్నానని అనుకోవడం. కనుక నీవు దివ్యత్వంలో మునిగి ఉంటూ పని చేస్తే నీకు ఆ దివ్య స్థితి దానంతటదే వస్తుంది" అన్నారు.

సాధనలో ఏ విషయాల వలన అయితే మనకు ఎక్కువ లాభం కలుగుతుందో అటువంటి విషయాలనే నేను మీకు చెప్తాను. మనం ధ్యానానికి కూర్చుంటాము. కాని అభ్యాసీ కండ్లు మూసుకొని, ఎంత సమయం అయినా సరే, హృదయంలోనికి ఈశ్వరీయ–ధార వస్తూన్నదని, తన దృష్టిని భౌతిక–హృదయం మీదనే ఉంచుతాడు. కాని మన యొక్క విరాట్–హృదయం నుండి మనకు ప్రాణాహుతి లభిస్తూన్నది. మరి మీరు ఆ విరాట్–హృదయం మీద ఎందుకు దృష్టిని నిలుపరు. హృదయం అంటే ఈ గుండె కాదు. మొత్తం సిస్టమ్‌ను కూడా మీ హృదయంగా భావించి, బాబూజీ ఎదురుగా కూర్చోండి. "బాబూజీ! మీ ఇష్టం. మీరు ఎంత అంటే అంతగా ఈ హృదయంలో ఈశ్వరీయ–ధారను నింపండి" అని అడగండి. అప్పుడు మీకు ఎంత లభిస్తుందో చూడండి. ఒక బిందువులోనే కావాలంటే ప్రాణాహుతి ఒక్క బిందువు అంతే దొరుకుతుంది. మీ సిస్టంలోని ఒక్కొక్క అణువును కూడా మొత్తం సిస్టంను కూడా సంపూర్ణ–హృదయంగా భావించి 'వారి' ఎదుట ధ్యానానికి కూర్చున్నట్లయితే, 'వారు' మన సిస్టంలోని ప్రతి అణువులో కూడా ఈశ్వరీయ–ధారను నింపుతారు. "ముందు కోరడం నేర్చుకో, ఆ తరువాత ఏదైనా కోరుకో" అని బాబూజీ అనేవారు.

నిరంతర స్మరణ అంటే బాబూజీ మన ఎదురుగా ఉన్నారని మనం భావించుకుంటాము. కాని నిరంతర స్మరణ యందు మన హృదయం 'బాబూజీ' చరణాలవరకు వ్యాపించి ఉన్నది, అని అనుకుంటే మీకు ఎంతగా లభిస్తుందో చూడండి. మీకు ఇవ్వడానికిగాను 'వారి'కి మీ హృదయంలో స్థలం ఇవ్వండి.

ఒకసారి మేము బాబూజీని కలుసుకోవడానికి ఈశ్వర్‌సహాయ్‌జీ ఇంటికి బయలుదేరాము. కాని త్వరత్వరగా వెళ్ళాలనే తొందర నాలో లేదు. నాకు ఏ విధంగా అనిపించిందంటే, నా హృదయం మా ఇంటి నుండి ఈశ్వర్‌సహాయ్‌జీ ఇంటిలో ఉన్న బాబూజీ యొక్క చరణాల వరకు దానంతట అదే వ్యాపించినట్లుగా అనిపించింది. ఈశ్వర్‌సహాయ్‌జీ ఇంటికి చేరుకున్న తరువాత వారు నాతో ఈ విధంగా అన్నారు. అరగంట

క్రితం బాబూజీ మీ ఇంటికి ఫోన్ చేసారు. ఏమిటి విషయం అని నేను 'వారి'ని అడిగినపుడు బాబూజీ, "బిటియా హృదయం ఇక్కడి వరకు వ్యాపించి ఉంది. ఆమె మాత్రం ఇంకా బయటనే ఉండిపోయింది అని అన్నారు" అని ఈశ్వర్‌సహాయ్‌జీ నాకు తెలిపారు.

మనం సరిగా కూర్చోలేకపోతే అంటే ఇరుకుగా ఉండడంవలనగాని, కాళ్ళు నొప్పులవలనగాని ధ్యానంలో ఇబ్బంది కలుగుతూ ఉంటుంది. అదే విధంగా మన హృదయాన్ని సరిగా విప్పి ఉంచలేకపోతే అందులో 'వారు' ఇచ్చేదానిని ఇముడ్చుకోవడానికి ఇబ్బంది కలుగుతూ ఉంటుంది. మనకు విశ్రాంతిగా, సౌకర్యంగా కూర్చోవడానికి స్థలం ఎలా ఎక్కువ కావాలో, అలాగే మనకు బాగా ప్రాణాహుతిని ఇవ్వడానికి 'వారి'కి మన హృదయంలో ఎక్కువ స్థలం కావాలి.

**ఆత్మ-నివేదన (సబ్‌మిషన్):** మనలోని 'నేను' అనేదానిని 'వారి'కి ఇవ్వడమూ, మన మాటలలోను, ఆలోచనలలోను, పనులలోను 'నేను' ఆ పనిని చేసాను, నేను ఈ పనిని చేసాను అని అంటాం. 'నేను' అని నోటితో అన్నా మన అటెన్షన్ (దృష్టి) మాత్రం బాబూజీ మీదనే ఉండాలి. ఎప్పుడైతే కేవలం బాబూజీయే మన దృష్టిలో ఉంటారో, అప్పుడు 'వారు' మనలోని 'నేను' అనే స్థానాన్ని స్వీకరించడం వలన, మనలోని 'ఐనెస్' కరిగిపోతుంది.

"బాబూజీ! నేను మీ వాడిని. మీరు నా **వారు**" అని హృదయపూర్వకంగా అనుకోవాలి.

ఎప్పుడైతే "బాబూజీ నా **వారు**" అనే ఫీలింగ్ హృదయంలో కలుగుతుందో అప్పుడు సబ్‌మిషన్ (ఆత్మ-నివేదన) స్థితి మొదలవుతుంది.

**సమర్పణ (సరెండర్) శరణాగతి:** ఆత్మ-నివేదన (సబ్‌మిషన్) అనునది సమర్పణ (సరెండర్) శరణాగతికి ప్రాణం వంటిది. ఆత్మ-నివేదన అనునది అభ్యాసీ యొక్క కర్తవ్యం. ఎప్పుడైతే మన ఆత్మ-నివేదనను బాబూజీ స్వీకరిస్తారో, అప్పుడు 'వారు' మనకు బహుమానంగా సరెండర్ (సమర్పణ) శరణాగతిని ప్రసాదిస్తారు.

ఇప్పటివరకు మనం 'బాబూజీ' మీదనే దృష్టిని నిలిపి ఉంచాము - ఇది ఆత్మ-నివేదన (సబ్‌మిషన్).

ఇప్పటి నుండి 'వారు' మన మీద దృష్టిని పెడతారు - ఇది సమర్పణ (సరెండర్). ఇది శరణాగతి.

ఈ ప్రపంచంలో ఏదైనా వస్తువును కాని, దేనినైనా కాని చూసినపుడు మనకు సంతోషం కలుగుతుంది. మన మనస్సు ఆ సంతోషంలో మునిగిపోతుంది. ఈ విషయంలో బాబూజీ మనలను అలర్ట్ (సావధానం)గా ఉండమని చెప్పారు. ఎప్పుడైతే మన మనస్సు ఈ ప్రాపంచికమైన ఆనందంలో మునిగిపోతుందో, వెంటనే "ఇది **వారి** సంతోషం, **వారు** సంతోషిస్తున్నారు"అని మనం భావించాలి. అప్పుడప్పుడు ఈ విధంగా అనుకోవడం వలన ఒక కనెక్షన్ ఏర్పడుతుంది.

ఆధ్యాత్మికత యందు రిజిడిటి (ఛాందసత్వం - మొండితనం) అనేది ఉండకూడదు. ఆధ్యాత్మికతలో సాధకుని యొక్క లక్ష్యం కేవలం సాక్షాత్కారం మాత్రమే. అతనిలో రిజిడిటి (మొండితనం) అనేది ఉండదు. అటువంటి అభ్యాసికి మేము, ఈ విధంగా చేయండి అని సూచనలు చెప్పితే, అతడు వెంటనే దానిని ఆచరించడానికి ప్రయత్నిస్తాడు. ఎందుకంటే అతడు ఎప్పుడూ కూడా ఈశ్వర-ప్రాప్తిని పొందాలనే అన్వేషణలోనే ఉంటాడు. అతనిలో అహం అనేది నెమ్మదిగా తగ్గిపోతూ ఉంటుంది. రిజిడిటీ (మొండితనం) అనేది వ్యక్తిత్వంతో (అహంతో) కనెక్ట్ చేయబడి ఉంటుంది.

ఎవరో ఒకసారి, “బాబూజీ మహరాజ్! మీ గురించి మాకు తెలుసు. అందువలన మేము మిమ్మలను భగవంతునిగా ఒప్పుకుంటున్నాం” అని అన్నప్పుడు **వారు** “మేము ఒప్పుకుంటున్నాం అని నీవే అంటున్నావు అంటే నేను భగవంతుడిని కాదు అని దీని అంతరార్థం. నీవు ఒప్పుకొన్నా, ఒప్పుకొనకపోయినా నేను మాత్రం భగవంతుడిని కాదు. నిజమైన భగవంతుడిని అందరూ ఒప్పుకొనవలసినదే. ఒక స్వామీజీ ఉపన్యసిస్తూ, నేనే భగవంతుడిని అని చెప్పుకున్నాడు. ఇంకొక స్వామీజీ నేనే ఈశ్వరుడిని అని ప్రచారం చేసుకొంటున్నాడు. ఈ విధంగా లెక్కలేనన్ని భగవంతుళ్ళను వాళ్ళు తయారుచేసారు. వాళ్ళు తమను తాము భగవంతునిగా తయారు చేసుకొన్నారు. కాని వారెవరూ కూడా భగవంతుడు కాదు” అని అన్నారు.

అందువల్లనే “బాబూజీ” గురించి ఎవరు కూడా ప్రచారం చేయకూడదని నేను కోరుకుంటున్నాను” అని లాలాజీ సాహెబ్ అన్నారు. మేరే పర్‌నానోంకి ఖాతిర్ శమ్మ జల్ ఉఠేగీ – “ఎటువంటి ఆధ్యాత్మిక జ్యోతి విశ్వవ్యాప్తంగా వెలుగుతుందంటే దాని ప్రకాశాన్ని చూసి ఈశ్వరుని కాంక్షించే వారంతా ఆ దివ్యజ్యోతి (బాబూజీ) వద్దకు వారికి వారే పరుగెత్తుకు వస్తారు.”

అందువలన బాబూజీని గురించి ప్రచారమే చేయవలసిన పని లేదు. ప్రచారం అంటే అందులో రిజిడిటీ (ఛాంధసత్వం) ఉంటుంది, అని గ్రహించాలి.

ప్రేమ, భక్తి అనేవి లేకుండా ఎప్పుడూ కూడా ఆధ్యాత్మిక యాత్ర అనేది ప్రారంభం కానే కాదు. ఈశ్వర ప్రాప్తి అనే లక్ష్యం ఉన్నప్పుడే ప్రేమ, భక్తి అనేవి ఉంటాయి. “ఈశ్వరుడు అంతటా ఉన్నాడు” అనేది మనందరికి తెలుసు. కాని ఈశ్వరుడు మనకు లభించడం లేదు. భక్తి మరియు లయావస్థ ఉన్నప్పుడే ఈశ్వరుని పొందగలం.

బాబూజీ “ప్రజలు నన్ను చూడడానికి వస్తారు. కాని ‘నన్ను’ చూడకుండానే వెళ్ళిపోతారు. మిమ్మల్ని దర్శించడానికి వచ్చాము – అని అంటారు. నా పాదాలు స్పృశించి వెళ్ళతారు” అనేవారు. ఎవరైనా దివ్య పురుషుడు ఈ భూమి మీద అవతరించినప్పుడు వారిని (శరీరాన్ని) చూసినంతమాత్రాన, ‘వారి’ ఎదుట కూర్చున్నంత మాత్రాన మనకు సాక్షాత్కారం కలుగదు. ఆ దివ్య పురుషుని శరీరంలోపల ఎటువంటి ‘దివ్యశక్తి’ దాగి ఉందో, ఆ ‘దివ్యత్వం’ యొక్క దర్శనం లభించినప్పుడే మనకు సాక్షాత్కారం కలుగుతుంది. ఆ ‘దివ్యశక్తి’ని దివ్య దృష్టితో మాత్రమే దర్శించగలం. భౌతిక నేత్రాలు చూడలేవు. ‘బాబూజీ మహరాజ్’ నా ఎదుటనే కూర్చొని ఉన్నారు. ‘వీరి’ దివ్య సౌందర్యాన్ని ఎటువంటి నేత్రాలు దర్శించగలవో కదా! అని అనుకోవాలి.

భగవద్గీతలో దీనికి నిరూపణ కూడా ఉంది. అర్జునుడు ఎప్పుడు కూడా శ్రీకృష్ణుని వెంటే ఉండేవాడు. తనలో ఎటువంటి దివ్యశక్తి దాగి ఉందో చూడమని శ్రీకృష్ణుడు యుద్ధభూమిలో అర్జునునికి దివ్యదృష్టిని ప్రసాదించి తన నిజ–స్వరూపాన్ని చూపించాడు. అప్పుడే అర్జునుడు శ్రీకృష్ణుని విరాట్–రూపాన్ని చూడగలిగాడు.

ఒకసారి నేను బాబూజీకి ఈ విధంగా ఉత్తరం వ్రాశాను: “షాజహాన్‌పూర్‌లో నేను చూసిన బాబూజీ స్వరూపం కంటే కూడ, మీకు దూరంగా, ఇక్కడ లఖింపూర్‌లో నేను చూస్తున్న స్వరూపం ఎంతో ప్రియాతి ప్రియంగా ఉంది” అని. దీని అర్థం ఎమిటంటే, ‘వారి’ శరీరంలోపల ఏదైతే (దివ్యత్వం) ఉందో దాని యొక్క ‘సామీప్యత’ కొద్దిగా లభించింది అని. ఇంకా ముందుకు వెళ్ళిన తరువాత ‘వారి’ నిజమైన స్వరూపం కనబడుతుంది. అప్పుడు ఇది ఎటువంటి దివ్య–సౌందర్యమో, ఎంత ఆకర్షణీయంగా ఉందో, ఎంత అద్భుతంగా ఉందో అని మీరు అంటారు.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! నేను షాజహాన్‌పూర్‌కు రావాలని అనుకుంటున్నాను" అని అన్నప్పుడు, 'వారు' అతడిని "నీవు మరల – మరల షాజహాన్‌పూర్‌కు రావాలని ఎందుకు అనుకుంటున్నావు? నీ లక్ష్యం ఏమిటి?" అని ప్రశ్నించారు. అప్పుడు ఆ అభ్యాసీ, "బాబూజీ! నేను షాజహాన్‌పూర్‌కు వచ్చి మీ దగ్గర కూర్చుంటే నాకు చాలా బాగుంటుంది. మీరు చెప్పే మాటలు వింటుంటే నాకు ఆనందంగా ఉంటుంది" అని జవాబు చెప్పాడు. అప్పుడు బాబూజీ, "నీవు ఇప్పుడు ఒక మాటను ఒప్పుకోవాలి. నీవు సహజమార్గ్ విధానాన్ని అనుసరించటం లేదు. నీవు సహజమార్గ్ అభ్యాసీవి కాదు" అని అన్నారు. దానికి అతడు, "ఎందుకు నేను అభ్యాసీని కాదు?" అని అడిగాడు. దానికి సమాధానంగా **వారు** "సహజమార్గ్ సిస్టమ్ అనేది ఒక ఆధ్యాత్మిక విధానం. ఎప్పటివరకైతే నీకు భగవత్ సాక్షాత్కారం అనే లక్ష్యం ఉండదో, అప్పటివరకు నీవు ఆధ్యాత్మికతను అనుసరించడం లేదని అర్థం. ఈశ్వర సాక్షాత్కారం అనే లక్ష్యాన్ని పొందడం కోసం మనం ఆధ్యాత్మికత యొక్క సహాయాన్ని తీసుకుంటాం. ఏ సిస్టమ్‌లోనైతే ఈశ్వర ప్రాప్తి అనే లక్ష్యం ఉండదో, అది ఆధ్యాత్మిక సిస్టమ్ కానే కాదు" అని అన్నారు.

స్పిరిట్ అంటే ఆత్మ అని అర్థం. ఎక్కడైతే ఆత్మ యొక్క అవసరం పరిష్కరించబడుతుందో, దాన్ని ఆధ్యాత్మికత అంటారు. ఆత్మ పరమాత్మలో విలీనం కావాలని కోరుకుంటుంది. ఇదే ఆత్మ యొక్క అవసరం. బాబూజీ మహరాజ్ ఆత్మ యొక్క అవసరాన్ని ఎప్పుడైతే పూర్తి చేస్తారో అప్పుడు ఆత్మ పరమాత్మ–తత్వం నందు లయమైపోతుంది. అప్పుడు నాకు లిబరేషన్ (ముక్తి) కలిగిందని మీరు వ్రాస్తారు. ఎవరైనా మీ ఆత్మ గురించి మీతో మాట్లాడినపుడు, దానిని గురించి మీకేమి అర్థం కాదు. ఎవరి గురించో మీతో మాట్లాడుతున్నట్లుగా మీకు అనిపిస్తుంది. ఎందుకంటే, మీ ఆత్మ మీ దగ్గర లేదు కాబట్టి. ఆత్మ పరమాత్మలో విలీనం కావడం అనేది లిబరేషన్ (ముక్తి) యొక్క మొదటి దశ. మరి చివర దశ ఏమిటి?

"బాబూజీ! మీ ఎదుటనే ఉన్నారు. మిమ్మల్ని చివరి దశ (అంతిమం) వరకు తీసుకొని పోవడానికే వచ్చారు. కాని మనమే వెనుకకు పోతున్నాం" అని భావించాలి.

"ముందు మీరు తపస్సు చేసి, సెయింట్ (యోగి)గా మారిన తరువాత నా వద్దకు రండి" అని కూడా బాబూజీ అనడం లేదు. 'వారు' ఏమంటున్నారంటే, నీవు ఒక్కటే మాట అను– "నేను మీ వాడిని; మీరు నావారు –అంతే; చాలు. ఇంకా చింతించాల్సిన పని లేదు" –అని అన్నారు.

బాబూజీ మహారాజ్ ఒక మాట అన్నారు – ఆఫరింగ్ ఆఫ్ యువర్ సెల్ఫ్ – "నీవు నాకు ప్రాపంచికమైన సమస్యలను అన్నింటిని అర్పిస్తున్నావు. కాని 'సెల్ఫ్' అనేది ముఖ్యమైనది. దానిని నీవు నాకు సమర్పించాలి" అని అన్నారు. సెల్ఫ్ (నేను) అనేది సమర్పించిన తరువాత మరల దానిని గురించి ఆలోచించకూడదు. 'నేను' అని పలికినప్పుడు మీకు కేవలం 'నేను' బాబూజీ వాడిని ('నేను' మీ వాడిని) అనే భావన రావాలి. 'నేను' ఈ పనిని చేసాను అని మీరు అన్నప్పుడు, ఈ 'నేను' అనేది బాబూజీది అనే ఆలోచన రావాలి. ఎందుకంటే, మనం మన సెల్ఫ్ (నేను) అనే దానిని 'వారి'కి సమర్పించాము కదా! అందువలన ఎప్పుడైనా సరే, ఈ సెల్ఫ్ (నేను) అనే దానికి సంబంధించిన ఏ విషయం వచ్చినా వెంటనే ఆ 'సెల్ఫ్'ను 'బాబూజీ'తో కనెక్ట్ చేయండి.

**ప్రశ్న: ఆలోచనకు, ఆచరణకు మధ్య దూరం ఉంది కదా, ఏం చేయాలి?**

**జవాబు:** మనం మన సెల్ఫ్‌ను 'వారి'కి సమర్పించాము – అనేది ఒక ఆలోచన. మనకు ఏ ఆలోచన వచ్చినా, వెంటనే దానిని 'వారి'కి కనెక్ట్ చేయాలి. ఎలా? ఉదాహరణకు 'నాకు' ఇది చాలా బాగా నచ్చింది, అనే ఆలోచన వచ్చినపుడు, ఎక్కడైతే 'నా' అనే మాట వస్తుందో అప్పుడు – ఈ సెల్ఫ్ (నేను) అనే దానిని నేను ఇదివరకే 'వారి'తో కనెక్ట్ చేసి ఉన్నాను కదా! –అని వెంటనే జ్ఞాపకం తెచ్చుకోవాలి. ఇప్పుడు ఈ సెల్ఫ్ (నేను) అనేది 'వారి'ది. నాది కాదు. ఎందుకంటే, దానిని మనం ఇదివరకే వారికి సమర్పించాం. ఈ 'సెల్ఫ్' మనది అని అనుకోకూడదు. ఈ విధంగా ఎప్పుడైతే ఆచరిస్తామో అప్పుడు నెమ్మది – నెమ్మదిగా, ఈ సెల్ఫ్ (నేను) అనేది ఎప్పుడు జ్ఞాపకం వచ్చినా ('నేను' చాలా బాగా పనిచేసాను, 'నాకు' ఈ వస్తువు చాలా బాగా నచ్చింది) ఆ 'సెల్ఫ్' అనేది మీతో కనెక్ట్ కాదు. ఎందుకంటే, దానిని మనం ఇదివరకే 'వారి'కి సమర్పించాము కాబట్టి.

చాలామంది అభ్యాసులు బాబూజీ భౌతిక రూపాన్ని తలుచుకుంటూ మేము నిరంతర స్మరణలో ఉన్నామని అనుకుంటారు. కాని ఇది తప్పు. నిరంతర స్మరణ అంటే ఇది కాదు.

మనం నిరంతర స్మరణలో, "నేను మీ వాడినిగా అయిపోయాను" అనే విషయాన్ని జ్ఞాపకం పెట్టుకోవాలి. ఈ 'సెల్ఫ్' మీది అని గుర్తుపెట్టుకోవాలి. "నేను మీ వాడినిగా అయిపోయాను" అనే దానిని జ్ఞాపకం పెట్టుకొని, మనం 'వారి'తో కనెక్ట్ కావడానికి ప్రయత్నించాలి. అప్పుడు స్మరణ అనేది దానంతట అదే నిరంతర స్మరణగా అవుతుంది. ఎప్పుడైతే మనం డివైన్ (దైవం) నుండి దూరమైపోతామో అప్పుడు ఒక దివ్యశక్తి ఈ భూమి మీద మానవ రూపంలో అవతరిస్తుంది. "ఓ మానవులారా! దైవం అనేది ఒకటి ఉంది. మీరు అక్కడి నుంచే వచ్చారు. ఆ దైవం నుండి మీరు దూరమైపోయారు. ఇప్పుడు మీరు అక్కడికి చేరుకోవాలి" అని ఆ దివ్యశక్తి మనకు మరల జ్ఞాపకం చేస్తుంది. అందువలన నిరంతర స్మరణలో మనకు బాబూజీ ఎప్పుడు జ్ఞాపకం వచ్చినా "బాబూజీ! నేను మీ వాడిని" అనే భావన మనలో కలుగుతుంది. దీనివలన బాబూజీ యొక్క సంకల్పం కూడా పూర్తవుతుంది. ఎందుకంటే, 'వారు' మనకు 'ఈశ్వరుని' గురించి జ్ఞాపకం చేయడానికి వచ్చారు. ఇప్పుడు మనం కూడ "బాబూజీ! నేను మీ వాడినే" అనే మాటను జ్ఞాపకం పెట్టుకొంటున్నాం. ఈ విధంగా, "నేను మీ వాడినే" అనే దానిని జ్ఞాపకం చేసుకోవడంవలన 'వారి'తో కనెక్షన్ చాలా త్వరగా ఏర్పడుతుంది.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ మీరు మా కోసం 'దివ్యత్వం' నుండి అవతరించారు కదా! మీ రూపం మీద మేము ధ్యానం చేయవచ్చును కదా!" అని అడిగాడు. దానికి సమాధానంగా బాబూజీ, "ఈ భౌతిక రూపం నీ సమస్యను పరిష్కరించదు. ఈ భౌతిక రూపంలో అంతర్ నిహితంగా ఏదైతే 'దివ్యత్వం' ఉందో అదే నీ జీవిత సమస్యను పరిష్కరించుతుంది. కాబట్టి నీవు నాలోని ఆ 'దివ్యత్వం'తో కనెక్షన్‌ను ఏర్పరచుకో. ఈ కవరింగ్ అంటే ఈ శరీరం అనేది ఇక్కడే నశించిపోతుంది" అని అన్నారు. ఒకవేళ 'వారి' రూపం కనబడితే, దానిని ఆహ్వానించండి. ఆ రూపాన్ని ఎప్పుడు కూడ ప్రక్కకు తొలగించడానికి ప్రయత్నించవద్దు. కాని ఆ రూపం కూడా ఎక్కువ సమయం ఉండదు. ఒక్కొక్కసారి మనకు ప్రతీచోట, అంతటా కూడా 'వారి' ప్రజెన్స్‌ను – బాబూజీ మహరాజ్! బాబూజీ మహరాజ్! – 'వారి' సామీప్యతను, అనుభూతి చెందుతాము. అటువంటి సమయంలో 'వారి' రూపాన్ని గుర్తు చేసుకోకూడదు. ఒకవేళ 'బాబూజీ' రూపం దానంతట అదే

సహజంగా వస్తే, దానిని ఆహ్వానించండి. కాని అది షాజహాన్‌పూర్ – బాబూజీ మాత్రం కాదు. వాస్తవానికి అది 'వారి' ప్రెజెన్స్ మాత్రమే.

అన్నింటికంటె గొప్ప విషయం ఏమిటంటే, మీరు సహజమార్గ్ సిస్టమ్‌ను అనుసరించాలనుకుంటే, అందులో మనం ఏమి చేయాలి అని చెప్పబడినవో, వాటినే మనం చేయాలి. బాబూజీ మహరాజ్ మన ఎదుటనే ఉన్నారు; 'వారి' హృదయం నుండి మనకు ఈశ్వరీయ–ధార లభిస్తూన్నది; మనలోని అనవసరమైన విషయాలను అన్నింటిని తీసివేస్తూ మన హృదయంలో పరిపూర్ణంగా ఈశ్వరీయ–ధారను నింపుతూ మనలను ఈశ్వర–ప్రాప్తి కొరకు యోగ్యులుగా చేస్తున్నారు. అందువలన బాబూజీ చెప్పిన విధంగా మనం సహజమార్గ్ సిస్టమ్‌ను అనుసరించాలి.

**ప్రశ్న: బెహెన్‌జీ! ఆత్మ పరమాత్మలో లీనమవుతుంది – దయచేసి గీత గురించి చెప్పండి.**

**జవాబు:** ఆత్మ పరమాత్మలోని ఒక అంశ. ఆత్మ పరమాత్మలో లీనమవుతుంది. శ్రీకృష్ణ పరమాత్మ విరాట్ రూపం చూపించాడు. అనగా భౌతిక రూపంలో దాగి ఉన్న 'అసలు' శక్తి – అదే విరాట్. అదే నిజమైన సాక్షాత్కారం. శరీరాన్ని కాకుండా లోపల అంతర్ నిహితంగా ఉన్న దివ్యశక్తి రూపాన్ని దర్శించటం.

**ప్రశ్న: శ్రీకృష్ణ భగవానుని బోధనల్లో, బాబూజీ బోధనల్లో తారతమ్యం ఏమిటి?**

**జవాబు:** శ్రీకృష్ణ భగవానుడు బోధనలు చేయలేదు. ఈశ్వర సాక్షాత్కారం పొందాలని చెప్పలేదు. ఏ సంస్థనూ స్థాపించలేదు. శ్రీకృష్ణుడు దుష్ట సంహారం కోసం వచ్చాడు. బాబూజీ మానవమాత్రులను ఉద్ధరించడానికి, వారికి భగవత్ సాక్షాత్కారం కలిగించడానికి వచ్చారు. సహజమార్గ్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టారు. అందుకు ఈశ్వరప్రాప్తి లక్ష్యాన్ని ఇచ్చారు. అది సశక్తియుతమైనది. అది 'వారి' ఆధీనంలో ఉంది. బాబూజీ అంతిమశక్తి యొక్క మాస్టర్. సంస్థకు మాస్టర్ కాదు.

**ప్రశ్న: ఫర్‌గెట్ యువర్‌సెల్ఫ్ అనగా ఏమిటి?**

**జవాబు:** మీరు ఎవరినైనా జ్ఞాపకం చేసుకుంటున్నప్పుడు మిమ్మల్ని మీరు మరచిపోతారు. అనగా మీ సెల్ఫ్‌ను మరచిపోతారు. ఎలా అంటే, మీకు ఎవరిమీదైనా అతిగా ప్రేమ ఉందనుకోండి. వాళ్ళే జ్ఞాపకం వస్తారు. ఆ ధ్యాస లేదా ఇష్టంలోనే మిమ్మల్ని గురించి మీరు మర్చిపోతారు. అలాంటిదే మనం బాబూజీపట్ల కలిగి ఉంటే, మనకు కూడా అటువంటి మరపు స్థితిని కలిగించటమూ, ఆ స్థితిలో మనం యాత్ర చేయటమూ జరుగుతుంది. అది 'వారు' అనుగ్రహించే కృప.

ప్రాపంచిక విషయాలను విడిచిపెట్టి పూర్తిగా 'వారి' ధ్యానంలోనే లీనమైపోతే 'ఐనెస్' మైనస్ అయిపోతుంది. అనగా అహం తరగిపోతుంది. మీరు పూర్తిగా ఆధ్యాత్మికతతో సంబంధం స్థిరపరచుకుని ఉంటే **వారి**లో లయమైపోతారు. నిండైన ప్రేమ అనేది రెండు విషయాలుగా ఉంటుంది. ఒకటి ఆధ్యాత్మికత, రెండోది ప్రాపంచికం. ఈ ప్రాపంచికమైనదానిలో చీకూ చింతా ఉంటాయి. కాని ఆధ్యాత్మికతలో బాబూజీవారమే అనుకుంటే చీకూ చింతా ఉండదు. బాబూజీనే దృష్టిలో నిలుపుకొని లక్ష్యం కోసమే ప్రయత్నిస్తే సాక్షాత్కారం కలుగుతుంది. ప్రేమకై తపిస్తూ 'వారి' శరణాగతి పొందటమే అన్నిటికంటే మిన్నగా ఉంటుంది.

**ప్రశ్న: (రిమెంబరెన్స్) స్మరణ ఎలా?**

**జవాబు:** స్మరణ లేదా జ్ఞాపకం అనేది బాబూజీ యొక్క జ్ఞాపకం మళ్ళీ రానిదై ఉండాలి. అనగా మరచిపోవటం అంటూ ఉంటే జ్ఞాపకం తెచ్చుకోవటం ఉంటుంది. మరపనేదే లేనపుడు జ్ఞాపకం యొక్క అవసరం ఏముంటుంది. అలాగే ఇద్దరం అనుకొన్నపుడు (అనగా తాను వేరు దైవం వేరు) జ్ఞాపకం అనేది వస్తుంది. ఇద్దరూ ఐక్యమై పోయినప్పుడు ఇంక ఎడబాటు అనే ఆలోచనే ఉండదు. కనుక జ్ఞాపకం లేదా స్మరణ ప్రసక్తి ఉండదు. ఎప్పుడైతే సామ్యతా స్థితి కలిగి, లీనమైపోవటం జరుగుతుందో అదే లయావస్థ యొక్క స్థితి అవుతుంది.

**ప్రశ్న: సబ్‌మిషన్, మెర్జెన్స్ మరియు రిమెంబరెన్స్ ఇన్ మాస్టర్ అన్నీ ఒకటేనా, వేర్వేరా?**

**జవాబు:** అవి అన్నీ వేటికవి వేరుగా ఉంటాయి. సబ్‌మిషన్ అంటే – నేను మీ వాడిని. మీరు నా వారు అనుకోవటం. మెర్జెన్స్ అనగా లయం కావటం (విలీనమైపోవటం). రిమెంబరెన్స్ అనగా మనం బాబూజీతో సంబంధం ఏర్పరచుకోవటం. మనకు లయావస్థ ఏర్పడినపుడు మన జ్ఞాపకం లేదా స్మరణ కూడా లయమైపోతుంది. లయావస్థ ఎటువంటిదంటే – ఏ విధంగా అయితే దివ్యత్వం అనే సాగరంలో మునిగి బయటకు రాకుండా ఉంటే ఎలా ఉంటుందో – అది అటువంటిది. లయావస్థ యొక్క స్థితి (కండిషన్) ఇదే. ఈ స్థితిలో అహం పూర్తిగా చచ్చిపోతుంది. అప్పుడు శరీరం ఈ ప్రపంచంలో ఉన్నా ఏమీ పట్టనట్లుగా ఉంటుంది. మెర్జింగ్ విషయానికొస్తే మాలిక్ మనలో విలీనం కావటం అనేది ఎప్పుడూ జరగదు. లయావస్థలో మనమే 'వారి'లో విలీనం కావటం జరుగుతుంది. లాలాజీ సాహెబ్ బాబూజీలో విలీనమైపోయారు. చాలామంది ఇలా విలీనమైపోవటం (గురువు శిష్యునిలో లయం కావటం) పరంపర అంటారు, కాని అది పరంపర కాదు. ప్రకృతికి ఒక దివ్య పురుషుని (డివైన్ పర్సనాలిటీ) యొక్క అవసరం ఉందని లాలాజీ సాహెబ్ ప్రార్థన చేశారు. ప్రకృతిలో మార్పులు అవసరమైన ఫలితంగా 'వారి' కొరకు చేసిన ప్రార్థన ఆలకించబడి 'వారు' భూమి మీదకు దిగి వచ్చారు. అలా దిగివచ్చిన దివ్య శక్తి ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి లాలాజీ ధ్యానం చేశారు. ఆ సమయంలో తాను ఆరు రోజుల పసివాడుగా ఉన్నానని శ్రీ బాబూజీ చెప్పారు. లాలాజీ ట్రాన్స్‌మిషన్‌తో పరీక్షించిన మీదట అంతిమం నుంచి దిగివచ్చిన ఆ శక్తి యొక్క రూపమే బాబూజీ అని ధృవపరుచుకున్నారు.

శరీరం అనేది నశింపు కలది. గురువుపట్ల ప్రేమ, ప్రార్థన అనే వాటిని, నశింపు కలిగిన శరీరం మీద చేసినట్లయితే ఆ శరీరం నశించినపుడు సాధన కూడా నశించిపోతుంది. అందుచేత శారీరక రూపం మీద కాకుండా గురువు యొక్క దివ్య శక్తి మీద ధ్యానం చేయాలి.

**ప్రశ్న: అభ్యాసి కాని వారితో సరిగా ప్రవర్తించటం ఎలా? నేను స్వయంగా నిరోధించుకోవలసి వస్తోంది. నేను మనశ్శాంతి కోల్పోతున్నాను. దీనిని అధిగమించటం ఎలా?**

**జవాబు:** దీనికి ఆధ్యాత్మికమైన పరిష్కారం లేదు. సహజమార్గ అభ్యాసులు కాని వారితోను, దానిని వ్యతిరేకించే వారితోను తలపడినపుడు సంయమనం పాటించి వారు ఏ విధానాన్ని అవలంబిస్తున్నారో, వారి అభిప్రాయాలు ఏమిటో తెలుసుకోవాలి. సానుకూలంగా వ్యవహరించాలి కాని వ్యతిరేకించకూడదు. తరువాత మన సిస్టమ్ గురించి తెలియ జేయవచ్చు. మన ప్రవర్తన అనగా నిగ్రహం, వివరణ ద్వారా ఉద్రిక్తత లేకుండా ప్రశాంతతను నెలకొల్పవచ్చు. ఈ విధమైన ప్రవర్తన ద్వారా మన సహజమార్గ అభ్యాసులపట్ల వారికి గౌరవం ఏర్పడేటట్లు చేయవచ్చు.

సహజమార్గ అభ్యాసి కాని వారిని చూసినపుడు 'అభ్యాసి కాదు' అను భావం రాకూడదు. సోదర భావంతో ఉండమని బాబూజీ చెప్పారు. సర్వ మానవాళిని అనంతానికి చేర్చడానికే ఆ సంకల్పంతో బాబూజీ అవతరించారు. కాబట్టి అభ్యాసులు కాని వారు కూడా ఏదో ఒక రోజున 'వారి'ని చేరుకోవలసిందే. కనుక నాన్ అభ్యాసులు అన్న భావన మనలో ఉండరాదు.

**ప్రశ్న: బెహెన్‌జీ! నేను ఒక అనాధను చూసినప్పుడు, అతని బాగుకోసం నేను నా మాస్టర్‌ను ప్రార్థిస్తాను. నాకు అలా తోచటమూ, నేను అలా చేయటమూ సబబేనా?**

**జవాబు:** సహజమార్గ అభ్యాసిగా మనం ఎవ్వరికోసమైనా అలా చేయవచ్చు.

**ప్రశ్న: నేను మన మిషన్‌లో ప్రవేశించక పూర్వం నుండి ప్రక్కమీద పరుండి భగవంతుని గురించి ఆలోచించటం, ప్రార్థించటం చాలా సుఖంగా ఉన్నట్లు అనిపించటం జరిగేది. ఆ విధంగా మాస్టర్‌ను ప్రార్థించటం సరియైన పద్ధతియేనా?**

**జవాబు:** ఆరోగ్యంగా ఉన్న అభ్యాసికి అది మంచి పద్ధతి కాదు. అనారోగ్యంగా ఉన్న వారైతే, కూర్చుండలేక పోయినపుడు అలా చేయవచ్చు. దీనికి ఉదాహరణ చూడండి. బాబూజీవద్దకు ఇద్దరు అభ్యాసులు వచ్చారు. అందులో ఒకరు –నేను ధ్యానం చేయటానికి కూర్చోలేకపోతున్నాను. అందుచేత ప్రక్కమీద పండుకొని చేయగలుగుతున్నాను అన్నాడు. బాబూజీ అతనితో – నీవు కూర్చోలేకపోతే అలా చేయవచ్చు అన్నారు. ఈ మాటలు సోదర అభ్యాసి ఆలకించాడు. అతను కూడా అలాగే చేశాడు. మరునాడు మళ్ళీ వారిద్దరూ బాబూజీ వద్దకు వచ్చినపుడు మొదటి అభ్యాసిని ప్రక్కమీద పండుకొని ధ్యానం బాగా చేయగలిగావా అని అడిగారు. అతడు బాగానే ఉందని చెప్పిన తర్వాత రెండవ అభ్యాసి అనగా కూర్చొని ధ్యానం చేయగల సత్తా ఉన్న అభ్యాసి తాను కూడా అదే విధంగా ధ్యానం చేశానన్నాడు. అపుడు బాబూజీ అతడ్ని – నీవు శారీరకంగా సమర్థుడవై ఉండి కూడా అలా ఎందుకు చేశావు అని మందలించి, శారీరకంగా అనుకూలించని పరిస్థితుల్లోనే అలా చేయవచ్చు కాని, సాధారణ పరిస్థితుల్లో కాదని, తెలియజెప్పారు.

కబీరు ఆధ్యాత్మిక శిక్షణ ఇచ్చేవారు. కాని, వారివద్ద ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్) శక్తి లేదు. ఆధ్యాత్మిక విషయాలు బోధించే వారు అంతే.

ఆధ్యాత్మిక మహాపురుషులు శరీరం విడిచి వెళ్ళాక వారి శక్తి వారి సంస్థలోని అభ్యాసులందరికి లభిస్తూ ఉంటుంది. వారి శక్తి యొక్క ప్రయోజనం అందరికీ చేకూరుతుంది. తమ సంస్థ యొక్క బాధ్యతలను నిర్వహించటానికి యోగ్యులైన వారు వచ్చినపుడు వారు సంతోషిస్తారు.

బాబూజీ ఆమెరికా వెళ్ళినప్పుడు 'వారి' ఫోటోను అక్కడి దిన పత్రికలో ప్రచురించారు. అక్కడ 'వారి'ని కలుసుకోవడానికి ఒక వృద్ధుడు చాలా దూరం నుంచి వచ్చాడు. బాబూజీ అతనిని చూడగానే లేచి, ఆ వృద్ధుడ్ని కూర్చోబెట్టి మంచి నీళ్ళు, ఫలహారం ఇచ్చి మర్యాద చేసిన తరువాత, అతనితో, "ఎందుకు మీరు ఇంతదూరం కష్టపడి వచ్చారు?" అని అడిగారు. అప్పుడు ఆ వృద్ధుడు "రాత్రి కలలో నాకు షిర్డీ సాయి కనిపించాడు. వారికి ప్రణామం చేయడానికి దగ్గరకు వెళ్ళినప్పుడు, వారు నా చేతిని తీసుకొని ఒక మహాత్ముని చేతిలో పెట్టారు. ప్రొద్దున నిద్ర నుండి లేచిన తరువాత, రాత్రి స్వప్నంలో ఎవరి చేతిలోనైతే షిర్డీసాయి నా

చేయిని పెట్టారో, ఆ మహాత్ముని ఫోటో దిన పత్రికలో కనబడింది. ఆ ఫోటోను చూసి నేను మీ దగ్గరకు వచ్చాను” అని అన్నాడు.

మనకు జీవితంలో ఒక మహత్ శక్తి (బాబూజీ) యొక్క సహాయం లభించిందని అనుకుంటే – దీని అర్థం ఏమంటే మనం మరణించిన తరువాత మరల ఈ భూమి మీదకు రాము అని అర్థం. ఎవరైతే సహజమార్గ్ సిస్టమ్‌లో చేరి, శ్రీ బాబూజీ చరణాలపై విశ్వాసాన్ని కలిగి ఉంటారో వాళ్ళందరికీ పునర్జన్మ అనేది ఉండదు; ఇది అందరికీ బాబూజీ ఇచ్చిన చిన్న బహుమతి. ఈ విషయంలో ఎటువంటి అనుమానం లేదు. దీనిని గురించి ఎప్పుడు కూడా అనుమానం అనేది పెట్టుకోకండి. ఇంకొక విషయం ఏమిటంటే, “నేను మీ వాణ్ణిగా అయ్యాను” అని మీరు బాబూజీతో అంటున్నారు. ఎప్పుడైతే మీరు – “నేను మీ వానినిగా అయ్యాను” అని అంటారో అప్పుడు ఆ క్రొత్త శరీరాన్ని ఎవరు తీసుకొంటారు? మీకు ఇంకొక శరీరం ఏ విధంగా లభిస్తుంది? (అంటే మీరు ‘వారి’ వానిగా అయినపుడు, ‘నేను’ అనేది లేదు కాబట్టి, మీకు పునర్జన్మ అనేది ఉండదు)

ఈశ్వరుడు త్రిగుణాతీతుడు; సెయింట్ (యోగి) కూడా త్రిగుణాతీతుడు. తమో, రజో, సత్వ గుణాలకు అతీతంగా వెళ్ళినపుడే మనం ఈశ్వరీయ–క్షేత్రం నందు ప్రవేశించగలం. ప్రతి ఒక్క రీజియన్ (క్షేత్రం)కు ఒక ముఖ్యకేంద్రం అనేది ఉంటుంది. ఆ ముఖ్యకేంద్రం యొక్క స్థితియే దాని క్షేత్రములో వ్యాపించి ఉంటుంది. గాడ్లీ–రీజియన్ అనగా ఈశ్వరీయ క్షేత్రం యొక్క ముఖ్యకేంద్రం ‘ఈశ్వరుడు’. అందువలన ఎవరైనా అభ్యాసి ఆ ఈశ్వరీయ–క్షేత్రంలో ప్రవేశించినప్పుడు, దాని ముఖ్యకేంద్రం యొక్క స్థితిని అనగా ఈశ్వరీయ–స్థితిని అనుభూతి పొందుతాడు. ఈశ్వరుడు త్రిగుణాతీతుడు, సర్వవ్యాపి, సర్వశక్తివంతుడు; మొదలగు దివ్య లక్షణాలు ఈశ్వరుని గురించి చెప్పబడినవో అవి అన్నీ తనను గురించే చెప్పబడుతున్నాయని అక్కడికి చేరిన అభ్యాసీ అనుకుంటాడు. నిజానికి ఆ దివ్య లక్షణాలు అన్నీ కూడా ఆ ఈశ్వరీయ–క్షేత్రం యొక్క స్థితికి సంబంధించనవి. ఇప్పుడు ఈశ్వర–సాక్షాత్కారం మన సమీపంలో ఉన్నదని గ్రహించాలి. (అదే విధంగా ‘తమ్’ అనేది అల్టిమేట్–రీజియన్ (భూమా క్షేత్రం) యొక్క స్థితి. ఇది అక్కడికి చేరుకున్న అభ్యాసీ యొక్క స్థితి కాదు. కాని అభ్యాసి ఇది తన స్థితి అని భావిస్తాడు. ‘తమ్’ అనేది ఆ భూమా –సామ్రాజ్యం యొక్క స్థితి)

సాక్షాత్కారం అంటే ఎదురెదురుగా ఉండడం. కాని బాబూజీ ‘లయావస్థ’ అనే మాటను ఉపయోగించారు. ఎందుకంటే ఈశ్వరుని యందు లయావస్థను పొందనిదే మనం సెంట్రల్ రీజియన్ (కేంద్ర మండలం) యొక్క ప్రవేశ ద్వారం అయిన ‘సత్యపద్’ నందు ప్రవేశించలేము. బాబూజీ అభ్యాసీని తన హృదయంలోనికి తీసుకొని మనకు ఈశ్వరీయ–కేంద్రం అనగా ‘ఈశ్వరుని’ యందు ముంచి, మనలోని ఈశ్వరీయ–స్థితిని అందులో లయం చేసి వెంటనే పైకి విసిరి మనకు ‘సత్యపద్’ వద్దకు చేర్చుతారు. ఇక్కడే “పారిషద్” స్థితి మొదలవుతుంది. “పారిషద్” అనగా ద్వారపాలకుని (బాబూజీ తోడుకై వేచి ఉండు) స్థితి.

‘సత్యపద్’కు చేరుకున్న తరువాత “డివైన్ పర్సనాలిటి” యొక్క పని మొదలవుతుంది. డివైన్ పర్సనాలిటీ అంటే డివైన్ ఇన్ పర్సన్ (బాబూజీ మహరాజ్). ఇప్పుడు ‘వారి’ టెక్నిక్ తెలుసుకోవచ్చు. అదే ఆ దివ్యశక్తి (డివైన్ పర్సనాలిటి)యే మన చేయి పట్టుకొని ముందుకు తీసుకొని వెళ్ళుతుంది.

'ఐనెస్'లో 'నెస్' (వ్యక్తిత్వములోని తత్వము) అనునది మైనస్ అనగా తీసివేయబడినపుడు 'ఐ' మాత్రమే మిగిలిపోతుంది. ఇపుడు ఆ 'ఐ' అనునది, దివ్యత్వపు సాగరంలో ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఇప్పుడు అభ్యాసీ దేనినైనా స్పర్శించినా, చూసినా, ఆ దివ్యశక్తిలోనే మునిగిపోయినట్లుగా అనిపిస్తుంది. తనను తాను స్పర్శించినా కూడా ఆ డివైన్ (దివ్యత్వం) యొక్క స్పర్శగా అనిపిస్తుంది. దివ్యశక్తితోపాటుగా తన చేయి పట్టుకొని ముందుకు తీసికొని వెళ్ళుతున్న ఆ శక్తి స్వరూపం ఎవరో అపుడు అభ్యాసికి అనుభూతిలోనికి వస్తుంది. ఇప్పుడు అభ్యాసీ 'వారి'ని 'బాబూజీ' అని నోటితో అంటాడు, కాని ఫీలింగ్‌లో మాత్రం డివైన్ పర్సనాలిటీ (దివ్యశక్తి)గా ఉంటుంది.

సత్యరూప్ స్థితిని గురించి "బాబూజీ! ఈ స్థితిలో ఇక్కడ జీవించడానికి మీ శ్వాసయే నాకు శ్వాసను ఇస్తూన్నది. మీ 'దివ్యత్వం' అనే ప్రసాదంతోనే ఈ శరీరం పోషించబడుతున్నది. మీ ఈశ్వరీయ ధారా ప్రవాహమే నా రక్త నాళాలలో ప్రవహిస్తున్నది" అని **వారి**కి వ్రాశాను. ఈ స్థితిని పొందిన వ్యక్తినే 'అభ్యాసీ' అని అనవచ్చు. అప్పుడు ఆ అభ్యాసీని, బాబూజీ యొక్క 'ప్రసాదం' అని అనవచ్చు.

ఒకసారి ఒక అభ్యాసీ షాజహాన్‌పూర్ నుండి తిరిగి ఇంటికి వెళ్ళేముందు, "బాబూజీ! అప్పుడప్పుడు నన్ను కొద్దిగా జ్ఞాపకం పెట్టుకోండి" అని కోరాడు. అప్పుడు బాబూజీ నవ్వి, అతనికి సమాధానం ఇచ్చారు. అందులో ఎంత లోతైన అర్థం ఉందో గమనించండి. బాబూజీ ఆ అభ్యాసీతో "మీకు నాదొక విన్నపం, నన్ను నేను జ్ఞాపకం చేసకొనే విధంగా మీరు నా కోసం ప్రార్థన చేయండి; అపుడు నేను మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటాను" అని మరల, "నన్ను నేనే జ్ఞాపకం చేసుకోలేను కదా! మరి, మిమ్మల్ని గుర్తుపెట్టుకోమని నన్ను ఎందుకు కోరుతున్నారు?" అన్నారు.

**ప్రశ్న: గ్రహాలు, గ్రహణాల ప్రభావం మానవుని మీద ఎలా ఉంటుంది?**

**జవాబు:** అందరు సూర్యుని క్రింద, చంద్రుని క్రింద ఉంటారు. సూర్య గ్రహణం, చంద్ర గ్రహణం వలన నష్టం అంటారు. కాని అన్నింటిని మించిన గ్రహం మానవుడే. సోమవారం, మంగళవారం అని మనం చెప్పుకునేవి అన్నీ కూడా మానవుడు కల్పించినవే.

ఫతేగడ్ అనే సముద్రం – లాలాజీ సాహెబ్. లాలాజీ సాహెబ్ తనలో నుండి 'బాబూజీ' అనే ఒక రత్నాన్ని తీసి ఈ ప్రపంచానికి ఇచ్చారు. దీన్ని పొందాలంటే ఒక షరతు ఉంది. ఎవరైతే తమను తాము కోల్పోతారో వాళ్ళు మాత్రమే ఆ దివ్య రత్నాన్ని పొందుతారు. అందువలన మనం "మనం మన మిషన్‌లో ఉన్నాము. ఈ మిషన్ మాది. ఈ మిషన్‌ను తీసుకొని వచ్చిన బాబూజీ నా వారు " అనే ప్రేమ భావన కలిగి ఉండాలి.

"అభ్యాసులకు నా కృతజ్ఞతలు. వారు నా దగ్గరకు వచ్చినపుడు వారిపై ఏ విధంగా పని చేయాలి. వారికి ఎట్లా సేవ చేయాలి అనే అవకాశాన్ని నాకు కల్పిస్తున్నారు" అని బాబూజీ అనేవారు.

**ప్రశ్న: బాబూజీ మహారాజ్‌ను నాలోపల ప్రవేశపెట్టాలంటే నేను ఏం చేయాలి?**

**జవాబు:** బాబూజీ మహరాజ్ మీలో ప్రవేశించి ఉన్నారు. దాన్ని మీరు అర్థం చేసుకోవడంలేదు. బాబూజీ మీలో ఆత్మ రూపంలో ఉన్నారు. హృదయమనే మందిరంలో ఎవరు ఉన్నారు? బాబూజీ మహరాజ్! మీరు కండ్లు

మూసుకొని 'వారి' ప్రజెన్స్ మీలోపల ఉంది అని భావిస్తే, దాని ప్రభావం మీకు తెలుస్తుంది. 'వారి' సామీప్యత యొక్క ఫీలింగ్ కలుగుతుంది.

**ప్రశ్న: నేను ప్రాపంచిక విషయాల్లో మునిగి ఉన్నప్పుడు ధ్యానంలో లీనం కాలేకపోతున్నాను.**

**జవాబు:** మీరు ప్రాపంచిక విషయాల్లో మునిగిపోగా ధ్యానం ఎందుకు చేయడం లేదననుకుంటున్నారు? బాబూజీ నా ఎదుటనే ఉన్నారు. నాలోనే ఉన్నారు అని ఎందుకు అనుకోరు. మనం 'వారి' ఎదుటనే ఉన్నాం. 'వారి' చరణాల వద్దనే కూర్చొని ఉన్నాం.

**ప్రశ్న: అప్పుడప్పుడు ప్రాణాహుతి వస్తున్నట్లుగా, ఒక్కోసారి రానట్లుగా అనిపిస్తుంది.**

**జవాబు:** "ముందు పొందడం నేర్చుకో" అని బాబూజీ అనేవారు. మీరు కండ్లు మూసుకొని, ప్రాణాహుతి వస్తుందని మీ హృదయం వైపు చూస్తారు. కాని హృదయం అంటే ఒక బిందువు కాదు. హృదయం అంటే విరాట్ హృదయం; అంటే విశ్వంలో ఎక్కడా కూడా నీ హృదయం వ్యాపించని ప్రదేశం అంటూ ఉండనటువంటిది. మన హృదయం ఈ విరాట్ – హృదయంలోని ఒక అంశ మాత్రమే. ఈ అంశను ఈశ్వరునికి సమర్పించినపుడు అది కూడా విరాట్‌గా మారిపోతుంది. కాబట్టి హృదయం అంటే ఒక బిందువు అనేది కాకుండా, మీ సిస్టమ్‌లోని అణువణువును, కణకణమును కూడా సంపూర్ణ హృదయంగా భావించి బాబూజీ ఎదుట కూర్చోవాలి. మన మొత్తం సిస్టమ్ అంతా కూడా ఈశ్వరీయ ధారతో నిండిపోయిందని అనుకోవాలి.

**ప్రశ్న: ఇన్నర్ ఎక్స్‌పాన్షన్ (అంతరికంగా వ్యాపించడం) అంటే ఏమిటి?**

**జవాబు:** అంటే మన హృదయం విరాట్ హృదయంగా మారిపోవడం. మన సంపూర్ణ–హృదయం ఈశ్వరీయ–ధారతో నిండిపోయిందని ఎప్పుడైతే మనం అనుకుంటామో అపుడు ఈ హృదయం తన పరిమితులను (హద్దులను) తెంచుకొని, విశ్వమంతటా వ్యాపించినట్లుగా అనిపిస్తుంది. ఆంతరంగికంగా, హృదయం యొక్క హద్దులు తెగిపోయినపుడు, ఒక పరిమితిలో ఉన్న హృదయం, ఇప్పుడు అపరిమితంగా అంటే అనంతంగా వ్యాపించినట్లు అనిపిస్తుంది.

**ప్రశ్న: ఈ విధంగా ఆంతరికంగా వ్యాప్తి చెందడమనేది ధ్యానంలో ప్రతీసారి జరుగుతుందా?**

**జవాబు:** మీరు మీ శరీరాన్న మరచిపోయినట్లయితే మీ హృదయం శరీరం యొక్క హద్దులను దాటి బాబూజీ చరణాల వరకు వ్యాపించినట్లుగా అనిపిస్తుంది. మేము షాజహాన్‌పూర్ ఆశ్రమంలో ఉన్నప్పుడు నా హృదయం దానంతట అదే పూర్తిగా బాబూజీ ఇంటి వరకు 'వారి' చరణాల వరకు వ్యాపించినట్లుగా అనిపించేది. అప్పుడప్పుడు 'వారి' చరణాలు నా హృదయం మీద పడినట్లుగా అనిపించేది.

**ప్రశ్న: అప్పుడప్పుడు ప్రాణాహుతిని ఫీల్ కావడంలేదు.**

**జవాబు:** అప్పుడప్పుడు అనే మాటను తీసివేయండి. ఏదైతే గ్రేస్ (కృప) ను బాబూజీ మీ హృదయంలో ప్రవేశపెట్టారో, అది మీ స్వంతం అయిపోయింది. దానిలో మీరు ఎందుకు మునిగిపోవడం లేదు? ధ్యానంలో మీకు కలిగినటువంటి అనుభూతి లేదా 'వారి' సామీప్యత, ఏది లభిస్తే అది, ఆ స్థితిలోనే దినమంతా మునిగిపోవడానికి కృషి చేయండి. అప్పుడు అది మీలో లయమవుతుంది. ధ్యానానికి సమయం, స్థలంతో నిమిత్తం లేదని మీ అందరికీ తెలుసు. ధ్యానానికి ఉదయం, పగలు, రాత్రి అని ప్రత్యేక సమయం అంటూ ఏదీ

లేదు. బాబూజీ చెప్పినట్లుగా మనం ఉదయం ఒక గంట సమయం ధ్యానం చేస్తాం. మనం ఇంటి పని, ఆఫీస్ పని మన దైనందిన కార్యక్రమాలు చేసుకోవాలి కాబట్టి మనం ధ్యానంలో నుండి లేస్తాము. అంటే అక్కడితో ధ్యానం సమాప్తం అయినట్లు కాదు. మెడిటేషన్ ఈజ్ గోయింగ్ ఆన్ – ధ్యానం జరుగుతూనే ఉన్నది; కాబట్టి మనం ధ్యానంలో నుండి లేచినా, ఆ మెడిటేషన్ –మూడ్ (ధ్యానం యొక్క ధ్యాస)ను మాత్రం విడిచి పెట్టకుండా, దానిలోనే ఉండాలి. ఎప్పుడు ఆ భావం గుర్తుకు వచ్చినా, వెంటనే ధ్యానం జరుగుతూనే ఉన్నది– అని అనుకోవాలి.

మానవునికి మరణించే సమయం వచ్చినపుడు, అతని ముందు, అతడు చేసిన కర్మల యొక్క లిస్ట్ (చిఠా) మొత్తం కనబడుతుంది. అయ్యో! నేను ఈ విధంగా ఎందుకు చేశాను అని అప్పుడు దుఃఖిస్తాడు. కాని ఎవరైనా మానవుడు రియాలిటీ (వాస్తవికత)తో కనెక్షన్‌ను ఏర్పరచుకొన్నట్లయితే మరణ సమయంలో అతని ఎదుట – బాబూజీ మహరాజ్ యొక్క గ్రేస్ (కృప) – మాత్రమే ప్రత్యక్షమవుతుంది. ఎప్పుడైతే మన స్మరణలోను, ధ్యానంలోను 'వారే' ఉంటారో, మన హృదయంలో 'వారి' ప్రజెన్స్ అవతరించినపుడు, మరణ సమయంలో మన ఎదుట 'వారే' కనిపిస్తారు. కాని మానవుడు నిద్ర నుండి లేవగానే ఈ ప్రాపంచిక సుఖాలను అన్నీ అనుభవించి, మరణించేటప్పుడు మాత్రం భగవంతుణ్ణి జ్ఞాపకం చేసుకుంటాడు. ఆయన ఏమైనా మన నౌకరా? (సేవకుడా) ప్రత్యక్షం కావడానికి.

ధ్యానం యొక్క అర్థం మన అటెన్షన్‌ను – అంటే మన దృష్టిని 'వారి'తో కనెక్ట్ చేయడం. ఎప్పుడైతే అభ్యాసీ యొక్క అటెన్షన్ (దృష్టి) యందు 'దివ్యత్వం' యొక్క రూపం ప్రవేశిస్తుందో, అప్పుడు అతనికి తాను జీవించి ఉన్నానా లేక మరణించానా అనే జ్ఞానం కూడా ఉండదు. మరణించేటప్పుడు అతడు 'బాబూజీ' వైపు మాత్రమే చూస్తాడు – అని గ్రహించండి. ఈ విధంగా ఆలోచించండి: మీరు ఎంతకని 'వారి'ని గుర్తుపెట్టుకుంటారు? నిజం ఏమిటంటే ఎల్లవేళలా 'వారే' మనలను గుర్తుపెట్టుకుంటారు. మనం ఈ ప్రపంచంలో మునిగిపోయి, జ్ఞాపకం వచ్చినపుడు మాత్రమే 'వారి'ని గుర్తు పెట్టుకున్నాం అని అనుకుంటాము. కాని మనలను గుర్తు పెట్టుకునేది 'వారు'. మనం ఈ లోకంలో జన్మించినపుడు ఎవరైతే మనలను గుర్తుపెట్టుకున్నారో, మన మృత్యువు నందు కూడా 'వారే' మనలను గుర్తు పెట్టుకుంటారు. అందువలన మనం ఏమీ చేయలేము. కాబట్టి మన దృష్టిలో 'బాబూజీ' ఏ విధంగా ఇమిడిపోవాలంటే, 'వారి' దివ్యత్వం మన హృదయంలో అవతరించాలి.

ఒకసారి నా పిన తండ్రిగారైన జస్టిస్ చతుర్వేది, "బాబూజీ! ఈశ్వరుని పొందాలనే తపన నాలో ఉంది, కాని ప్రజలు మరణించే సమయం నందు భగవంతుడు గుర్తుకు రావాలి, అంటారు. మరి మరణ సమయంలో 'మీరు' మాకు గుర్తుకు రాకపోతే మా పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించారు. దానికి జవాబుగా బాబూజీ, "మీ కోసమే నేను వచ్చాను. నేనే మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకుంటున్నాను. నీకు అప్పుడప్పుడు నా జ్ఞాపకం వస్తుంది. నీవు జడ్జి సీటులో కూర్చున్నపుడు నేను నీకు జ్ఞాపకం ఉంటానా? (ఉండను) కాని నీ గురించి నాకు ఎప్పుడూ జ్ఞాపకం ఉంటుంది" అని మరల 'వారు' అసలు విషయం తెలిపారు. "మానవ మాత్రులందరికి నా సబ్‌మిషన్ (విన్నపం) ఏమిటంటే, మానవులందరూ నాతో కనెక్షన్‌ను ఏర్పరచుకోవాలి" అని బాబూజీ అన్నారు. ఆ మహత్ –శక్తి ఈ భూమి మీదికి ఎందుకు వచ్చింది? 'వారు' ఒక సంకల్పంతో వచ్చారు. 'వారు' మనకోసం

వచ్చారు. ప్రేమ పంచడానికి వచ్చారు. 'వారు' మనందరికోసం, మనలను గుర్తుపెట్టుకోవడానికి వచ్చారు. కాబట్టి మనం 'వారి'తో కనెక్షన్‌ను కలిగి ఉండాలి. 'వారు' మనలను గుర్తు పెట్టుకుంటారు. కాబట్టి మనం 'వారి' ధ్యానంలో ఉంటాం. మరణించిన తరువాత, ఆత్మ 'బాబూజీ'వైపే చూస్తుంది. ఆత్మకు శరీరం విడిచి పెట్టినట్లుగా కూడా తెలియదు. అందుకనే బాబూజీ "నేను మీ అందరిని గుర్తుపెట్టుకోవడం కోసమే వచ్చాను. కాబట్టి ఆ విషయం గురించి చింతించవద్దు. మీకు నేను జ్ఞాపకం లేకపోయినా, నాకు మీరు జ్ఞాపకం ఉంటారు. మీరు నిరాశ చెందవద్దు" అని అన్నారు. కాబట్టి మనం మరచిపోయినా 'వారు' మనలను మరచిపోరు అనేది జ్ఞాపకం పెట్టుకోవాలి.

బాబూజీ అల్టిమేట్ స్థితిని 'జీరో' అని అన్నారు. అహమ్ – హిందీలో 'అ' అంటే 'లేదు' 'హమ్' అంటే మేము. అహమ్ (అ+హమ్) అనగా 'మేము లేము' అని అర్థం. మేము లేనప్పుడు అక్కడ 'జీరో' మాత్రమే ఉంటుంది. కాని మనం 'అహం' అంటే 'మేము ఉన్నాము' అని అంటున్నాము. 'అహమ్' నుండి 'హమ్' (నేను) అనేది తొలగించినట్లయితే 'అ' మాత్రమే ఉంటుంది. 'అ' అంటే 'లేదు' అనగా జీరో మాత్రమే ఉంటుంది. మీరు 'జీరో' అయినప్పుడు అల్టిమేట్ (అంతిమం)తో ఒకటైపోతారు.

**ప్రశ్న: అహం అనగా ఏమిటి?**

**జవాబు:** 'అహం' అనగా 'నేను' (తాను) అనే భావం. అ 'నేను' అనేది శరీరానికి అన్వయించబడుతుంది. తన శరీరంతో సంబంధించి ఉన్నదిగా చెప్పబడుతుంది. అటువంటి భావం కలిగి ఉండటమే అహంభావం అనబడుతుంది. 'నేను' ఇది చేశాను. 'నేను' అది చేశాను అని అన్నప్పుడు 'నేను' అనే దానిని బాబూజీకి కనెక్ట్ చేయాలి. అపుడు 'అహం' తొలగిపోతుంది. హిందీలో, 'అ' అనగా లేదు. 'హమ్' అనగా నేను. కనుక నేను లేను. అనగా జీరో అంటే శూన్యం. అటువంటి 'లేను' అయిన నేనును లేదా శూన్యమైన దానిని ఉన్నదని చెప్పటం వ్యతిరేకభావం అవుతుంది. నేను లేనపుడు మిగిలి ఉన్నది దైవం, అనగా బాబూజీ. కనుక చేసేది, చేయించేది వారే అవుతుంది.

**ప్రశ్న: శూన్యం అయితే ప్రపంచంలో (సృష్టిలో) ఎలా ఉంటాం?**

**జవాబు:** ఈ 'నేను' అను భావాన్ని బాబూజీకే వర్తింపజేయాలి. మనం నిమిత్తమాత్రులమై వారే చేయిస్తున్నారని, ఈ శరీరం ఒక కీలుబొమ్మ అని అనుకుంటే అహం లేకుండాపోతుంది. మనం ఏది చేస్తున్నా బాబూజీని తలచుకొని మంచో చెడో నాకు తెలియదు, ఏది చేసినా 'మీరే' అను సమర్పణ భావం అలవరచుకుంటే అహం మనకు అంటే అవకాశం లేదు.

ఒకసారి ఒక విద్వాన్ బాబూజీ వద్దకు వచ్చి నేను ఎవరో చెప్పండి, తర్వాత మీరు ఎవరో చెప్పండి అన్నాడు. అపుడు బాబూజీ వారి పేరు చెప్పి, మీరు (విద్వాన్) గొప్ప పండితులు అన్నారు. అపుడు బాబూజీని మీరు ఎవరో చెప్పండి అని అడగ్గా – "నేను ఎవరినై ఉండాలో అదై ఉన్నాను" అన్నారు.

అభ్యాసి ఒకరు బాబూజీకి ఉత్తరం వ్రాసి సెలవుపెట్టి షాజహాన్‌పూర్ వచ్చాడు. బాబూజీతో "మీరు జ్ఞాపకం వచ్చారు. నేను వచ్చాను" అన్నాడు. అపుడు బాబూజీ, "జ్ఞాపకం అనేది మళ్ళీ కలగనటువంటిది (యాద్ ఐసే హై జో కభీ నహి ఆయేఁ)" అన్నారు. అనగా జ్ఞాపకం అనేది రావటమంటూ ఉంటే పోవటమనేది

ఉండదు. అది వస్తే పోయేది ఎప్పుడు? ఎప్పుడైతే 'నీవు' అనిపిస్తుందో అపుడది (ఐనెస్) తొలగిపోతుంది. అనగా అహంవలన అది మళ్ళీ పోతుంది. ఈ అహం అనేది కలగటంవలన వచ్చిన జ్ఞాపకం మరచిపోబడుతుంది. కాని ఎప్పుడైతే జ్ఞాపకం చేసుకున్నటువంటి అభ్యాసీ లయమైపోయి ఉంటాడో ఆ జ్ఞాపకంలోనే ఎల్లప్పుడూ ఉండిపోతాడు. కనుక పోవటమనేది లేదు, మళ్ళీ రావటం అనే మాట ఉండదు. మరపు అనేది లేనపుడు జ్ఞాపకం అన్న ప్రసక్తికి తావుండదు కదా!

**ప్రశ్న: మనం లక్ష్యంవైపు క్రమక్రమంగా పురోగతి చెందుతున్నట్లూ, మీరు చెప్పిన అనుభవాలూ గ్రహించటం ఎలా?**

**జవాబు:** మనం సహజమార్గ సిస్టమ్‌లో చేరాము. బాబూజీ అంటే విశ్వాసం కలిగింది. మనం వారికే చెంది ఉన్నాం అని అంగీకరిస్తున్నాం. అలాగే బాబూజీ కూడా మన కోసమే వచ్చారు కనుక, మన అభ్యర్ధన మన్నించారు కనుక మన బాధ్యత వారే చూసుకుంటారు. మనం మరచిపోయినా 'వారు' మర్చిపోరు. మనం మేల్కొన్నపుడు మాటల్లోను, నిద్రలోను నిరంతర స్మరణ కలిగి ఉంటున్నాం. ఎప్పుడైతే మనల్ని వారికి సమర్పించుకున్నామో, వారినే నమ్ముకుని వారి చేయి పట్టుకున్నామో అప్పుడే 'వారు' తీసుకువెళ్తారు. కనుక మనకు మన ప్రోగ్రెస్ గురించిన అనుమానం, మనకు వారికి మధ్య దూరం పెంచుతుంది. వారి స్మరణలోనే మునిగి ఉండే ప్రయత్నం చేయాలి. ఉదాహరణకు మనం ఏదైనా తింటున్నామనుకోండి. శ్రద్ధతో తింటే తింటున్నదేదో, దాని రుచులు ఏవో తెలుస్తాయి. కాని పరధ్యానంగా తిన్నట్లయితే ఏమి తిన్నామో, ఎలా ఉందో గ్రహింపుకు రాదు. అందుచేత ధ్యానంలో పరిశీలన ద్వారా అనుభవాలు తెలుస్తాయి. వారికీ మనకూ ఉన్న అనుబంధం ఎలా ఉంటుందో చూడండి – ఒక తండ్రి తన కొడుకుతో సంబంధం లేదని, అతడు తన కొడుకే కాదని పత్రికలో ప్రకటిస్తాడు. కాని నీ బిడ్డలు ఎవరని ఎవరైనా ప్రశ్నించినపుడు ఆ కొడుకు పేరు కూడా చెబుతాడు. అలాగే ఆ కొడుకు కూడా నీ తండ్రి ఎవరని అడిగితే ఆ తండ్రి పేరే ఉదాహరిస్తాడు. ఈ సంబంధం తెగిపోయేది మరణించినపుడే. అలాగే బాబూజీతో మన సంబంధం కలిసిపోయే వరకు నిలిచి ఉంటుంది.

మనం ఏ పని ప్రారంభించాలన్నా ముందు ఆలోచనలతో సతమతమైపోతాం. అలా ఆలోచిస్తూనే అలసిపోతాం. అందుకనే బాబూజీ – పనిచేయటానికి ఆలోచన చేయవద్దు అన్నారు. ఇది చేయాలి, అది చేయాలి, అక్కడికి వెళ్ళాలి, ఇక్కడికి వెళ్ళాలి అని హైరానాపడితే పని జరగదు. **వారి** (బాబూజీ) మీదే ధ్యాస నిలిపి, వారికే నివేదన చేసుకుని ప్రారంభిస్తే ప్రతిపనీ దానంతట అదే జరిగిపోతుంది. మనకు భారం తగ్గుతుంది.

ఇటీవల అందరూ పనిభారం వలన ఒత్తిడి (టెన్షన్) పెరుగుతోందని అనుకుంటూ ఉంటారు. ఇంటి పని, పిల్లల పని, ఆఫీసు పని ఇలా ఎన్నో రకాలుగా ఒత్తిడికి గురౌతూ ఉంటారు. అందుకు నివారణ ఒక్కటే. మీరు ఎవరికైతే సమర్పితమయ్యారో వారిని (బాబూజీ) మీ ఎదుట నిలుపుకోండి. వారే చేస్తున్నారనుకోండి. మీకు ఒత్తిడి తగ్గుతుంది. పని జరిగిపోతుంది.

మనలోని 'నేను' అనే దానిని మనం 'వారి'కి సమర్పించాము కాబట్టి మనం 'వారి'నే చూడాలి. మన అటెన్షన్ (దృష్టి) 'వారి' మీదనే ఉన్నప్పుడు 'అహం' తగ్గిపోతుంది. 'వారు' డివైన్, 'వారి'లో అహం లేదు కాబట్టి, 'వారి'ని చూస్తూ చూస్తూ ఉంటే మీలోని అహం కూడా నశించిపోతుంది. ధ్యానంలో ఎక్కువగా ఆలోచనలు వచ్చినపుడు, వెంటనే ఒక్క సెకండు కండ్లు తెరచి 'బాబూజీ' నా ఎదుటనే ఉన్నారు, 'వారు' నన్నే చూస్తున్నారు అని అనుకొని మరల ధ్యానం చేస్తే ఆలోచనలు రావు. ఎందుకంటే, 'వారు' థాట్‌లెస్ పర్సనాలిటి (శూన్యభావ మూర్తి) కాబట్టి. ఎవరికైతే మన 'అహం'ను సమర్పించామో 'వారి'నే మన ఎదుట ఉంచుకొని అన్ని పనులు చేయండి.

ఒకసారి ఒక అభ్యాసీ "బాబూజీ! మేము షాజహాన్‌పూర్ రావడానికి మీరు మాకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదు?" అని అడిగాడు. అప్పుడు బాబూజీ, "ఈ మధ్యనే కదా నీవు ఇక్కడికి వచ్చి వెళ్ళావు మళ్ళీ, ఎందుకు రావాలనుకుంటున్నావు?" అని అడిగారు.

**అభ్యాసీ: నాకు ఇక్కడకు రావాలని నా మనస్సు చాలా కోరుకుంటూంది.**

అప్పుడు 'వారు' చాలా చక్కని జవాబు చెప్పారు.

"నేను నీ మీద పనిచేసి నిన్ను సరిదిద్దాలి కాబట్టి నీవు నాకు జ్ఞాపకం ఉన్నావు. నీవు నాకు జ్ఞాపకం ఉన్నావు కాబట్టి, నీ శరీరం నా ఎదుట ఉండవలసిన అవసరం లేదు. నీవు ఇక్కడి నుండి నన్ను నీ వెంట తీసుకొని వెళ్ళినట్లయితే నీవు షాజహాన్‌పూర్‌కు రావలసిన అవసరమే లేదు. నీవు నన్ను కేవలం షాజహాన్‌పూర్‌లోనే చూస్తున్నావు. అందుకనే నీవు ఇక్కడకు మరల-మరల రావాలని కోరుకుంటున్నావు. ఇక్కడి నుండి నన్ను నీతో పాటుగా తీసికొని వెళ్ళు."

మీరు అదుర్దా చెందుతూ, ఆలోచిస్తూ, వ్యధ చెందుతూ జీవిస్తూ ఉంటూ మరణిస్తారు. ఇవన్నీ 'వారి' ఇచ్ఛానుసారమే జరుగుతూ ఉంటాయి. లక్షలాదిగా ధనం ఉండవచ్చు. కాని జబ్బు చేసిందంటే ఏమీ తినలేరు. అది కూడా 'వారి' ఇచ్ఛానుసారమే. కనుక మనకు ఏది ఇచ్చినా బాబూజీ మహరాజ్‌గారే. ఏది జరిగినా 'వారి' ఇచ్ఛానుసారమే అని గ్రహించాలి.

**ప్రశ్న: నిరంతర స్మరణను ఎలా అలవర్చుకోవాలి?**

**జవాబు:** దేనికయితే అవాంతరం లేదా అవరోధం కలగదో అది నిరవధికం లేదా నిరంతరమైంది అవుతుంది. స్మరణ అనేది మనల్ని బాబూజీతో సంధానపరచేది, అనగా కనెక్షన్. మనం వారిని మరిచిపోయినప్పుడు ఈ కనెక్షన్ తెగిపోతుంది. అలా తెగిపోకుండా నిరంతరం నిలిచి ఉండేది నిరంతర స్మరణ లేదా సతత స్మరణ అవుతుంది. మనం ఏ పని చేస్తున్నా 'వారి' స్మరణ కలిగే ఉండాలి. అప్పుడు వాటంతటవే జరిగిపోతాయి. మేము మీ వద్దనే ఉన్నాం. మేము మీ వారమే అనుకోవాలి. 'వారు' మనవారే అయినప్పుడు వారిని ఎలా మరవగలం! ఆ కనెక్షన్ తెగిపోదు. తెగిపోతుందంటే అది మన స్వయంకృతమే.

**ప్రశ్న: ధ్యానంలో మగ్నం కాబోయే ముందు (క్లీనింగ్) నిర్మలీకరణ ఎందుకు? అప్పుడు నిర్మలీకరణం చేసుకోవటం సరియైనదేనా?**

**జవాబు:** అప్పుడు నిర్మలీకరణ అనేది ధ్యానంలో లోతుగా వెళ్ళటం కోసం ఉద్దేశించబడింది. ధ్యానం చేయాలి అనే భావం కలిగినప్పుడు ధ్యానమే చేసుకోవచ్చుగాని నిర్మలీకరణ యొక్క అవుసరం లేదు.

క్లీనింగ్, ప్రార్థన అనేవి ధ్యానంలో మగ్నతకు సహాయకాలు. బాబూజీ చెప్పిన మాట ఒక్కటే గుర్తుంచుకోండి. అదేమంటే మీరు ఇంటి పనులు ఏవైనా చేసుకోండి నన్ను దృష్టిలో నిలుపుకొని, అన్నారు. ఎవరికైతే గురువు మీద పరిపూర్ణ విశ్వాసం ఉండదో వారికి ఇవి అవసరమని తోస్తూ ఉంటాయి. బాబూజీ తమ శక్తిని నిరూపించారు. ప్రేమ, భక్తి అనేవి ముఖ్యం. మనం ఏమైనా తప్పు చేసి ఉన్నామనిపించినా, కోపం, ద్వేషం లాంటివి కలిగాయని అనుకున్నా, వాటివలన ఏర్పడిన సంస్కారాలను తొలగించుకోవటానికి క్లీనింగ్ అవసరం. కాని, నియమం మాత్రం కాదు. ఒకసారి ఒక అభ్యాసి బాబూజీ – మీరు ఆరుగంటలకు క్లీనింగ్ చేసుకోమన్నారు. నాకు 5 గంటలకు చేసుకోవాలనిపిస్తుంది. ఒక్కోరోజు ఇంకొక సమయంలోను, మరొకసారి రెండుసార్లు క్లీనింగ్ చేసుకోవాలనిపిస్తుంది అని అన్నాడు. అందుకు బాబూజీ అదేమీ అవసరం లేదని చెప్పి అతడు గత జన్మలో ఏదో క్లీనింగ్ పని చేసి ఉంటాడు. అందుకే ఇతనికి తరచుగా క్లీనింగ్ పని దృష్టికి వస్తోంది అన్నారు. క్లీనింగ్, ధ్యానం ప్రత్యేక సమయాల్లో చేయాలన్నారు గదా అని అడుగుతున్నారంటే, అది అభ్యాసిగా తయారు కావటానికి; అభ్యాసి అయిన తరువాత నియమం కాదు.

నేను ధ్యానంలో ఒక పర్వతాన్ని చూశాను, ఒక గుహను చూశాను, అది కనబడింది, ఇది కనబడింది, అంటూ చాలామంది నాకు ఉత్తరాలు వ్రాస్తారు. కాని ఆధ్యాత్మికతలో ఈ చూడడం అనే దానికి ఎలాంటి అర్థం లేదు. ఆధ్యాత్మికతలో ఫీలింగ్ (అనుభూతి) అనేది ముఖ్యమైనది. మీకు ధ్యానంలో 15 నిమిషాలు ఒక గుహలోకి వెళ్ళినట్లు ఉంది. అయితే అక్కడి కండిషన్ (స్థితి) ఏ విధంగా ఉంది? మీరు ఆ గుహలో ఉన్నప్పుడు కలిగిన ఫీలింగ్ ఏమిటి? ఇది ముఖ్యం. ఆ ఫీలింగ్ యొక్క సంబంధం ఆధ్యాత్మికతతో కూడి ఉంటుంది. అనుభూతియే భగవంతుని భాష అని బాబూజీ చెప్పేవారు. అంటే ధ్యానంలో 'వారు' మనకు ఏదో ఇస్తున్నారు. దాన్ని మనం తీసుకుంటున్నాం. దానిని అనుభూతి ద్వారా తెలియజేస్తున్నాం. ధ్యానంలో ఒక్కొక్కసారి నిద్ర వస్తూంది – అని కొంతమంది అభ్యాసులు అంటారు. అప్పుడు ఆ ధ్యానంలో ఎటువంటి స్థితి (కండిషన్) లేకుండా కేవలం నిద్రపోవాలనే ఫీలింగ్ ఉంటే అది నిద్ర మాత్రమే! కాని ఆ నిద్రలో ఏదైనా ఫీలింగ్ ఉంటే, ఆనందం ఉంటే అది నిద్ర కాదు. అది సుషుప్తావస్థ.

**ప్రశ్న: నిద్రపోతున్నాననే భావన లేనప్పటికీ, ధ్యానం చాలా గాఢంగా ఉంది. ధ్యానంలో అప్పుడు ఏమి జరుగుతుందో నాకు తెలియడం లేదు.**

**జవాబు:** ధ్యానంలోకి లోతుగా వెళ్ళండి అని బాబూజీ అనేవారు. లోతుగా వెళ్ళడం అంటే – ధ్యానానికి 'వారి' సామీప్యత (నియర్‌నెస్) తో అనుసంధానం జరిగిందని అర్థం. అనగా 'వారి'కి దగ్గరగా చేరుకున్నామని అర్థం.

**సబ్‌మిషన్ (అర్పణ):** నేను మీవాడిని, (ఆత్మ–నివేదన) నేను ఎలా ఉన్నాగాని నేను మీవాడినే –అనే భావన.

**సరెండర్ (సమర్పణ–శరణాగతి):** బాబూజీ మహరాజ్ మన సబ్‌మిషన్‌ను (అర్పణను) స్వీకరించినప్పుడు కలిగే ఫలితమే సరెండర్. 'నేను', 'నీ' అనే ద్వంద్వ భావన మాయమవుతుంది. 'వారు' మీకు జ్ఞాపకం వచ్చినప్పుడు మీరు ఆయనవాడిగా అయిపోయినట్లు మీకు అనిపిస్తుంది. "బాబూజీ! నేను మీకు సెల్ఫ్–సరెండర్ అయ్యాను. నన్ను 'నేను' మీకు సమర్పించుకున్నాను అని అభ్యాసులు నాతో అంటారు. కాని ఆ అభ్యాసులు సెల్ఫ్ (నేను) అనే దానిని తమ దగ్గరే ఉంచుకుని, సమస్యలు, కష్టాలు అన్నింటిని మాత్రమే నాకు సమర్పణ చేస్తారు" అన్నారు బాబూజీ.

ఎప్పుడైనా సరే 'ఐ' అనే మాటను ఉపయోగించినప్పుడు 'ఐ' అంటే నేను, నాది అని కాకుండా ఈ 'ఐ' అనేది 'వారి' ది అని భావించాలి.

బాబూజీ మహరాజ్ ప్రిసెప్టర్లకు అన్నీ నేర్పుతారు. మీకు మేము సిట్టింగ్ ఇచ్చేప్పుడు మీరు ఏ స్థితిలో ఉన్నారో – ఇంకా అంతకంటే ఉన్నతమైన స్థితిలోకి మిమ్మల్ని ఏ విధంగా చేర్చాలి, మొదలగు విషయాలన్నీ 'వారి' నేర్పువల్లే మాకు తెలుస్తాయి. మేము అభ్యాసులకు సిట్టింగ్ ఇచ్చినపుడు మాకు –

1) అభ్యాసీ హృదయంలో బాబూజీ షాడో (నీడ) కనబడుతుంది.

2) అభ్యాసీ హృదయంలో బాబూజీ ప్రజన్స్ (సాన్నిధ్యం) చూస్తాం.

3) అభ్యాసీ హృదయంలో ఒక ప్రకాశం ఉంటుంది. ఆ ప్రకాశంలో బాబూజీ మహరాజ్ కనబడతారు. వీటి అర్థం ఏమిటంటే,

1) బాబూజీ (నీడ) కనపడింది అనగా అభ్యాసీ తలంపులో బాబూజీ ఉన్నారు అని.

2) బాబూజీ ప్రజన్స్ (సాన్నిధ్యం) కనబడితే ఆ అభ్యాసీ **వారి** స్మరణలో (మునిగి) ఉన్నాడు అని.

3) ప్రకాశంలోపల బాబూజీ కనబడితే ఆ అభ్యాసీలో నుండి 'ఐ'నెస్ (నేను అనేది) తొలగించబడుతున్నది అని అర్థం.

4) మేము ఎవ్వరమైనా అభ్యాసీకి సిట్టింగ్ ఇచ్చినపుడు నాకు ఏమని అనిపిస్తుందంటే ఆ అభ్యాసీ శరీరం మాత్రం ఇక్కడ ఉంది కాని, అతడు బాబూజీ వద్దనే ఉన్నట్లుగా తెలుస్తుంది.

మనస్సు మందిరం కాదు. హృదయం అనే దేవాలయంలో దైవం ఉన్నాడు. బాబూజీతో మనం ఆ హృదయంతోనే కనెక్ట్ (అనుసంధానం) చేసుకోవాలి. "బాబూజీ నా వారు" అనుకోవాలి. హృదయంతో దాని (ఫీల్) అనుభూతికై ప్రయత్నించాలి. నా కొడుకు, నా కూతురు అనుకొంటాము. అలా కాకుండా – వీరు బాబూజీ పిల్లలు. ఇది 'వారి' కుటుంబం అని అనుకోవాలి. "బాబూజీ మనవారు" అనే బాంధవ్యాన్ని మనం ఏర్పరచుకోవాలి.

దైవం మనకు ఏదైనా ఇచ్చినపుడు దానిని ఎవ్వరూ కూడా మన నుండి తీసుకోలేరు. మనకు ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి శక్తిని) ఎవరూ కూడా ఆపుచేయలేరు. అయ్యో! ట్రాన్స్‌మిషన్ కట్ అవుతుందేమో అనీ – వారెవరో ఆపుచేస్తారు అని అనుకుంటే – ఆ అనుకునే వారికి బాబూజీ మీద నమ్మకం, విశ్వాసం లేదని అర్థం. విశ్వాసం ఉంటే మనకు బాబూజీతో కనెక్షన్ (లింక్) అనేది ఉంటుంది.

'మాస్టర్' అంటే మనస్సు కాదు, 'మాస్టర్' అంటే ఓ వ్యక్తీ కాదు. 'మాస్టర్' అంటే ఆ "అంతిమం యొక్క దివ్య శక్తి."

బాబూజీ అవతరించడానికి ముందు శ్రీకృష్ణుడు 'పూజ' నిచ్చేవాడు. అంటే శ్రీకృష్ణుడు జీవించే ఉన్నాడనే కదా అర్థం.

**ప్రశ్న: లివింగ్ మాస్టర్ సశరీరులుగా అవసరం లేనప్పుడు మరి రాముడు, కృష్ణుడు భూమి మీదకు ఎందుకు వచ్చారు?**

**జవాబు:** రావణునికి ముక్తిని ఇవ్వాలనే సంకల్పంతో రాముడు భూమి మీదకు వచ్చాడు. శ్రీకృష్ణుడు దుష్ట

సంహారం కోసం వచ్చాడు. ఇంక – సర్వ మానవాళిని 'అంతిమ సత్యం' వద్దకు తీసుకుపోవాలనే ఒక దివ్య సంకల్పంతో బాబూజీ మహరాజ్ భూమి మీద అవతరించారు. ఆ సంకల్పం యుగయుగాల పర్యంతం ఉంటుంది. ఆ సంకల్పం పూర్తి అయ్యేవరకు బాబూజీ మహరాజ్ యొక్క 'దివ్య శక్తి' ఇక్కడే ఉంటుంది.

మాస్టర్‌లో జీవించడం (లివ్ ఇన్ మాస్టర్) అంటే బాబూజీ ఇక్కడే (మన స్థానంలో) ఉన్నారు. 'వారు' జీవిస్తున్నారు, కాని 'నేను' కాదు అని అర్థం.

నీవు నిరంతరం స్మరణలో ఉంటే, నిరంతర ధ్యానంలో నీవు ఉన్నట్లే. నీవు నిరంతరం ప్రాణాహుతి ధారలో ఉన్నావు. నీవు ఒక గంటకంటే ఎక్కువసేపు ధ్యానం చేయలేవు. మనస్సు అలసిపోతుంది. నిరంతర ప్రేమతో కూడిన స్మరణే ముఖ్యం.

విదేశీ అభ్యాసులు, కొందరు దక్షిణభారతదేశ అభ్యాసీలు బాబూజీని దివ్యతామూర్తి (డివైన్ పర్సనాలిటీ) అని సంబోధించేవారు. మరి కొంతమంది 'వారిని' బాబూజీ అని పిలిచేవారు.

"మిమ్మల్ని ఏ విధంగా సంబోధన చేస్తే మీకు ఇష్టం" అని ఒక అభ్యాసీ బాబూజీని అడిగాడు.

"నాకు ఆ డివైన్ పర్సనాలిటీ (దివ్యతామూర్తి) గురించి ఏ మాత్రం తెలియదు. 'డివైన్ పర్సనాలిటీ' అని నన్ను పిలిస్తే, నాకు అభ్యాసీకి మధ్యన ఒక విధమైన వేర్పాటు భావం మిగిలి దూరం ఏర్పడుతుంది. అభ్యాసుల మీద చేయవలసిన పనిని చక్కగా చేయలేను. కాని అభ్యాసులు నన్ను ప్రేమతో 'బాబూజీ' అని పిలిస్తే నేను వాళ్ళతో కలిసిపోయి బాగా పనిచేయడానికి వీలవుతుంది" అన్నారు బాబూజీ.

అదే విధంగా ప్రిసెప్టర్ కూడా లోపల తాను ఓ ప్రిసెప్టర్‌ను – వీళ్ళు అభ్యాసులు అనే భావన ఉంటే అతడు పనిని సరిగా చేయలేడు. ప్రిసెప్టర్ అభ్యాసులను తన సోదరునిగా, సోదరిగా భావిస్తే తన పని చక్కగా చేయగలడు.

సెల్ఫ్ కంట్రోల్ – మన మీద మనకి పట్టు, మన మీద మనకు కంట్రోల్ – నియంత్రణ ఉండడం. కాని ఎప్పుడైతే మనం మనల్ని బాబూజీకి ఇచ్చివేస్తామో – అర్పించేస్తామో అప్పుడిక ఈ సెల్ఫ్-కంట్రోల్ అనేది బాబూజీ-కంట్రోల్ అవుతుంది. అంటే మనం 'వారి' కంట్రోల్‌లో – 'వారి' నియంత్రణలో ఉంచబడతాము.

ప్రేమ చాలా సులభమైనది.

భక్తి చాలా కష్టమైనది.

ప్రేమ సులభంగా నిరంతర స్మరణ వలన వస్తుంది.

భక్తి అంటే దివ్యత్వం అనే సముద్రం లోపలికి మునిగిపోయి తిరిగి తేలకపోవడమే.

శ్రీ లాలాజీ సాహెబ్ జన్మదినోత్సవం – "వసంత పంచమి" నాడు నేను గమనించి అనుభూతి చెందనది ఏమంటే, మొత్తం వాతావరణం అంతా ఛార్జ్ చేయబడి ఉంది. అభ్యాసులంతా తమను తాము మరచిపోయినట్లుగా అనుభూతి చెందారు. బాబూజీ మన ప్రశ్నలన్నిటికీ జవాబులు చెప్పేవారు. ఆ వసంత పంచమి యొక్క మూడు రోజులు కూడా వాతావరణం చాలా ప్రత్యేకంగా ఉండి శ్రీ బాబూజీ మహరాజ్ వారి గొప్పతనం మనకు అనుభూతిలోకి వచ్చేది. ఉత్సవం పూర్తికాగానే లాలాజీ సాహెబ్ ఆ వాతావరణాన్ని తిరిగి వెనుకకు తీసుకునే వారని బాబూజీ మాకు చెప్పేవారు.

మన హృదయాన్ని బాబూజీ మహరాజ్‌తో కనెక్ట్ (సంధానం) చేసుకుంటే – కలుపుకుంటే మనలో ఎక్కువ ప్రాణాహుతి బాగా తీసుకునే సామర్థ్యం పెరుగుతుంది. ఉత్సవాలలో పాల్గొంటే మన ప్రోగ్రెస్ ఎక్కువగా ఉంటుంది. ఎందుచేతనంటే మీ హృదయం బాబూజీ మహరాజ్‌తో సంధానమై (కలపబడి) ఉంటుంది కాబట్టి. అప్పుడు మీరు –"నేను ఇక్కడ లేను" "అక్కడ ఉన్నాను" అని ఫీల్ (అనుభూతి) అవుతారు. ధ్యాన సమయంలో మనం మన లక్ష్యాన్నే గుర్తు పెట్టుకోవాలి. నీవు దైవాన్ని గుర్తుపెట్టుకుంటే ధ్యానంలో నిన్ను చీకాకుపెట్టే ఇతర ఆలోచనలన్నీ తొలగిపోతాయి.

మతం అంతమైనప్పుడు ఆధ్యాత్మికత ప్రారంభమవుతుంది. ఆధ్యాత్మికత అంతం అయినప్పుడు వాస్తవికత (రియాలిటి) ప్రారంభమవుతుంది. రియాలిటి అంతమైనప్పుడు బ్లిస్ –పరమానందం మొదలవుతుంది అని బాబూజీ వ్రాశారు. వీటి స్థితి ఏమిటి? వీటి సరిహద్దులు ఏమిటి? వాటిని మీరు ఈ విధంగా గ్రహించండి.

ఎప్పుడైతే దేహ–భావన పోతుందో అప్పుడు మతం అంతం అవుతుంది. ఎప్పుడైతే ఆత్మ పరమాత్మ –శక్తిలో విలీనం అవుతుందో అప్పుడు ఆధ్యాత్మికత అంతమై రియాలిటీ (వాస్తవికత) మొదలవుతుంది. ఆపైన భగవత్ సాక్షాత్కారం పొందాక – సెంట్రల్ రీజియన్ (కేంద్ర మండలం)లో ఎప్పుడు ప్రవేశించుతామో అప్పుడు బ్లిస్ (పరమానందం) మొదలవుతుంది. ఈ బ్లిస్ తరువాత ఇంకొక స్థితి ఉంది. అది చివరిది – టేస్ట్ లెస్ టేస్ట్ – (రుచి భావన లేని రుచి). దీనినే బాబూజీ మహరాజ్ 'తమ్' అని అన్నారు. బాబూజీ మహరాజ్ మిమ్మల్ని ఆ 'తమ్' స్థితికి తీసుకు వెళ్ళిన తర్వాత అక్కడి ఆ స్థితి గురించి తెలుస్తుంది. అది మీ యొక్క స్థితియే అనిపిస్తుంది. కాని అది మీ స్థితి కాదు. అది ఆ ప్రదేశం యొక్క స్థితి మాత్రమే. అక్కడ 'ఐ' (నేను) అనేది లేదు. ఐడెంటిటి (నేను అనే నామమాత్రపు గుర్తు) అనేది సుషుప్తావస్థలో ఉంటుంది. అక్కడ టేస్ట్ – రుచి ఉంది, కాని గుర్తించలేము. అందుకే అది టేస్ట్‌లెస్ టేస్ట్.

బాబూజీ నన్ను ప్రతి దశను, అన్ని స్థితుల గురించీ వ్రాయమని చెప్పారు. నేను శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క టైప్ రైటర్‌ను మాత్రమే అని చెప్పగలను. స్టెనోగ్రాఫర్ అంటే ఎవరైనా చెప్పింది విని, వ్రాసుకొని మరల ఒకచోట కూర్చొని వివరణతో పూర్తిగా వ్రాస్తారు. స్టెనోకు మనస్సు ఉంది. కాని నాకు మనస్సు లేదు. టైప్ రైటర్‌కు కూడా మనస్సు లేదు.

బాబూజీ నా మీద పరిశోధన చేయడానికి గాను నన్ను ఎన్నుకొన్నప్పుడు మొదట నాలో పరిశోధనకు సంబంధించిన స్థితులనన్నింటిని నింపి ఆ తరువాత 'వారు' నా మీద తన దైవీయ పరిశోధనను పూర్తి చేశారు. ఆ స్థితుల గురించి నేను వర్ణించినపుడు మాత్రం ఆ గొప్పతనం నాకు ఇచ్చేవారు. పరిశోధన 'వారు' చేసి ఆ ఘనత మాత్రం నాకు ఇచ్చేవారు. తాను చేసే ప్రతి పనిని తన బిటియా (కస్తూరి) సమర్థవంతంగా చేయగలదని 'వారి'కి తెలుసు.

సహజమార్గం అనేది ఒక సహజమైన (జీవన) పద్ధతి. సహజమార్గ పద్ధతిని ఉన్నది ఉన్నట్లుగా సరియైన విధానంలో ఆచరించినప్పుడే ఫలితం వస్తుంది.

లైట్‌నెస్ (తేలికదనం) అనేది మన ఎగో (అహం) యొక్క ప్రాముఖ్యత (బరువు) తగ్గుతున్న సూచన – అని అర్థం. ఒకసారి నేను "బాబూజీ! రెండు రోజుల నుండి నాకు చాలా ఆనందంగా ఉంది. కాని ఇప్పుడు

నాకు ఏ ఆసక్తి లేనట్లు (డిస్ ఇంటరెస్టెడ్‌నెస్) గా అనిపిస్తోంది. ఎవరో నా నుండి ఆ ఆనందాన్ని దోచుకొన్నట్లుగా ఉంది" అని **వారి**కి ఉత్తరం వ్రాశాను. దానికి **వారు** "నిన్ను ఏదైతే ఆకర్షించిందో అది ఆ స్థితి (కండిషన్) యొక్క శక్తి. అందువల్లనే చాలా ఆనందంగా అనిపించింది" అని జవాబుగా వ్రాశారు.

ఈశ్వరీయ దేశం వరకు ఆనందం, టేస్ట్ (రుచి) అనేది పొందుతాం. సెంట్రల్ రీజియన్ (కేంద్ర మండలం) అనేది భూమా యొక్క అనగా బాబూజీ మహరాజ్ యొక్క వైభవం. ఇక్కడ రత్నాలు, ముత్యాలు (అనేటటువంటి స్థితులు) చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. వాటినన్నిటిని చూసి మనం ప్రోగుచేస్తున్నాం. అక్కడ 'ఐ' అనేది (నేను – తాను) లేనందున అక్కడి స్థితిని 'నా' స్థితి అని చెప్పలేం. ఆ స్థితిని (భూమా వైభవాన్ని) ఆ ప్రదేశం యొక్క స్థితి అని మాత్రమే చెప్పగలం. కేంద్ర మండలంలో మనం ఆ భూమా యొక్క వైభవాన్ని చూడగలం. కాని అక్కడ 'ఐ' అనేది లేనందున టేస్ట్‌ను (స్థితి భావన) పొందలేం. ఎందుకంటే దేనితోనైనా 'ఐ' అనేది కలిసినప్పుడు (కనెక్ట్ అయినప్పుడు) ఆ స్థితి భావన (టేస్ట్) ఉంటుంది. కేంద్ర మండలంలో (సెంట్రల్ రీజియన్‌లో) 'ఐ' అనేది లేదు. కాని ఐడెంటిటి (గురుతు) అనేది ఉంది. సెంట్రల్ రీజియన్ తరువాత బాబూజీ మనల్ని సెవెన్ రింగ్స్ (ఏడు తేజోవలయాలు) లోనికి తీసుకొని వెళ్ళతారు. ఆ ఏడు తోజోవలయాలలోనికి ప్రవేశించగానే ఇప్పటివరకు బాబూజీ మహరాజ్ మనతోనే ఉన్నారనే ఆ టేస్ట్ (స్థితి భావన) కూడా మాయం అవుతుంది. ఈ ఏడు తోజో వలయాలు దాటాక అల్టిమేట్ రీజియన్ అనగా భూమా యొక్క సామ్రాజ్యానికి 'వారు' మనల్ని తీసుకువెళ్ళతారు. ఇక్కడ టేస్ట్ అనేది లేదు. ఈ భూమా సామ్రాజ్యములో మీరు ఒక మహాశక్తిని దర్శిస్తున్నట్లుగా అనిపిస్తుంది. బాబూజీ మహరాజ్ భూమా యొక్క ఆ దృశ్యాన్ని చూపిస్తున్నట్లుగా అనిపిస్తుంది. అల్టిమేట్ రీజియన్‌లో ఐడెంటిటి లేదు. నిజానికి ఐడెంటిటి (నామమాత్రపు గుర్తు) ఉంది. కాని ఆ గుర్తు సుషుప్తావస్థలో ఉంది. ఈ భూమా సామ్రాజ్యంలో ఐడెంటిటి (గుర్తు) అనేది తననుతాను గుర్తుపట్టలేదు. "ఐడెంటిటి కెనాట్ ఐడెంటిఫై" అని బాబూజీ అన్నారు. ఐడెంటిటి లేనప్పుడు మీరు టేస్ట్‌ను ఏ విధంగా గుర్తించగలరు. అందువలన భూమా సామ్రాజ్యంలో మీరు భూమా యొక్క మహాశక్తిని దర్శించగలరు. కాని దాని టేస్ట్ (స్థితి భావనను – ఆనందాన్ని) పొందలేరు. అల్టిమేట్ రీజియన్ తరువాత శ్రీ బాబూజీ మహరాజ్ మనలను అంతర్గత చలనం (లేటెంట్‌మోషన్) వద్దకు చేర్చుతారు. ఇక్కడ కూడా ఐడెంటిటి సుషుప్తావస్థలోనే ఉంటుంది. అంతర్గత చలనం యొక్క కంపనలు (వైబ్రేషన్స్ – కదలికలు) ఇక్కడ ఉంటాయి. దీనికి కూడా టేస్ట్ లేదు. అందువల్లనే ఇక్కడి స్థితిని టేస్ట్‌లెస్ టేస్ట్ (రుచి భావన లేని రుచి) అని అన్నారు. ఎప్పుడైనా మనకు చాలా అనారోగ్యంగా ఉండడంవలన మనకు తినే దాని రుచి (టేస్ట్) తెలియదు. అదే విధంగా అల్టిమేట్ రీజియన్‌లో (భూమా సామ్రాజ్యంలో) టేస్ట్ ఉన్నప్పటికి ఐడెంటిటి (తాను అను గుర్తు) సుషుస్తావస్థలో ఉండడం వలన అక్కడి టేస్ట్‌ను (స్థితి భావనను – ఆనందాన్ని) టేస్ట్ చేయలేకపోతున్నాం.

ఇప్పుడు ఓ ప్రశ్న ఎదురవుతుంది. అది ఏమిటంటే, "భూమా కేంద్రం అంటే టేస్ట్‌లెస్ కండిషన్ (స్థితి భావన లేని స్థితి) నుండి అవతరించిన బాబూజీ మహరాజ్ మరి ఏ టేస్ట్ (స్థితి భావన) తో ఈ భూమి మీద ఉన్నారు?" అని.

లాలాజీ సాహెబ్ ప్రార్థనా శక్తివలన అల్టిమేట్ పవర్ (అంతిమ శక్తి) యందు వైబ్రేషన్ (కంపనలు) ఏర్పడ్డంతో శ్రీ బాబూజీ మహరాజ్ ఈ భూమి మీద అవతరించారు. లాలాజీ మహరాజ్ కృపాకటాక్షం వలన ఆ అంతిమశక్తియే బాబూజీ మహరాజ్ రూపాన అవతరించింది. అందుచేత బాబూజీ యొక్క ప్రాణం, జీవనాధారం ఆ అంతిమశక్తియే!

బాబూజీ చిన్న పిల్లలకు ప్రసాదం పంచుతూ ఇదే చిన్న పిల్లలకు పూజ, అంటూ నవ్వేవారు. పెద్దవాళ్ళు పూజలో కూర్చున్నప్పుడు సహజంగానే చిన్నపిల్లలు ప్రసాదం కొరకు ఆశిస్తారు. అందువలన పిల్లల కోసం ప్రసాదాన్ని లాలాజీ సాహెబ్‌కు నివేదన చేసి బాబూజీ వాళ్ళకు పంచేవారు.

మనం బాబూజీ మహరాజ్‌కు ప్రసాదం నివేదన చేసినప్పుడు ఆ ప్రసాదంలోని అణువణువు 'వారి' దివ్య ప్రేమతో **వారి** దివ్య శక్తితో నిండిపోయి దాన్ని ఎవరు తిన్నా వాళ్ళ లోపల దివ్యత్వం నిండిపోవాలని బాబూజీని ప్రార్థించాలి. చిన్న పిల్లలకు ప్రసాదం యొక్క విలువ తెలియదు. దాన్ని స్వీట్‌గా భావించి తింటారు. కాని మనం అభ్యాసులం మాత్రం దాన్ని ప్రసాదంగా భావించి స్వీకరించాలి.

ఒకసారి ఒక అభ్యాసి "బాబూజీ! ప్రసాదం కొద్దిగా తింటే కొంచెమే ప్రొగ్రెస్ ఉంటుంది. మీరేమో ప్రసాదం చిన్నగా కొద్దిగా ఇస్తున్నారు. ఎక్కువగా ఇవ్వడం లేదు. నేను ప్రసాదాన్ని దొంగిలించి ఎక్కువగా తింటే చాలా ప్రోగ్రెస్ వస్తుంది కదా మరి" అని అడిగాడు. అప్పుడు బాబూజీ "జ్ఞాపకం పెట్టుకో! దొంగతనం చేస్తే జైలుకు పోతావు. ప్రసాదం యొక్క ఉపయోగం ఉండదు కాని దొంగతనం యొక్క ఫలితం ఉంటుంది" అని అన్నారు.

ఏది తిన్నా సరే ప్రతిదీ – అది దివ్యత్వం యొక్క ప్రసాదంగా భావించి తినాలి. మంచినీళ్ళు త్రాగుతున్నప్పుడు ఇది నీరు కాదు, ఈశ్వరీయ ధారనే త్రాగుతున్నాం, అని అనుకోవాలి. అభ్యాసి దేని వలన పోషింపబడతాడు? దివ్యత్వం వలన. కాని ప్రతిదీ బాబూజీ ప్రసాదంగా భావించి తినాలి. మనం భోజనం చేస్తున్నప్పుడు ఇది రుచికరంగా లేదని ఒక్కోసారి అంటాము. కాని షాజహాన్‌పూర్‌లో ప్రతి అభ్యాసి – ఇక్కడి వంటకాలు ఎంత బాగున్నాయి! ఎంత తిన్నా, ఇంకా ఇంకా తినాలనిపిస్తోంది – అని అంటారు. మరి ఆ రుచి వంటకానిదా? కానే కాదు. అది బాబూజీ మహరాజ్ దివ్యత్వం యొక్క రుచి.

ముఖ్యంగా సాధన ప్రారంభదశలో ఈ విధంగా భావించడం అనేది చాలా ఉపయోగకరం. కాని ఎప్పుడైతే మనం 'వారి' నిరంతర స్మరణలో జీవిస్తామో అప్పుడు పై విధంగా ఆలోచించాల్సిన లేదా భావించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఆ విధంగానే ఆటోమేటిక్‌గా (సహజంగా) జరిగిపోతుంది.

ఒకసారి ఒక అభ్యాసీ "బాబూజీ! నాలో ఫర్‌గెట్ ఫుల్ స్టేట్ – మరపుస్థితి ఏ విధంగా ఉందంటే ఒక్క మీరు తప్ప ఈ ప్రపంచంలోని అన్ని విషయాలూ జ్ఞాపకం వస్తున్నాయి కాని మీరు మాత్రం జ్ఞాపకం రావడం లేదు" అన్నాడు. అప్పుడు బాబూజీ అతడికి ఒక సులువైన చాలా చిన్న చిట్కా చెప్పారు. "నేను నిన్ను జ్ఞాపకం చేసుకుంటున్నానని అనుకో. ఇది నీవు చేయగలవు" అని.

దీని అర్థం ఏమిటి? ఎప్పటివరకైతే అభ్యాసీ మనస్సులో ఈ ప్రపంచం యొక్క ముద్ర (ఇంప్రింట్) ఉంటుందో అప్పటిదాకా అతడు మనస్సులో తన్ను గురించే ఆలోచిస్తూ ఉంటాడు. భగవంతుణ్ణి స్మరించడం

అనేది అతడికి చాలా కష్టమైన విషయం. ఎప్పుడైతే దాన్ని తిరగవేస్తారో అనగా "బాబూజీయే నన్ను తలచుకుంటున్నారు, జ్ఞాపకం చేసుకుంటున్నారు" అని అనుకుంటాడో అప్పుడు ఒక తిరగబడ్డ స్థితి మీ కోసం వస్తుంది. మీరే మీ పనులు చేసుకుంటున్నప్పుడు – బాబూజీయే మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటున్నట్లుగా అనిపిస్తుంది.

"నేనే నిన్ను స్మరించుకొంటున్నాను. నేను నిన్ను జ్ఞాపకం చేసుకుంటున్నాను" అనే బాబూజీ యొక్క ఈ చిన్న చిట్కా వలన ఆ అభ్యాసీ యొక్క భౌతిక బంధం తెగిపోయి అతడు 'వారి' జ్ఞాపకంలోకి వెళ్ళి ఉండిపోవడంతో తదితరమైనవి మరచి విజయం పొందాడు.

ఒకసారి లాలాజీ సాహెబ్ బాబూజీతో "నీవు ఏ పని చేసినా ప్రకృతి సహజ పూర్వకంగా చేయి. దానిలో 'నీ' ఉద్దేశ్యం అనేది ఉండకూడదు. అలా ఉద్దేశ్యంతో నేచర్స్ వర్క్ – పనిచేస్తే 'అసలు – మన' కండిషన్ (స్థితి) ప్రక్కకు తొలగిపోతుంది. కాబట్టి నీ ఉద్దేశ్యం (ఇన్‌టెన్షన్) ఎల్లవేళల ప్రత్యేకంగా ఉంచుకో" అని అన్నారు.

ఈ పైన చెప్పినదాని ఫలితం (రిజల్ట్) ఏమిటి అనేది నేను ఒకసారి చూశాను. బాబూజీ ఒకసారి **వారు**, తన కుమార్తెలు మాయ, ఛాయల కొరకు రెండు చీరలు కొని ఇంటికి వచ్చాక ఆ చీరలు వారికి ఇచ్చారు. రెండు రోజులయ్యాక బాబూజీ తన పెద్ద కూతురుని పిలిచి "మాయా! ఆ చీర ఎలా ఉంది? బావుందా?" అని అడిగారు. అప్పుడు ఆమె "ఆ చీర ఎలా ఉందనే ఆలోచనే రాలేదు. మీరు ఇచ్చారు. నేను తీసుకున్నాను" అని జవాబు చెప్పింది. అప్పుడు బాబూజీ నాతో ఇలా అన్నారు "బిటియా! లాలాజీ సాహెబ్ నాకు ఎంతటి చక్కని శిక్షణ ఇచ్చారో చూడు. నేను చీర కొన్నప్పుడు –ఒకవేళ నా ప్రత్యేక ఉద్దేశ్యం ఏదైనా దానిలో ఉంటే అప్పుడు ఆ చీర మీద అభిరుచి (టేస్ట్) కలిగేది. ఆ చీర బాగుందా? లేదా? ఇది మాయకు నచ్చుతుందా? లేదా? అని. కాని నాకు ఏ ఆలోచనా అప్పుడు లేదు. ఈ చీర ఎట్లా కొన్నానో నాకే తెలియదు" అన్నారు. అంటే బాబూజీ తనను తాను పూర్తిగా మరిచిపోయిన స్థితిలో చీర కొన్నారు కాబట్టి 'వారి' స్థితి (కండిషన్) యొక్క ప్రభావం 'వారి' పిల్లల మీద పడింది. అందువల్లనే ఆ చీర బాగుందో లేదో అనే ఆలోచన కూడా మాయకు రాలేదు.

బాబూజీ ఎల్లప్పుడు కూడా పూర్తిగా తన్ను తాను మరచిన స్థితిలో ఉండేవారు కాబట్టి, లాలాజీ సాహెబ్ బాబూజీని ప్రాపంచిక సంబంధమైన విషయాల్లో ప్రతిక్షణం మెలకువగా ఉండేట్లు జాగృత పరచేవారు.

బాబూజీ కూడా లాలాజీ సాహెబ్‌వలెనే అదే ప్రేమతో అలాంటి రక్షణతో అనుక్షణం మనకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. కాని మనమే 'వారి' సేవల్ని అందుకోవడానికి సంసిద్ధంగా అంటే ఆ స్థితిని పొందటానికి సిద్ధపడము.

"సంస్కారాలకు అతీతంగా ఉన్నటువంటి దివ్యతామూర్తితో (డివైన్ పర్సనాలిటితో) మనం మన సంబంధం కలుపుకున్నప్పుడు ఆ రోజు నుండే మన సంస్కారాలు భస్మమైపోతాయి" అని బాబూజీ అన్నారు.

"మీరందరు ఇక్కడికి బాబూజీగారి జ్ఞాపకంలో వచ్చారా లేకా వారి రిమెంబ్రన్స్ (స్మరణ)లో వచ్చారా? జవాబు చెప్పండి." సరే, నేనే దీనికి జవాబు చెబుతాను. స్మరణ (రిమెంబ్రన్స్)కు జ్ఞాపకానికి (మెమోరి) చాలా

భేదం ఉంది. జ్ఞాపకం అనేది మనస్సును స్పర్శిస్తుంది (అనగా ఆలోచన) స్మరణ అనేది హృదయాన్ని స్పర్శిస్తుంది (స్పందన). మేము ఇక్కడికి శ్రీ బాబూజీగారి స్మరణలోనే వచ్చాం అని మీరు అంటే, అది ఎంతో ముఖ్యమైన విషయం. ఎందుకంటే ఆలోచన (థాట్)లో మార్పు అనేది ఉంటుంది. కాని రిమెంబ్రన్స్ (స్మరణ) యందు మార్పు అనేది లేదు. మీ మనస్సు దేనితోనైనా కలిసి మునిగి (ఇన్‌వాల్వ్) అయినప్పటికిని స్మరణ అనేది మీ హృదయంలో స్థిరంగా ఉంటుంది. జ్ఞాపకం మనస్సుకు చెందినది కావటం చేత చెదరిపోతుంది. అటాచ్‌మెంట్ (అనుబంధం), డిటాచ్‌మెంట్ (వేర్పాటు) అనేది ఏర్పడుతుంది. కాని స్మరణ అనేది హృదయానికి సంబంధించినది. ఈ స్మరణవలన ప్రేమ ఏర్పడుతుంది, నిలిచి ఉంటుంది. ప్రేమ అనేది హృదయంలో ఉంటుంది. జ్ఞాపకం అనేది మనస్సులో ఉంటుంది. ఒకసారి బాబూజీ నాతో, "అటాచ్‌మెంట్ (బంధం) అనేది డిటాచ్‌మెంట్ (విబంధం) కావచ్చును కాని ప్రేమ అలా కాదు. అది స్థిరమైనది" అని అన్నారు.

**ప్రశ్న: ఏ విధంగా ప్రేమించాలో దయచేసి చెప్పండి?**

**జవాబు:** శ్రీ బాబూజీగారిని మీ హృదయంతో స్మరించండి. అప్పుడు ప్రేమ అనేది సహజంగా దానంతట అదే జనిస్తుంది. కాని ప్రేమను సృష్టించలేరు. వారిని హృదయపూర్వకంగా ప్రేమతో స్మరిస్తే దాని ఫలితంగా ప్రేమ ఏర్పడుతుంది. మనం షాజహాన్‌పూర్‌కు చాలాసార్లు వెళ్ళాలని అనుకొంటాం. ఇది అటాచ్‌మెంట్. కాని ఎప్పుడైతే మీ హృదయంలో ప్రేమ ఏర్పడుతుందో అప్పుడు మీరు బాబూజీని చూస్తారు. బాబూజీగారి ఉనికిని చూస్తారు. "బాబూజీ ఇక్కడే ఉన్నారు – బాబూజీ ఇక్కడే ఉన్నారు" అంటారు. దీనితో భౌతికంగా వారిని కలుసుకోవాలనే కోరిక నశించిపోతుంది.

బాబూజీ మహరాజ్ ఈ విధంగా అనేవారు– 'ఐ' (నేను) మరియు 'డివైన్' (దైవం) ఇద్దరూ హృదయంలో కూర్చొనే ఉన్నారు. కాని వారి ఇరువురి మధ్య స్నేహం లేదు. సహజమార్గ సాధనవలన మొదట వారిద్దరి మధ్య స్నేహం ఏర్పడుతుంది. ఎప్పుడైతే స్నేహం ఏర్పడుతుందో అప్పుడు దైవము నందు అపారమైన శక్తి ఉన్నదని ఈ 'ఐ' (నేను) తెలుసుకొని అది 'దైవం' (యు) వైపుకు ఆకర్షించబడి, దైవాన్ని గాఢంగా ప్రేమించి, దైవంలోనే లయమవుతుంది.

ఎప్పుడైతే బాబూజీ మహరాజ్ మనలోని 'నేను' అనే దాన్ని 'తన' లోనికి తీసుకుంటారో, దానినే లయావస్థ అంటారు. ఎప్పుడైతే 'ఐ' (నేను) అనేదానికి బాహ్య దృష్టి కలుగుతుందో అపుడు ఎడబాటు కలుగుతుంది. మనం ఏదైనా పని చేసేప్పుడు, నేను చూస్తున్నాను అని అనుకుంటూ ఆ లోపలి 'నేను' అనే దానినే చూస్తాం. కాని అలా కాదు. మీరు హృదయంవైపు చూడండి. మనస్సును కాదు – 'నేను' నూ కాదు.

సహజమార్గ సాధన అనేది ఒక ప్రత్యేకమైన సాధన. దీనిలో గొప్పదనం చూడండి. సాధన ప్రారంభించడానికి ముందు హృదయంలో 'నేను' అనే భావమే మీకు ఉంటుంది. అది జీవం లేని జీవితం లేదా నిర్జీవమై ఉంటుంది. ఈ జీవం లేని జీవితం అంటే మనమే. మనలోనే, మన ఆలోచనలలోనే జీవిస్తాం కాని ఈశ్వరుని యందు కాదు. కాని సాధన వలన ఎప్పుడైతే మనలో మార్పు కలిగి, ఆధ్యాత్మికతలోనికి వస్తామో, ఎప్పుడైతే మనం దైవాన్ని గురించి తెలుసుకొని, 'వారి' స్మరణలోనే ఉంటామో అప్పుడు రియాలిటి (వాస్తవికత) మన జీవితంలో ప్రవేశిస్తుంది. అప్పుడు మనం జీవించేదానిని లైఫ్ ఇన్ లైఫ్ అని అంటాం. సాధనకు ముందు

మన జీవితంలో రియాలిటి అనేది లేదు. దైవంతో మనకు సంబంధం కనెక్షన్ (లింక్) లేదు కాబట్టి అది లైఫ్‌లెస్ లైఫ్ (జీవంలేని జీవితం). ఎప్పుడైతే మనం శ్రీ బాబూజీగారి నిరంతర స్మరణలో జీవిస్తామో, అప్పుడే నిజమైన జీవితం ప్రారంభమవుతుంది.

"మీరందరు ఇక్కడికి ఏ ఉద్దేశ్యంతో వచ్చారు? బాబూజీ నుండి మీరు ఏం కోరుకొంటున్నారు?" అని ప్రశ్నించి నేనే ఇలా జవాబు చెప్పాను: "మీరందరు ఇక్కడకు వస్తారు అనే విషయం ఎప్పుడైతే నాకు ఉత్తరం ద్వారా తెలుస్తుందో, అప్పటి నుండి నేను ఏ ఆలోచనలో ఉంటానంటే, మీ అందరికి ఏ విధంగా స్వాగతం చెప్పాలి. మీ అందరి కోసం, బాబూజీ మహరాజ్‌ను ఎటువంటి ఆశీస్సుల కోసం ప్రార్థన చేయాలి" అని. 'వారి'ని కోరుకొనేది ఏమిటంటే, "బాబూజీ మహరాజ్! ఎవరైతే మీ కోసం, మీ ద్వారం వద్దకు (ఈ ఇంటికి) వస్తారో, వాళ్ళందరి హృదయాలలో మీరు ఇమిడిపోవాలి. వారు ఇక్కడి నుండి 'మిమ్మల్ని' తీసుకొని వెళ్ళాలి. ఎవ్వరూ ఖాళీ చేతులతో వెళ్ళకూడదు" అని 'వారి' ని ప్రార్థిస్తాను.

అంటే మీరు ఇక్కడికి బాబూజీ స్మరణలో రాలేదని, మీ లోపల బాబూజీ ఆశీస్సులు లేవని నేను చెప్పడంలేదు. కాని ఎంతైనా మనలో కొంత లోటు అనేది ఉంటుంది. ఇక్కడకు రావటంవలన అది సరిదిద్దబడి, ఆ లోటు పూరింపబడి, "బాబూజీ మన వారు" అని పూర్తిగా విశ్వాసం ఏర్పడుతుంది.

**ఒకసారి బాబూజీ ఏమన్నారంటే, "అభ్యాసీ నన్ను నోటితో పిలిస్తే నాకు వినపడదు – మధ్యలో దూరం ఉంది కాబట్టి. ఆలోచన ద్వారా నన్ను తలచినా నేను థాట్‌లెస్ (శూన్యభావం) కాబట్టి నాకు వినపడదు. కాని అభ్యాసి తన హృదయంతో పిలిస్తే నాకు వినబడుతుంది. ఎందుకంటే, అభ్యాసీ హృదయమే నాది కాబట్టి" అని.**

"మాలోని 'అహం' వలన మాకు చాలా ఇబ్బంది, అశాంతి కలుగుతుంది అని ప్రజలు అంటారు" కాని నిజానికి (వాస్తవానికి) 'ఐ' కి 'యు' కు సంబంధం ఉంది. 'ఐ' అనగా 'నేను' మరియు 'యు' అనగా ఈశ్వరుడు. ఈ ఇద్దరు కూడా విడిపోవడమనే ప్రశ్నే లేదు. 'ఐ' కి ఏమీ అంటకుండా ఉన్నట్లయితే అది వాస్తవమైన, సత్యమైన 'ఐ' కాబట్టి, అది ఈశ్వరుని స్మరిస్తుంది. కాని నేను ఆ పని చేసాను, నేను ఈ పని చేసాను, అనే భావన ఎప్పుడైతే మనలో కలుగుతుందో అప్పుడు 'ఐ' కి తత్వం (వ్యక్తిత్వ భావం) అనేది కలుపబడుతుంది. ఈ వ్యక్తిత్వ భావం (అహం) వలన ఈశ్వరునితో 'ఐ' కి సంబంధం తెగిపోతుంది. 'ఐ' నందు అహం అనేది లేదు. కాని వ్యక్తిత్వభావం (అహం) ఏర్పడడంవలన, 'ఐ' అనేది దైవం నుండి వెనుతిరిగి, అధఃపతనం అవుతూ వచ్చింది. కాని సహజమార్గ సాధనవలన మరల మనం పూర్వపు స్థితికి వస్తాం. మరల దైవాన్ని స్మరించుకొంటాం. "లేదు లేదు! నేను ఇప్పుడు మీ వాడినే. ఇంతకు పూర్వం కూడా మీ వాడినే. అందుకే మీ వద్దకు వచ్చాను" అని వేడుకుంటాం. దీనివలన మనకు దైవం నుండి శక్తి లభిస్తుంది. "బాబూజీ! మేము మీ నుండి విడిపోలేదు మీరు మా వారు" అని అంటాము. బాబూజీతో ఒక కనెక్షన్ (సంబంధం) ఏర్పడి మనం సాధన చేస్తాం. కాని మన సాధన వల్లనే మనం ఉన్నత స్థితికి చేరుకోలేము. 'వారి' శక్తి మనలను లక్ష్యం వరకు లాక్కొని వెళ్ళుతుంది. ఆ కనెక్షన్ తమ కోసం ఎవరో నిరీక్షిస్తున్నట్లుగా ఉన్నారనిపించి, దృష్టి మనవంక సారించి 'వారు' మనల్ని తనవైపుకు లాక్కొంటారు.

**బాబూజీ హమారాహై (బాబూజీ మనవారు)** దీని అర్థం ఏమిటంటే, మనం బాబూజీతో ఒక సంబంధం (కనెక్షన్) ఏర్పరచుకున్నాము. 'మీరు నా వారు' కాబట్టి మీరు తప్పకుండా నావైపు చూస్తారు. మనం ఎవరినైనా జ్ఞాపకం చేసుకుంటున్నప్పుడు మన దృష్టి వారివైపు మరలుతుంది. "బాబూజీ! నేను మీ వాడిని" అని ఎప్పుడైతే మనం 'మనల్ని' 'వారి'కి అర్పిస్తామో అప్పుడే సహజమార్గం యొక్క నిజమైన సాధన ప్రారంభమవుతుంది. "బాబూజీ! నేను మీ వాడిని, మీరు నా వారు" అని ఆలోచన ద్వారా సాధన ప్రయత్నిస్తాము. తరువాత హృదయంలో ఆ భావన ఏర్పడడానికి కృషి చేయాలి.

"దైవం అంతటా ఉన్నాడు, సర్వవ్యాపియై ఉన్నాడు" అని మాటల్లో అంటాము కాని మనం ఆ దైవం యొక్క ఉనికిని అనుభూతి చెందం. అంతటా వ్యాపించి ఉన్న ఆ దైవం మనవాడే అనే భావన కూడా మనం మన హృదయంలో అనుభూతి చెందడం లేదు. కాని సహజమార్గ సాధన యందు ఎప్పుడైతే మనం ఈ విధంగా "బాబూజీ నా వారు, నేను వారికి చెందిన వాడిని" అనుకుంటూ సాధన చేస్తామో, కొంత పురోగతి పొందిన తరువాత, మనకు ఏ విధంగా అనిపిస్తుందంటే, "నీవు నా వాడివి" అని బాబూజీ మనతో అంటున్నట్లుగా అన్ని వైపుల నుండి ఆ పిలుపు వినిపిస్తుంది. ఇంకా ముందుకు వెళ్ళిన కొలదీ మరింత గొప్పగా ఉంటుంది. మనకు సామీప్యతానుభూతి కలుగుతుంది.

ప్రసాదం ఎలా చేస్తారు? అది తినడం ఎందుకు? ప్రసాదం కొరకు మీరు ఏదైతే తయారు చేసారో, దానిని మొదట శ్రీ బాబూజీ గారికి నివేదన చేయాలి, దానిని 'వారి' దివ్య శక్తితో ఛార్జ్ చేయమని ప్రార్థించాలి. అప్పుడు అది స్వీటు కాదు. దివ్య ప్రసాదం అవుతుంది. మనం ఈ ప్రసాదాన్ని తిన్నప్పుడు ఈశ్వరీయ-ధార యొక్క ప్రవాహం అనుభూతి చెందుతాం. మనం ఈ ఈశ్వరీయ ప్రసాదంతో పురోగతిని చెందుతాము. ఆ దివ్యశక్తి మనల్ని పోషిస్తుంది.

**ప్రశ్న: బెహెన్‌జీ! పరమాత్మ అంటే ఏమిటి?**

**జవాబు:** పరమాత్మ యందు తత్వం ఉంది. అది పరమాత్మ తత్వం. ఈశ్వరుడు తత్వం కలవాడు కాడు. ఎప్పటివరకు మనలో ఆత్మ ఉంటుందో అప్పటివరకు ఆత్మతత్వం ఉంటుంది. ఆత్మతత్వం అనేది అహానికి కారణమవుతుంది. ఎప్పుడు ఆత్మ పరమాత్మలో కలిసిపోతుందో అపుడు తత్వం తత్వంలో లీనమైపోతుంది. బాబూజీ చెప్పారు – ఆత్మ అనేది ఈశ్వరుని నుంచి ప్రవేశించదు. ముందు మైండ్ రీజియన్ ఉంటుంది. ఆత్మ మైండ్ రీజియన్ నుంచి ఎక్కడ ప్రవేశిస్తుందో అక్కడే అతడు ఉన్నాడు. పిల్లవాడు ఇల్లు చేరగానే చెంగున దూకుతాడు. మనం ఆపలేం. అదే విధంగా అభ్యాసి హృదయంలో ముందుకు దూకుతాడని వెనక్కు తగ్గకూడదు అని భావం.

ధ్యానంలో మనం "ఈశ్వరుడు మన హృదయంలోనే ఉన్నాడు" అనే ఆలోచన కలిగి ఉంటాము. ఇదే నిజమైన ఆలోచన. ఎప్పుడైతే మనలో అహం అనేది వృద్ధి అవుతుందో, అప్పుడు మన ఆలోచనలలో ఈ అహం అనేది నిండిపోతుంది.

ఇద్దరు మిత్రులు ఉన్నారు అని అనుకుందాం. కాని ఏదో కారణం వలన వాళ్ళిద్దరు కూడా విడిపోతారు. సహజమార్గ సాధన ద్వారా మరల వాళ్ళిద్దరి మధ్యన స్నేహం ఏర్పడడానికి పాటుపడవచ్చు. 'ఐ' అనేది 'యు'

(ఈశ్వరుని)తో గల స్నేహాన్ని మరచిపోయి, ఈశ్వరుని విడిచిపెట్టి దూరమైపోయింది. కాని ఈశ్వరుడు (యు) 'ఐ' కోసం నిరీక్షిస్తున్నాడు. "దైవాన్ని స్మరించు" అని సహజమార్గ సాధన చెప్తుతుంది. దీనికి ప్రాణాహుతి శక్తి యొక్క అవసరం ఉంది. అప్పటి నుండి మరల 'ఐ' కి 'యు' కు మధ్యన పూర్వపు స్నేహం తిరిగి ఏర్పడింది. అలాగే దైవానికి దూరమైన మనం స్మరణ ద్వారా మళ్ళీ దైవాన్ని చేరవచ్చు. అందుకు ప్రాణాహుతి అవసరం.

సహజమార్గ్ ఎటువంటి విధానం అంటే దానికి శక్తి యొక్క ప్రవాహం ఉంది. ఆ శక్తి 'వారి' నుండి ఒక సహజమైన ప్రవాహంగా ప్రవహిస్తోంది. ఆ సహజధార అనునది ఈ సృష్టిని పరిపాలించేదిగాను, ప్రాణులు మళ్ళీ దాని ద్వారా దైవాన్ని పొందేదిగానూ ఉంటుంది.

ప్రవాహపు నీరు దుమికినపుడు ఫోర్సు (శక్తి) ఎలా ఉంటుందో ఆ ప్రవాహంలో కూడా శక్తి అలానే ఉంటుంది. మానవుడు పైకి వెళ్ళినపుడు మైండ్ రీజియన్ దాటిన తర్వాత సృష్టికి పైన లాగుతూ ఉండేటటువంటి 'ఆరా' (Aura) లోని ఆ శక్తి అతడ్ని పైకి లాగుతుంది అని బాబూజీ చెప్పారు. ఇందుకు ఒక ప్రిసెప్టర్ యొక్క అవసరంగాని, అభ్యసింపజేసేవారి యొక్క అవసరంకాని లేకుండానే అతనే స్వయంగా శక్తిని స్వీకరించగలుగుతాడు. ఇనీషియేషన్ అనేది ఇక్కడ ఉంది. అది మంత్రం చెప్పి ఒకరిచేత చదివించటం వంటిది. అది భగవంతునితో కనెక్షన్ కలిగించటం అవుతుంది. మానవుని లక్ష్యం ఈశ్వరునితో సంబంధం పొందటం. అందుకని ఆ సంబంధం కల్పించబడుతుంది. కాని అల్టిమేట్ (అంతిమం) ఏదైతే ఉందో దాని పరిశోధన జరగలేదు. ఇనీషియేషన్ అనగా ఇన్నర్ కనెక్షన్. ఆ కనెక్షన్ కలిగించిన తరువాత దానికదే కొనసాగుతుంది. కరెంట్ విషయంలో మెయిన్ స్విచ్ వేస్తేనే మిగిలిన స్విచ్‌ల యొక్క పనితనం ఉంటుంది. మెయిన్ స్విచ్ నుంచి సరఫరా కాకపోతే మరే స్విచ్ నుంచి సరఫరా కాదు. కనుక ఎవరి ద్వారా వచ్చినా ఆ శక్తి మూలశక్తి లేదా మూలాధారం నుంచి రావలసిందే.

ప్రిసెప్టర్ అభ్యాసిని ప్రేమతో చూడాలి. అతని ఉన్నతి కొరకు కృషి చేయాలి. ప్రిసెప్టర్లందరికీ కుర్చీలు ఏర్పాటు చేయటమనేది అంత మంచిపని కాదు. దానివలన ఆధిక్యత అనే భావం పెరిగిపోతుంది. బాబూజీ అటువంటి అంతరాన్ని పాటించలేదు. పైగా ఏమి చెప్పారంటే నేను మానవమాత్రులకు (సబ్‌మిషన్) అణుకువగా ఉండడానికి వచ్చాను. అలా ఉంటేనే అభ్యాసులు కూడా దానిని అలవర్చుకుంటారు అని బాబూజీ చెప్పారు. 'వారు' బోధించినవి తెలుసుకుంటే అభ్యాసి కూడా మంచిగా తయారవుతాడు. 'వారు' ప్రతిదీ చేసి చూపించారు. బాబూజీ రెయ్‌జాదాతో చెప్పారు, "నా మీద విశ్వాసం ఉంచు. తర్వాత సహజమార్గం గురించి తెలుస్తుంది. సహజమార్గ సిస్టమ్ అనుభూతి, అనుభవం పొందిన తర్వాత శక్తి ఎక్కడ నుండి వస్తుందో, ట్రాన్స్‌మిషన్ ఏమిటో తెలుస్తుంది. అపుడు విశ్వాసం, నమ్మకం కలుగుతాయి" అని.

సాల్వేషన్ (మోక్షం) అంటే బాడీ కాన్షస్ (శారీరపు ఎరుక) తొలగిపోవడం. ఇది లిబరేషన్ (ముక్తి)కి మొదటి దశ. ఆ తరువాత ముక్తి (లిబరేషన్). ముక్తి అనగా (ఫ్రీడం ఫ్రమ్ ఫ్రీడం) ఆత్మ స్వాతంత్ర్యం.

ఎవరికైతే సహజమార్గ్ విధానం నందు పూర్తి విశ్వాసం ఉండి, బాబూజీగారి మీద ప్రేమ ఉంటుందో, ఆ అభ్యాసి తన దేహాన్ని విడిచిపెట్టిన తరువాత మరల ఈ ప్రపంచంలోనికి రాదు. అనగా పునర్జన్మ రాహిత్యం (ఫ్రీడం ఫ్రమ్ రీబర్త్) అనే చిన్న బహుమానం నిజమైన ఆ అభ్యాసులందరికి వరంగా ఇచ్చారు. సహజమార్గ

సిస్టమ్ మీద సంపూర్ణ విశ్వాసం ఉన్న వారికి ఈ శరీరం విడిచిపెట్టిన తరువాత పునర్జన్మ ఉండదు, అంటూ **వారి** ప్రేమను ప్రకటించారు. ఎప్పుడైతే, ఆత్మ అనునది పరమాత్మ నందు విలీనమవుతుందో అప్పుడు ఆత్మస్వాతంత్ర్యం, దాని ద్వారా ఆనందం లభిస్తాయి.

**అభ్యాసీ: బాబూజీ! నాకు ధ్యానంలో డివైన్ లైట్ యొక్క ఆలోచన రావడంలేదు, అది కనబడ్డం లేదు.**

**బాబూజీ:** అలా అనుకోవద్దు.

అప్పుడప్పుడు మనకు ఏ విధంగా అనిపిస్తుందంటే మనం త్వరగా షాజహాన్‌పూర్‌కు వెళ్ళాలి అని అనుకొంటాము. కాని మరల వెంటనే ఒక్కసారిగా, షాజహాన్‌పూర్ వద్దు, ఇక్కడే కూర్చొని బాబూజీని ధ్యానించుదాం అని అనిపిస్తుంది. ఈ విషయం మాకేమీ అర్థం కావడంలేదు అని అడిగినపుడు బాబూజీ ఈ విధంగా అన్నారు. "హృదయంలో డివైన్ లైట్ ఉంది అనే ఒక సత్యం నేను మీకు ఇచ్చాను. డివైన్ లైట్ ఉంది కాబట్టి, దైవం అందులో ఉంది. నీవు ఆ లైట్‌ను తెరచి, దైవం నా లోపల ఎక్కడ ఉంది? ఎలా ఉంటాడు? ఎప్పుడు లభిస్తాడు? అని నీవు ఆ లైట్‌లో వెదకు. లైట్ వెలుగుతూనే ఉంది" అని బాబూజీగారు అన్నారు. కాని లైట్ లేదని అభ్యాసీ అంటున్నాడు. షాజహాన్‌పూర్‌కు వెళ్ళాలనే కోరిక ప్రారంభంలో ఉన్నంతగా ఇప్పుడు లేదని అభ్యాసీ అన్నప్పుడు, 'వారు' ఈ విధంగా అన్నారు. "నీకు షాజహాన్‌పూర్ సరిహద్దులు గాని, లక్నో సరిహద్దులుగాని లేదా విశ్వాంతరాళానికి గాని, ప్రపంచానికి గాని సరిహద్దులు వేరుగా కనబడుతున్నాయా? విశాల దృష్టితో చూడు. హృదయానికి సరిహద్దులు అనేవి లేవు. ఈశ్వరుడు నీ హృదయంలోనే ఉన్నాడు అనే సత్యాన్ని ఒప్పుకోవడానికి నీకు కష్టం ఏమి ఉంది? ఏదైతే అది; ఆ ప్రాణాహుతి శక్తి వస్తుంటే దానిని ఎందుకు చూడవు? ఏది కనిపిస్తుంటే దానిని చూడు" అని అన్నారు.

**ప్రశ్న: ఇంతకు పూర్వం – మతం ఎక్కడ సమాప్తమవుతుందో అక్కడ ఆధ్యాత్మికత ఆరంభమవుతుందని, ఆధ్యాత్మికత ఎక్కడ అంతమవుతుందో అక్కడ రియాలిటీ అనగా వాస్తవికత ప్రారంభమవుతుందని, వాస్తవికత ముగిసిన చోట పరమానందం ప్రారంభమవుతుందని వివరించారు. అది మారుతున్నప్పుడు అభ్యాసిలో కలిగే స్థితులు ఏమిటి?**

**జవాబు:** శారీరక (భౌతిక) స్పృహ తొలగిపోయినప్పుడు మతం అనే భావం సమాప్తమవుతుంది. సూక్ష్మ శరీరం అంతరించినప్పుడు ఆధ్యాత్మికత అంతమవుతుంది. సహజమార్గ విధానంపట్ల మనకు ఉన్న విధేయత, బాబూజీపట్ల మనకు గల ప్రేమను పురస్కరించుకుని, ముక్తిమార్గంలో దిగువ స్థాయికి చెందిన పునర్జన్మ రాహిత్యాన్ని బాబూజీ మనకు అనుగ్రహిస్తారు. అక్కడి నుండి అభ్యాసి ముందుకు సాగిపోతాడు. కనుక పునర్జన్మ రాహిత్యానికి అభ్యాసి బాబూజీ యందు విశ్వాసం, ప్రేమ పెంపొందించుకోగలగాలి.

ఏ ప్రిసెప్టర్ నుండి మనం సిట్టింగ్ తీసుకున్నప్పటికీ బాబూజీ హృదయం నుండి ట్రాన్స్‌మిషన్ – ప్రాణాహుతి శక్తి వస్తూందని మనం భావించాలి. ఇలా భావించినపుడు సిట్టింగ్ ఏ ప్రిసెప్టర్ ఇచ్చినా తేడా అనేది ఉండదు. బాబూజీ మహరాజ్ ఇక్కడే ఉన్నారు. మన ఎదురుగానే ఉన్నారు. 'వారే' ప్రాణాహుతిని ఇస్తున్నారు. ఎందుచేతనంటే, వ్యక్తి ఒక ప్రిసెప్టర్ కాలేదు. ఆ వ్యక్తి ద్వారా పనిచేసే శక్తియే ప్రిసెప్టర్. కాబట్టి ఆ శక్తి బాబూజీది. బాబూజీ మహరాజ్ వద్ద నుండియే వస్తూంది. ఆ శక్తికి మాస్టర్ బాబూజీయే. నీ ముందు

ఏ వ్యక్తి ప్రిసెప్టర్‌గా ఉన్నా, నీవు బాబూజీ మహరాజ్ నుండే సిట్టింగ్ తీసుకుంటున్నావన్నమాట! అక్కడ ప్రిసెప్టర్ ఎవరూ లేకపోతే "నేనే ఆ పని కూడా చేసేస్తాను" అని బాబూజీ అన్నారు.

మీరు ఏ ప్రిసెప్టర్ వద్దకు లేదా ఎక్కడకు వెళ్ళినా, మీరు ధ్యానానికి కూర్చున్నప్పుడు బాబూజీ మహరాజ్ నుండే ట్రాన్స్‌మిషన్ తీసుకుంటున్నారు– పొందుతున్నారు. బాబూజీ అంతటా ఉన్నారు. ఈ ట్రాన్స్‌మిషన్‌కు మూలం (సోర్సు) ఆ బాబూజీ మహాత్ములే. కాబట్టి యదార్థంగా ప్రతి యొక్క ప్రిసెప్టర్‌కూ మరియూ 'వారి' ప్రతినిధికీ (రిప్రజెంటేటివ్ కూడా) లభించే ఈ ప్రాణాహుతి బాబూజీ మహరాజ్ నుండియే వస్తూంది.

ఎప్పుడైతే బాబూజీ మహరాజ్ ఈ భూమిపై అవతరించారో అప్పుడే ప్రాణాహుతి కూడా 'వారి'తో పాటే వచ్చింది. ఈ ప్రాణాహుతి యొక్క మూలస్థానం (సోర్స్) **వారే** అని దీని అర్థం. బాబూజీ అవతరించడానికి ముందు ఈ ప్రాణాహుతి లేదు. ఎవరూ ప్రాణాహుతిని ఇవ్వలేదు. కాబట్టి ఈ దివ్య ప్రాణాహుతి శక్తిని ప్రసారం చేయడానికే 'వారు' ఈ భూమిపై అవతరించారని దీనితో మనకు తెలుస్తోంది. ఇలా ప్రాణుహుతి ప్రసారం జరగడం మొదలైంది. **వారే** దానికి మూలాధారం. వ్యక్తి అయితే అతడు మారి, మరొకరు రావచ్చు. శక్తిమూలం (సోర్స్) ఒక్కటే. దానిని – ఆ సోర్స్‌ను – ఆ శక్తి మూలాన్ని మార్చడానికి వీలు లేదు.

**ప్రశ్న: 'అనంత యాత్ర' లో చాలా పాయింట్లు అనగా A, B వగైరా వ్రాశారు. ఒక పాయింట్ నుంచి మరొక పాయింట్‌కు ప్రోగ్రెస్ అవుతున్నట్లు ఎలా తెలుస్తుంది?**

**జవాబు:** A నుండి B కి వెళ్ళే స్థాయిలో ఫోర్స్ (ఒత్తిడి) సూక్ష్మంగా ఉంటుంది. అక్కడ అది ముగిసి మళ్ళీ కొంచెం తక్కువ స్థాయిలో అక్కడ నుంచి ప్రారంభమవుతుంది. అనగా భారమైన స్థితి నుంచి (గ్రాస్‌నెస్, స్థూలత్వం) మరికొంత సూక్ష్మంగా ఉంటుంది. అనగా పాయింట్ నుంచి పాయింట్‌కు జరిగే నడకలో (గ్రాస్‌నెస్) స్థూలత్వం తగ్గుతూ సూక్ష్మత్వం పెరుగుతూ ఉంటుంది. ఇలా పాయింట్ నుంచి పాయింట్‌కు సూక్ష్మాతి సూక్ష్మమైన స్థితి కలుగుతూ ఉంటుంది. Z పాయింట్ చేరేసరికి అతి సూక్ష్మమై, ఫోర్స్ తగ్గిపోతుంది. ఇట్లా తేలికయ్యే స్థితులలోని మార్పును గమనించటం ద్వారానే A, B, C, D బిందువుల మధ్య దూరాన్ని అంచనా వేయగలుగుతాం. ఆ మార్పులే గమనాన్ని సూచిస్తాయి. ఈ స్థూలమైన స్థితి నుంచి అత్యంత తేలికగా కాగలిగితేనే దివ్య సాగరంలో లయం కాగలుగుతాం. భారీగా ఉన్నట్లయితే అందులో మునగలేము. ఆ దివ్య సాగరంలోకి దిగి, దివ్యత్వం అనే నీటిని ఎంత త్రాగుతున్నప్పటికీ ఇంకా కావాలి, ఇంకా కావాలి అనిపిస్తుంది. అనగా తనివితీరక ప్రాణాహుతి ఇంకా ఇంకా ఇవ్వమని వేడుకుంటున్న స్థితి కలుగుతుంది.

**ప్రశ్న: మా తండ్రిగారికి డాక్టర్ పార్థసారథిగారు మాంసాహారం విడిచిపెట్టమని సలహా ఇచ్చారు. అది ఎంతవరకు అవుసరం?**

**జవాబు:** నీ దృష్టి మాంసాహారం మీద ఉంది. నీ దృష్టి దానిమీద ఉన్నంతవరకు నీలో దయ ఉండదు. అది అధికమైన కొద్దీ దయ ఇంకా తగ్గిపోతూ ఉంటుంది. బాబూజీ మహరాజ్ అన్నారు – మనకు శాకాహారంతో పని జరిగిపోతున్నప్పుడు మాంసాహారంతో పని ఏముంది – అని. ఒకవేళ డాక్టర్ ఎవరికైనా ప్రత్యేకంగా సలహా ఇస్తే అది తప్పనిసరి కావచ్చు. ఒక్కొక్కచోట పప్పుధాన్యాలు దొరక్కపోవచ్చు. అక్కడ దాని అవసరం ఉండవచ్చు. కాని మనకు ఇక్కడ అవసరం లేదు. సహజమార్గంలో వదిలిపెట్టవలసిదంటూ ఏదీ లేదు. రుచికి

అంతం లేదు. కుటుంబ విషయాలను కూడా ఆలోచించుకొని ప్రవర్తించాలి. పిల్లలకు కూడా దాని రుచి చూపించకూడదు. కుటుంబ శాంతి గురించి ఆలోచించాలి. రుచిని గురించి మన ధ్యాస అలా ఉంటే, ప్రజలు మన సంస్థను ఎలా విశ్వసిస్తారు? అందుచేత జాగ్రత్తగా ఆలోచించాలి. రుచి అనేది ప్రతి దానిలోను ఉంటుంది. దానినే దృష్టిలో పెట్టుకుంటే హాని కలుగుతుంది. నీ ఆలోచనలు 'వారి' తో కలుపు. 'వారు' నీతో ఉన్నారు. నీ రుచిని మార్చుకో. సాధ్యమైనంతవరకు మాంసాహారం మీద వ్యామోహాన్ని వదిలివేయాలి.

బాబూజీ సిగరెట్ మానివేయమన్నారు. దానివలన అల్సర్ వచ్చే ప్రమాదం ఉంది. అయినా మానరు. అది కూడా రుచే కొంతమందికి. అలాగే కొంతమందికి కోపం కూడా రుచి అనగా అలవాటు. బాబూజీ, కోపంలో మజా వస్తుందని వ్రాశారు. అనేక రకాలుగా రుచులు, అభిరుచులు ఉంటాయి. వాటివలన కండిషన్ అనగా స్థితిలో ఆటంకం కలుగుతుంది. రెండు, మూడు రోజులు దానివలన ఇబ్బందికి గురవుతారు. అందుకని మీమీదే కోపం తెచ్చుకోండి. మనస్సులో కష్టమనుకుంటే ప్రతిదీ కష్టమే. అందుకని వివేకంతో ఆలోచించాలి.

బాబూజీ మహరాజ్ గొప్పదనం గురించి చెప్తాను. ఒకసారి నేను కాన్ఫరెన్స్‌లో పాల్గొనటానికి ఫ్రాన్స్ వెళ్ళే సందర్భంలో "అక్కడ చాలామంది వ్యక్తిగత సిట్టింగులు ఇవ్వమని కోరతారు. ఎలా ఇవ్వగలవు?" అని అడిగారు బాబూజీ. "అందరికి వ్యక్తిగతంగా సిట్టింగులు ఇవ్వడానికే ప్రయత్నిస్తాను" అన్నాను. అపుడు **వారు**, "నీకు నా ఆశీస్సులు. నీవు లక్షలకొలది, మిలియన్ల కొలది మనుషులను ఒకేచోట కూర్చోబెట్టి సిట్టింగ్ ఇచ్చినా, వారందరికి ఇండివిడ్యుయల్ సిట్టింగ్ లభిస్తుంది" అని అన్నారు. అది 'వారి' కృపా కటాక్షం.

**ప్రశ్న: బెహెన్‌జీ! ట్రాన్స్‌మిషన్ వస్తున్నట్లు అనుభూతి ఎలా చెందుతాము?**

**జవాబు:** మనం ఉష్ణోగ్రతను ఎలా గుర్తిస్తున్నాము – వేడిగా ఉందనో, చల్లగా ఉందనో గ్రహించగలుగుతున్నాం. మనలోపల హృదయంలో కొన్ని కదలికలు వ్యాపిస్తూ, మార్పు చెందుతూ ఒక విధమైన శాంతి అనుభవమవుతుంది. ఒక్కొక్కసారి ఉన్నట్లుండి ఆనందం కలుగుతుంది. లోనికి (అంతరంగంలోనికి) దృష్టి నిలిపితే ఇది ఎవ్వరికైనా తెలుస్తుంది. సువాసన, దుర్వాసనలు ఎవ్వరైనా గుర్తించగలుగుతున్నారు కదా! బాబూజీ యందు మనసు నిలిపి అంతరంగంలోకి చూస్తే అక్కడ జరిగే మార్పులు అనుభూతి చెందుతారు. అలా కాకుండా మీ దృష్టి బాహ్యం మీద ఉంటే ప్రాపంచికమైనవి అనుభవానికి వస్తాయి. ట్రాన్స్‌మిషన్ సమయంలో ఒక్కొక్కసారి తేలికదనం, సంతోషం, కళ్ళు తెరవనీయని పరిస్థితి కలుగుతూ ఉంటాయి.

మీరు అయిష్టతకు, ద్వేషానికి దూరంగా ఉండాలంటే ప్రేమించటం అలవరచుకోవాలి. మంచితనం పెంచుకోవాలనుకుంటే చెడును తెలుసుకోవటం మానాలి. మనస్సు లేదా హృదయంలో ఆనందం అనుభవం కావాలంటే దుష్ప్రభావం కలిగించే విషయాలను దరిచేరనివ్వకండి. ప్రతి దానిలోను రెండు రకాలు ఉంటాయి. ఒక దానిని విస్మరిస్తే రెండవది స్థిరంగా ఉంటుంది.

బాబూజీ మహరాజ్‌ను ఎవరో "మీరు అందరినీ ఎలా ప్రేమిస్తారు" అని అడిగారు. అందుకు సమాధానంగా "నాలో ద్వేషం లేకుంటే ప్రేమయే నిలిచి ఉంటుంది. మంచీ చెడూ రెండు ఉంటాయి. మంచి నిలుపుకుంటే చెడు తొలగిపోతుంది. కనుక మంచినే నిలుపుకో" అని చెప్పారు బాబూజీ.

అభ్యాసీ ఒకరు, "మీరు మాలోని దోషాలను గాని, లోపాలను గాని గమనించరా!" అని బాబూజీని అడిగారు. దానికి బాబూజీ, "నేను మీ దోషాలు చూడాలంటే నా హృదయంలో ఎక్కడో దోషానికి తావుండాలి.

అప్పుడే చూడగలుగుతాను. అలాగే మీరు ఎవ్వరిలోనూ దోషాలను చూడలేకపోయి ఉంటే మీరు దోష విముక్తులనుకోవాలి. అపుడు మీలో దోషమే ఉండబోదు. ఎలా అంటే, మీరు ఇతరుల దోషాలను చూస్తున్నపుడు వాటిని పసిగట్టే శక్తి లోపల ఉంటుంది. కాని వాటిమీద దృష్టి నిలపకపోతే మనసులో నిలవకుండా తొలగిపోతాయి. దోషాలెంచే అలవాటు ఎప్పుడైతే విస్మరిస్తారో అప్పుడింక మీలో దోషం లేనట్లే. కనుక దోషాలెంచటమే దోషం" అని వివరించారు.

బాబూజీ మహరాజ్ చెప్పినట్లుగా వాటిలో ఏది మంచిదో దానిని గ్రహించి మనం ఔన్నత్యం పొందాలి. దీనిలో ముందుగా అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, మన జీవన విధానంలో ఆ మంచిని ఆచరించాలి. దోషాలను, చెడును చూసే అలవాటును సాధ్యమైనంతవరకు విడనాడాలి. ప్రిసెప్టర్లుగా ఆ ధోరణి విడనాడి, కృషిచేసి, అభ్యాసులను ఎలా ఉద్ధరించాలి అని అలోచించాలి. మీలో దోషాలు ఎంచే అలవాటు లేకపోతే మిగిలేది మంచి మాత్రమే. ఏవైనా లోటుపాట్లు ఉంటే తెలియచెప్పండి, లేకపోతే లేదు. దోషాలనే వెదికే దృష్టి విడనాడకపోతే అందరిలోనూ దోషాలే కనిపిస్తాయి. నిత్యజీవితంలో, మీరు మీ బిడ్డల విషయంలో ఏవైనా లోపాలు గమనిస్తే వారి చెడు మాత్రమే కనిపిస్తుంది కాని మంచి కనపడదు. ఇలా చెడునే చూస్తూ చూస్తూ పోతే ఆఖరికి మీలో ఆ చెడు మాత్రమే తిష్ట వేస్తుంది. ఆ చెడును చూసే అలవాటు ఎంతసేపూ ఆ చెడునే వెదుకుతూ ఉంటుంది. ఈ స్వభావం వలన మీలోనూ చెడు ఉన్నట్లే లెక్క. అందుచేత అటువంటి అలవాటును వదిలేసి సాధ్యమైనంతవరకు సహనం వహించాలి, క్షమత్వాన్ని అలవరచుకోవాలి. అందుకు బాబూజీ యొక్క శక్తి మనలో ఉందనుకోవాలి. బాబూజీ యొక్క బోధల్ని మన జీవన విధానంలో అలవరచుకొని, బాబూజీ చూపిన విధంగా ఒక సాధు జీవనాన్ని ఈ ప్రపంచంలో మానవుడుగా జీవిస్తూనే ఎలా గడపవచ్చో నిరూపించాలి.

మనం, సహజమార్గ సిస్టమ్ అనేది పూర్తిగా ఆధ్యాత్మిక మార్గం అని నిర్వచనం చేస్తున్నప్పుడు ఈ మార్గంలోని వారందరూ మంచివారేనని ప్రజలు అభిప్రాయపడతారు. తమలో ఉన్న లొసుగులు మనలో ఉండవన్న నమ్మకంతో ఉంటారు. మనలో తప్పులు కనపడితే ముక్కు మీద వేలేసుకుంటారు. మనలో ఏ లోపాలు లేనపుడు, మన సిస్టమ్ మంచిదని భావించి దానిని అనుసరించాలనుకుంటారు. కనుక ఎవ్వరూ మనల్ని తప్పుపట్టటానికి వీలులేని విధంగా మన జీవితాన్ని పవిత్రంగా మలచుకోవాలి.

ఈశ్వరసహాయ్‌గారు బసంత్ పంచమి ఉత్సవ సమయంలో బాబూజీని "బాబూజీ! మీరు పై కేంద్రాల నుండి విలువైన శక్తి కటాక్షం వర్షిస్తూ ఉంటుందని అంటున్నారు. కాని అందరి సామర్థ్యం ఒకే విధంగా ఉ ండదు. అటువంటప్పుడు విలువైన కృపాశక్తి (గ్రేస్) ప్రవహిస్తోండగా సామర్థ్యం లేనివారికి దక్కే ఫలమేమిటి? వారు దానిని తీసుకోలేరు కదా!" అని ప్రశ్నించారు.

బాబూజీ ఆ ప్రశ్నకు అందంగా జవాబు ఇస్తూ, "కృపను (గ్రేస్) వర్షింపజేసేప్పుడు నేను సామర్థ్యం గురించి ఆలోచించను. ఎవరి శక్త్యానుసారం వారు తమ తమ వంతును (Atmosphere) వాతావరణం నుంచి గ్రహించగలుగుతారు. సామర్థ్యం లేనివారికి వారి వారి వంతు వాతావరణంలో వలయాకారంలో వారిపైన ఏర్పడి ఉంటుంది. వారు తమ శ్వాస ద్వారా దానిని క్రమంగా స్వీకరించగలుగుతారు" అని చెప్పారు. 'వారు' మన లోపాలు ఎంచకుండా అందరినీ సమాన దృష్టితో చూడటం మనకెంత మహద్భాగ్యమో! 'వారి' ప్రేమ అందరికీ వారి వారి వంతుల వారీగా లభిస్తోందని గ్రహించాలి.

**ప్రశ్న: (గ్రేస్) దివ్య కృప, ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్) మరియు ఈశ్వరీయ ధారల్లో ఏమైనా భేదం ఉందా?**

**జవాబు:** గ్రేస్ (దివ్య కృప) కు మిగతా వాటికి భేదం ఉంది. (ట్రాన్స్‌మిషన్) ప్రాణాహుతి అన్నా, ఈశ్వరీయ ధార అన్నా ఒకటే. ఈశ్వరీయ ధార అనేది ఎవరికెంత ఇవ్వాలి, దేని నిమిత్తం ఇవ్వాలి అని 'వారి' ఇచ్ఛాశక్తిని బట్టి పరిమితంగా ఉంటుంది. కాని (గ్రేస్) దివ్యకృపకు పరిమితి లేదు. అది అపరిమితం నుంచి విడుదలవుతూ ఉంటుంది.

**ప్రశ్న: మీకూ మాకు వ్యత్యాసం ఏమిటి?**

**జవాబు:** బాబూజీ చెప్పిన దాని ప్రకారం ఏమీ వ్యత్యాసం లేదు. మీరూ కుర్చీ మీద కూర్చున్నారు. నేనూ కుర్చీ మీద కూర్చున్నాను. మీరు నా దగ్గరకు దేని కొరకు వచ్చారో అదే భేదం. బాబూజీ ఇతరులను నొప్పించే మాటలు ఏవీ మాట్లాడలేదు. పిన్నలైనా, పెద్దలైనా హృదయపూర్వకంగా మాట్లాడేవారు. భార్యతో మాట్లాడినా, పిల్లలతో మాట్లాడినా ఒకే రీతిలో అందరినీ సమాన గౌరవంతో వ్యవహరించేవారు.

మనం ఎవరైనా దివ్యమూర్తి (డివైన్ పర్సనాలిటీ) ని గురించి ఇటువంటివారు, అటువంటివారు అని అంటే వారికేమీ అనిపించదు. 'వారు' మనకంటె ఉన్నత స్థితిలో ఉన్నందువలన మన మాటలు వారిని తాకవు. వారిని భగవంతుడని గాని, మరేదైనా బాధాకరంగా అన్నప్పటికీ మన మాటలు వారిని చలింపజేయవు.

**ప్రశ్న: ట్రాన్స్‌మిషన్ కేవలం సిట్టింగ్‌లోనే వస్తుందా లేక మేము సిస్టర్‌గారి పాటలుగాని, ప్రసంగం కాని వింటున్నపుడు కూడా అనుభవమవుతుందా?**

**జవాబు:** ట్రాన్స్‌మిషన్ అంటే ఏమిటి? మీ శ్రద్ధ లేదా అవధానం. దైవంతో అనుసంధింపబడినపుడు మీకు ట్రాన్స్‌మిషన్ యొక్క అనుభూతి కలుగుతుంది. ఎందుకంటే వారివద్ద ఉన్నది అదే కనుక. ఆంతరంగికంగా ఎంత శ్రద్ధ ఉంటే అంతగా ట్రాన్స్‌మిషన్ అనుభవమవుతుంది. పాటల్లో గాని మరి దేనిలోనైనా గాని ట్రాన్స్‌మిషన్ లేదనటానికి వీల్లేదు. మీరా భజన్ వంటి వాటిల్లో కూడా ట్రాన్స్‌మిషన్ ఉంది. బాబూజీ చెప్పేవారు – ఎవరైనా ఏదైనా కండిషన్‌లో మునిగి ఉండి ఏదైనా పాటగాని, మరేదైనా గాని వ్రాయటం జరిగితే అది దివ్యశక్తితో ఛార్జి అవుతుంది. మీరు మాట్లాడే మాటలు గాని, ఉపన్యాసం గాని మీ నిమిత్తం లేకుండానే వెలువడుతాయి. వాటిపై బాబూజీ దృష్టి నిలపబడుతూ ఉంటుంది. మీ చుట్టూరా ట్రాన్స్‌మిషన్ వ్యాపించి ఉంటుంది. మీరు ఆధ్యాత్మిక స్థితిలో ఉండి ఏ పాట వ్రాయటం జరుగుతుందో దానిలో ఆ స్థితి యొక్క శక్తితో ఛార్జి అవుతుంది. ఏ విధంగానయితే ప్రార్థన దివ్యశక్తితో ఛార్జి చేయబడిందో పాటలు కూడా అదే విధంగా ఛార్జి అవుతాయి. మీరు ఆ పాటలు పాడినపుడు, విన్నపుడు అందులోని శక్తి మూలంగా అదే అనుభూతి, అదే ట్రాన్స్‌మిషన్ జారీ అవుతాయి. బాబూజీ మహరాజ్ నాకు ఈ విషయం చెప్పినట్లుగా జ్ఞాపకం ఉంది. అది ఏమిటంటే, ఎవరైనా తనకు కలిగిన ఆధ్యాత్మిక స్థితిలో మునిగి ఉండి, ఇతరులు ఎవరికైనా ట్రాన్స్‌మిషన్ ఇచ్చినట్లయితే, తాను ఉన్న స్థితి యొక్క ప్రతి ఛాయ ఆ ట్రాన్స్‌మిషన్ పొందుతున్న వారిలో కలగటం, అతడు కూడా అదే ఆనందానుభూతిని, అతడు స్వతస్సిద్ధంగా ఆ స్థితికి చేరి ఉండకపోయినప్పటికీ పొందటం జరుగుతుంది. ఇంతకీ మూలరహస్యం ఏమిటంటే, "బాబూజీ నా వారు" అనే భావన ద్వారా అందరికీ శక్తి సమకూరుతూ ఉంటుంది.

**ప్రశ్న: గాఢమైన ధ్యానంలో ఉండగా ఎప్పుడైనా ఒక్క ఉదుటున బయటకు వచ్చినపుడు హృదయంలో కుదుపు (జర్క్) వస్తుంది. ఎందుకు?**

**జవాబు:** మీరు గాఢంగా ధ్యానంలో ఉండి బయటకు రావాలని అనుకుంటారు. దానికి భంగం కలిగిందని అనుకోకుండా రోజంతా అదే స్థితిలో బాబూజీతో పాటు ఉన్నట్లుగా స్మరించుకోండి. ఆ గాఢ స్థితిలో బాబూజీ ఎదుటనే ఉన్నట్లు ఆలోచనతోను, భావంతోను గడపండి.

మీరు ఆ గాఢమైన (లోతైన) స్థితి నుండి ధ్యానం నుంచి బయటకు రావటం వలన ఆ కుదుపు ఏర్పడుతుంది. మీరు ఆ స్థితి నుండి బయటకు వస్తున్నట్లుగా సూచన వస్తే, మీరు బాబూజీతో అక్కడే ఉన్న భావన కల్పించుకోండి. ఇలా బయటకు వచ్చాక కూడా మీరు ఆ భావన కల్పించుకున్నపుడు మళ్ళీ అదే గాఢమైన స్థితిని పొందుతారు. మీరు ధ్యానంలో లోతుగా ఉన్నపుడు మీ అనుభూతి కూడా గాఢంగా ఉంటుంది. మీ కనెక్షన్ (అనుబంధం) బాబూజీతో ఉంటుంది. మీరు స్వతహాగా బయటకు రాలేరు. ఒకవేళ వచ్చినా మళ్ళీ బాబూజీతోనే, వారి చరణాల వద్దనే ఉన్నట్లు మైండ్ (మనస్సు) తో గాకుండా అనుభూతితో సంకల్పం చేసుకోవాలి.

మనం సామాన్యంగా చూస్తూ ఉంటాం– ప్రజలు మత సంబంధమైన ఆధ్యాత్మిక సమావేశాలకు, పౌరాణిక ఉపన్యాసాలకు, గీతోపన్యాసాలకు వెళ్తూ ఉంటారు. అక్కడ చెప్పినది వినటంలో కాలక్షేపం అవుతుందేమో కాని వారు ఇంటికి వచ్చాక వాటి ప్రభావం వారి మీద నిలబడదు. వారు పొందినది ఏమీ ఉండదు. మరికొందరైతే అటువంటి సమావేశాలు భారీగా నిర్వహించబడినపుడు అక్కడ అమ్మబడే ఆకర్షణీయమైన వస్తువుల మీద, తినుబండారాల మీద మోజు పడతారామో గాని ఆధ్యాత్మిక చింతన హృదయంలో గూడుకట్టుకోదు. వాటి మూలంగా వారికి ఫలితం దక్కదు.

మన సహజమార్గ సిస్టమ్‌లో ధ్యానం ఉంది. ధ్యానం అనగా ఏదో పొందదగినది. అది ఏమంటే, ధ్యానంలో బాబూజీని స్మరించటం ద్వారా దివ్యశక్తి మనలోనికి బదలాయించబడుతుంది. దానివలన మనలో దివ్యత్వం ఏర్పడుతుంది. ఈ విధంగా మనకు ప్రసారం చేయబడిన దివ్యశక్తిని మనం సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే సత్ఫలితాన్ని ఇస్తుంది. మనం మంచి కొరకు యత్నిస్తే ఆ దివ్యశక్తితో మనకు సంబంధం ఏర్పడుతుంది. అలాకాకుండా మనం దానిని ఆచరణకు యోగ్యం కాని వాటికి వినియోగించాలనుకుంటే అది మౌనందాల్చి ఫలితం ఇవ్వకుండా పోతుంది. కాని అపకారం చేయదు. కనుక సహజమార్గ విధానం మన జీవన విధానాన్ని పవిత్రంగా, సక్రమంగా తీర్చిదిద్ది సాక్షాత్కారం వైపు తీసుకు వెళ్ళుతుంది. ఒక అభ్యాసీ, బాబూజీ మహరాజ్‌ను ఏమని అడిగాడంటే – "ఒక గజ దొంగ ఉన్నాడు. అతడు ధనికుల వద్ద డబ్బు దోపిడి చేసి బీదలకు, వారి జీవితావసరాలకు, వివాహాది అవుసరాలకు తాను స్వయంగా దానం ఇస్తున్నాడు. అటువంటి వాడు శిక్షార్హుడా లేక కృపకు పాత్రుడా" అని ప్రశ్నించాడు. అపుడు బాబూజీ మహరాజ్ ఇలా అన్నారు – "అతడు గజదొంగ అని నీవే చెప్తున్నావు. అపకారం చేశాడని అంటున్నావు. ఇతరుల ధనాన్ని కొల్లగొట్టి దానం చేశాడే కాని అతని స్వంత ధనాన్ని కాదు. అతని స్వంత ధనం పది రూపాయలు ఇచ్చినా అది (దానమే) సత్కార్యమే అవుతుంది. అందుచేత అతడు శిక్షార్హుడే. అయితే అతనికి దానం చేయాలనే తపన, సహాయం చేయాలనే సద్భావం ఉన్న మూలాన అతడు మరుసటి జన్మలో గజదొంగ కాకుండా ధర్మాత్ముడౌతాడు. అది

అతడికి బహుమానం" అన్నారు.

మేము షాజహాన్‌పూర్ వెళ్ళినప్పుడు బాబూజీ కోర్టుకు వెళ్ళగానే మేము వారి గురుభాయీ అయిన రామేశ్వర ప్రసాద్‌గారి ఇంటికి వెళ్ళేవారం. వారు బాబూజీ గురించి, లాలాజీ గురించి, వారు అనుభవించిన బీద స్థితిని గురించి చెప్తూ ఉండేవారు. ఆ సందర్భంలో లాలాజీకి చలికాలంలో కప్పుకోవటానికి సరైన రగ్గు కూడా ఉండేది కాదని చెప్పారు. అపుడు అటువంటి ఆర్థిక దుస్థితిలో ఉన్న వారి కుటుంబం లాలాజీ సాహెబ్ మహా సమాధి తర్వాత ఎలా జీవనం గడిపారు అని ఈశ్వర్‌సహాయ్‌గారు అడిగారు. దానికి ఒక రహస్యం, ఇంతవరకూ ఎవ్వరికీ వెల్లడి కానిది ఉందని చెప్తూ – "నేనూ, బాబూజీ మా నెల జీతాలు తీసుకున్న తర్వాత కొంత మొత్తాన్ని తీసుకొని ఫతేఘర్ వెళ్ళి తెల్లవారు ఝామున ఒక మూటకట్టి వారింట్లోకి విసిరేసి వచ్చేవాళ్ళం. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో వారికి తెలియక లాలాజీగారి కృప అనుకునేవారు. ఈ విధంగా పది సంవత్సరాలు కొనసాగించాం. ఇది ఈనాటి వరకూ రహస్యంగానే ఉండిపోయింది" అన్నారు. వారు మహాత్ములు, వారిని చూసి మనం మన జీవితాలను ఆదర్శప్రాయంగా, సాధుజీవనంగా దిద్దుకోవాలి.

మేము తరచుగా షాజహాన్‌పూర్ వెళ్తూ ఉండేవాళ్ళం. షాజహాన్‌పూర్‌లో ఉన్నా, లఖింపూర్‌లో ఉన్నా బాబూజీ యొక్క ఉనికి ఉన్నట్లే అనుభూతి పొందేవారం. వారి ముందు కూర్చునపుడు వారి ముఖంలో చిందులాడే చిరునవ్వు సమస్త వాతావరణంలో కూడా దర్శనమౌతున్నట్లు అనిపించేది. నేను ఒకసారి లఖింపూర్‌లో ఉండగా ఏదో అస్థవ్యస్థ స్థితి కలిగి మనసులో ప్రశాంతత లోపించినట్లయ్యింది. ఈ విషయమే శ్రీ బాబూజీ మహరాజ్‌కు లేఖ వ్రాయగా 'వారు' దానికి జవాబు వ్రాస్తూ, తనకు రెండు రోజుల నుంచి ఏమీ బాగుండలేదని, నేను వ్రాసినది వాస్తవమేనని వ్రాశారు. దీన్నిబట్టి బాబూజీ వంటి దివ్యమూర్తులు ఏదైనా ఇబ్బందికి లోనయినపుడు దాని ప్రభావం విశ్వమంతటా (లేదా వాతావరణమంతా) వ్యాపిస్తుందని, వారికి సంబంధించి ఉన్న వారందరికీ కూడా దాని అనుభవం కలుగుతుందని మనం అర్థం చేసుకోవాలి.

**ప్రశ్న: ధ్యానంలో కూర్చుంటాను. కాని చాలా ఆలోచనలు వస్తున్నాయి. ధ్యానంలో కూర్చోలేకపోతున్నాను. ఏమి చేయాలి?**

**జవాబు:** బాబూజీ మహరాజ్‌గారు అనేవారు – ధ్యానంలో మొదట ఈ విధంగా అనుకోవాలి. దైవం నా హృదయంలో ఉన్నాడు. ఈశ్వరీయ ప్రకాశం వలన నా హృదయమంతా ప్రకాశిస్తున్నది. కాబట్టి మనం ధ్యానానికి కండ్లు మూసుకోగానే ఆ డివైన్‌లైట్‌లో మునిగి, దైవం కొరకు వెదకాలి. ఈశ్వరుడు ఎట్లా ఉంటాడు, ఏమిటి? అని వెదకాలి. ధ్యానంలో మనకు ఎప్పుడైనా ఈశ్వరునికి సంబంధించిన ఆలోచన కాకుండా, వేరే ఇతరమైన ఆలోచనలు వచ్చినట్లయితే, వెంటనే మనం బాబూజీ మహరాజ్ నా హృదయంలోనే ఉన్నారు. వారి ఈశ్వరీయ ప్రకాశం వలన నా హృదయమంతా ప్రకాశిస్తున్నది అనే ఆలోచనను మరల తెచ్చుకోవాలి. ఈ విధంగా కాకుండా మీరు వేరే ఆలోచనలను ఆహ్వానించినట్లయితే, ఆ ఆలోచనలు వస్తున్నాయి, ఈ ఆలోచనలు వస్తున్నాయి అని వీటిలోనే లీనమయిపోతారు. కాబట్టి వేరే ఆలోచన రాగానే, వెంటనే మీరు ఈ ఆలోచన చేయండి –బాబూజీ నాలోనే ఉన్నారు. 'వారి' కృపవలన మొత్తం హృదయమంతా కూడా ప్రకాశిస్తూ ఉన్నది. నేను 'వారి' ధ్యానంలోనే కూర్చొని ఉన్నాను. ఈ ఆలోచనను తిరిగి తిరిగి చేయడం వలన, ఇతరమైన ఆలోచనలు రావడం ఆగిపోతాయి.

**ప్రశ్న: కండిషన్ (స్థితి) ఎలా తెలుస్తుంది?**

**జవాబు:** అది మాటలలో చెప్పేది కాదు. అనుభూతి చెందినప్పుడు తెలుస్తుంది. వారి సామీప్యతానుభూతి పొందుతాము. అప్పుడు 'I' ness minus అవుతుంది. కండిషన్ (స్థితి) మారుతుంది. ఆ మార్పు కూడా మనం అనుభవం చెందుతాం. మొదట అభ్యాసీ బాబూజీని (remember) గుర్తుకు తెచ్చుకుంటాడు. వారి స్మరణలో ఉంటాడు. కండిషన్ మారినప్పుడు బాబూజీ మనలను గుర్తుచేసుకుంటారన్న భావన కలుగుతుంది. వారిమీద ప్రేమ, భక్తి ఇంకా ఎక్కువ అవుతాయి.

ధ్యానంలో కూర్చుంటే మొదట అభ్యాసీ తాను ఆనందంగా ఉన్నట్లు ఫీల్ అవుతాడు. కండిషన్ (స్థితి), ఫీలింగ్ (అనుభూతి) అనేవి మాటల కందనివి.

కండిషన్ మారిన తరువాత బాబూజీ మహరాజ్ చాలా ఆనందంగా ఉన్నారని తను ఫీల్ అవుతాడు. ఆ ఫీలింగ్‌లో ఆ స్థితి ఏమిటో తెలుస్తుంది. అంతేకాని నోటితో చెప్పలేడు. కండిషన్ చాలా బాగుంది అని అంటాడు. అంతకన్న ఎక్కువ చెప్పలేడు. అనుభవిస్తేనే కాని అది ఏమిటో తెలియదు. ఎవరికి వారే అనుభూతి చెందాలి. అప్పుడు బాబూజీ మహరాజ్ మన దగ్గర ఉన్నారు, 'వారు' మనకు చాలా ప్రియమైన వారని అనిపిస్తుంది.

నేను ధ్యానంలో కలిగిన అనుభూతిని రాత్రి నిద్రలో ఫీల్ అయ్యేదానిని. నిద్రలో కూడా ఫీల్ అవుతున్నానని బాబూజీతో అంటే "మైండ్ నిద్రపోతుంది కాని హృదయం మేల్కొని ఉంటుంది. అందువలన ఆ అనుభూతి కలుగుతుంది" అని చెప్పారు. ప్రాపంచిక విషయాలను గుర్తుపెట్టుకోవటానికి మైండ్ (Brain), ఆధ్యాత్మికతను గుర్తుపెట్టుకోవటానికి హృదయం (Heart) ఉంది. ఈశ్వరుడు హృదయాంతరాళంలో ఉంటే నీవు మెదడు (Brain) తో ఆలోచిస్తే ఎలా తెలుస్తుంది.

స్థూలంతో కూడిన భౌతిక ప్రపంచాన్ని చూడటానికి కళ్ళు పని చేస్తాయి, కాని అంతరంగంలో ఉన్న బాబూజీ మహరాజ్‌ని బాహ్యమైన ఈ కళ్ళతో చూడలేము. అంతర్ దృష్టి, అంతర్ నేత్రాలు ఉంటేనే చూడగలం. సాక్షాత్కారం, దర్శనం అయిందని అంటారు. దర్శనం అంటే మూర్తి దర్శనం కాదు. ఆ స్థితిలో మనకు దైవం తప్ప ఇంకేమి తెలియదు. మనం ఎవరమో తెలియదు. స్పర్శ, బంధనాలు ఏమీ ఉండవు. దైవం సర్వవ్యాపి. అంతటా వ్యాపించిన వారిని ఈ భౌతికమైన కళ్ళు చూడలేవు. అంతరంగంలో అంతటా వ్యాపించిన వారిని చూడటానికి మనోనేత్రాలు (అంతర్ దృష్టి, Inner eyes) కావాలి. అప్పుడే వారి దర్శనాన్ని అనుభూతి చెందగలం. ఆ కళ్ళతో ప్రాపంచిక విషయాలను, వస్తువులను చూడలేము. దర్శనం గురించి విన్నాము. పుస్తకాలలో చదివాము కాని చూడలేదని అంటారు. దర్శన్ అనేది ఒక స్థితిలో కలిగే అనుభూతి. ఆ స్థితి కలిగినప్పుడే తెలుస్తుంది. ప్రాపంచికంగా ఏమి చేస్తున్నామో, ఏమి తింటున్నామో మనకు తెలియదు. దైవ దర్శనం కలిగేటప్పుడు ఆ స్థితి తెలుస్తుంది. అపుడు ప్రాపంచిక బంధనాలన్నీ తొలగిపోతాయి. ఆ సాక్షాత్కార స్థితి కలిగినపుడు అంతర్ నేత్రాలు పూర్తిగా తెరచుకుంటాయి. శరీరమంతా కళ్ళు అవుతాయి. అప్పుడే రియాలిటిని (సత్యత్వాన్ని) దర్శించగలం.

**సాక్షాత్కారం:** సాక్షాత్కారం అంటే సాక్షాత్ + ఆకారం. అంటే సర్వం వ్యాపించి ఉన్న ఆ దైవం యొక్క అసలు రూపం. దైవం సర్వవ్యాపి అని తెలిసినా ఆ కండిషన్ వచ్చినప్పుడే సర్వవ్యాపకత్వాన్ని ఫీల్ అవుతాము. అదే సాక్షాత్ పరబ్రహ్మ రూపం.

సాక్షాత్కారం – దర్శనం గురించి చెప్పుకుంటున్న ఈ సందర్భంలో – వారి రూపాన్ని ఈ చర్మ చక్షువులు చూడలేవు. వారిలో లయమైనపుడు ఒళ్ళంతా కళ్ళవుతాయి. ప్రతి కణమూ ఒక కేంద్రంగా మారి వారి దర్శనం చేసుకుంటుంది. అవి దివ్య నేత్రాలు. అవే వారిని దర్శించగలవు.

సాక్షాత్కారం అంటే భౌతిక ఆకారం చూడటం కాదు. సాక్షాత్ అంటే అసలైన భగవంతుని దర్శనం. సాక్షాత్ పరబ్రహ్మ స్థితిని అనుభూతి చెందటం అని అర్థం.

చర్యకు (Action) ప్రతిచర్య (Reaction) ఉంటుంది. మనం ధ్యానం చేసినప్పుడు ఆ చర్యకు (Action) ప్రతిచర్య (Reaction) మన సూక్ష్మ శరీరంలో కలుగుతుంది. స్థూల శరీరం ధ్యానంలో చూడగానే కరిగిపోతుంది. అంటే స్థూల శరీరం ఉన్న భావన ఉండదు.

గురువును చూశాము అని అంటారు. గురువును చూడటం కాదు, గురువు ఎవరో తెలుసుకోవాలి. వారి ఆధ్యాత్మిక స్వరూపాన్ని తెలుసుకోవాలి. వారి దర్శనాన్ని అనుభూతి చెందాలి.

**Who was He? Who is He?**

శ్రీరామచంద్రుని యుగం, శ్రీకృష్ణ భగవానుని యుగం అయిపోయాయి. Who were they? అని అనవచ్చు! కాని బాబూజీ మహరాజ్ సర్వమానవాళిని దైవంతో కలపటానికి భూమి మీదకు వచ్చారు. ఆ సంకల్పాన్ని నెరవేరుస్తున్నారు. ఇది వారి యుగం. వారు ఇక్కడే ఉన్నారు. కాబట్టి Who was He? అని అనకూడదు. వారు యుగాంతం వరకు ఇక్కడే ఉంటారు.

డాక్టర్ పార్థసారథిగారు మాట్లాడుతూ ఏదో సందర్భంలో "He was in Shajahanpur" అన్నారు. వెంటనే నేను He was కాదు, He is అని అనండి. మీరు షాజహాన్‌పూర్‌లో చూసింది వారి శరీరాన్ని, ఇక్కడ మీ ఇంట్లో వారిని చూస్తున్నాను. వారు అంటే రియాలిటీ. ఆ రియాలిటీనే ఇక్కడ చూస్తున్నాను. బాబూజీ మహరాజ్ ఎప్పుడూ మనలోనే ఉంటారు.

మనం బాబూజీ అని అనుకోగానే మన ప్రేమ, భక్తి వారి దగ్గరకు వెళ్ళిపోతాయి. ఎందుకంటే మనం వారి రూపంలో అనుబంధం ఏర్పరచుకున్నాము కాబట్టి. కాని మనం ఎటాచ్‌మెంట్ ఎప్పుడూ రియాలిటీతో పెంచుకోవాలి.

బాబూజీ కాకుండా మరెవ్వరితోనైన ఎటాచ్‌మెంట్ అయి ఉంటే, అది పరిమితం (Limited) అవుతుంది. మన బాబూజీ అపరిమితం (Unlimited). వారు అంతటా ఉన్నారు. మనం అపరిమితులమవుతాము.

మన సంస్థ ప్రాంతాలకు, దేశాలకు, మతాలకు అతీతం. విముక్తి పొందిన ఆత్మలు (Liberated souls) లాలాజీ సాహెబ్, స్వామి వివేకానంద మొదలైనవారు డివైన్ పర్సనాలిటీ భూమి మీద అవతరించినప్పుడు వారికి సహాయం చేయటానికి బ్రైటర్‌వరల్డ్ నుండి క్రిందకు దిగివస్తారు. వారు మానవాళి స్థూలత్వాన్ని (Grossness) తీసివేయటానికి దివ్య పురుషునికి సహాయపడతారు. కాని లాలాజీగారు బాబూజీ మహరాజ్‌ను

రక్షించటానికి వచ్చారు. వారిలో మెర్జ్ అయ్యారు. బాబూజీ అనేవారు "ఇది లాలాజీగారి మహిమ. అన్నీ వారే చేస్తున్నారు. ఇంతకీ నాలో ఉన్నది ఎవరు, లాలాజీనా! బాబూజీనా! అనేది నాకు తెలియటం లేదు" అని బాబూజీ అంటూ ఉండేవారు.

బాబూజీ మహరాజ్ నా ఎదురుగా కుర్చీలో కూర్చొని ఉన్నప్పుడు నేను అన్నాను, " బాబూజీ! మీరు నా ఎదురుగా కుర్చీలో కూర్చొని ఉన్నారు. ఈ బాబూజీకంటే నా అంతరంగంలో ఉన్న బాబూజీ చాలా బాగున్నారు" అని. అపుడు బాబూజీ అన్నారు "నీవు నా శరీరంతో కాకుండా దాని కతీతమైన రియాలిటీతో కనెక్ట్ అయి ఉన్నావు. అందుకే అలా ఫీల్ అవుతున్నావు" అని. కాబట్టి మనం శరీరంతో కాకుండా అసలు తత్వంతో కనెక్ట్ చేసుకోవాలి. అపుడే 'వారు' ఏమిటో తెలుస్తుంది.

పిల్లలంటే బాబూజీ మహరాజ్‌కి ఎంతో ఇష్టం. వారిని వెంటపెట్టుకుని తోటకు తీసుకెళ్ళేవారు. వారికి శెనగలు, బఠాణీలు కొనిపెట్టేవారు. బఠాణీలమీద చల్లుకోవటానికి ఉప్పు ఇంటి దగ్గర నుండి తీసుకెళ్ళేవారు. వారికి కావలిసిన గులాబ్‌జామ్ కోసం ఎక్కడెక్కడో తిరిగి తెచ్చేవారు.

ఒకసారి నేను మరికొంతమంది షాజహాన్‌పూర్‌కి వెళ్ళేటప్పుడు ట్రైన్ లేటయ్యింది. రాత్రి 12.00 గం॥లకు చేరాము. అంతవరకు బాబూజీ మహరాజ్ ఆహారం తీసుకోకుండా మా కోసం నిరీక్షించి మాతోపాటుగా కూర్చుని భోజనం చేశారు. ఇంట్లో వారి కుటుంబ సభ్యులు లేట్ అవుతుంది భోజనం చేయమన్నా చేసేవారు కాదు. అభ్యాసీలంటే వారికి అంత ప్రేమ. వారు తినకుండా బాబూజీ తినేవారు కాదు. బసంత్ ఉత్సవ సందర్భంలో కూడా అందరూ భోజనం చేశారో లేదో అడిగి అప్పుడు భోజనం చేసేవారు.

ఒకసారి నేను లఖింపూర్ నుండి షాజహాన్‌పూర్‌కి వెళ్ళేటప్పుడు మా అక్కగారు ఇచ్చిన పూరీలు, నాలుగు రూపాయలు పోయాయి. బాబూజీ ఇంటికి వెళ్ళగానే బాబూజీ, "నా దగ్గర పూరీలు లేవుగాని, రోటీలు ఉన్నాయి తింటావా!" అని, రిక్షావానికి డబ్బులిచ్చి పంపారు.

బాబూజీ డబ్బులు జేబులో పెట్టుకునేవారు కాదు. ముఖ్యంగా ప్రయాణం చేసేటప్పుడు భుజానికు క్రింద పైచేతికి కట్టుకునే వారు. దాని మీద కోటు వేసుకునే వారు. అంత గట్టిగా కట్టుకుంటే చెయ్యి నొప్పి పుట్టదా! అని అడిగితే "డబ్బు జాగ్రత్తగా ఉంటుంది కదా! దొంగలు దొంగిలించలేరు. డబ్బంటే అందరికీ ప్రీతి, నా చేతికి కూడ. అందుకే అది నా చెయ్యిని గట్టిగా పట్టుకుంటుంది, పోనీకుండా" అనేవారు.

మనకు కావలసినది భగవంతుని సాక్షాత్కారం (గాడ్ రియాలైజేషన్)యే కాదు. 'వారి'ని పొందాలి. మన అస్తిత్వం పూర్తిగా పోతేగాని ఈశ్వర ప్రాప్తి కలగదు. మనం లేకుండాపోయినపుడు అక్కడ ఈశ్వరుడు ఉంటాడు. అదే ఈశ్వర ప్రాప్తి.

దివ్యశక్తి (ఆదిశక్తి, భూమాశక్తి) సప్త వలయాల రూపంలో ప్రవహిస్తూ ఉంటుంది. ఆ శక్తి నేరుగా భూమి మీదకు వస్తే భూమి బద్దలవుతుంది. ధరణి భరించలేదు. అందుకే వలయాకారంలో క్రిందకు దిగుతుంది.

అభ్యాసీ హృదయం ఆధ్యాత్మికతతో నిండినప్పుడు అతని స్పిరిట్యువల్ హార్ట్ (ఆధ్యాత్మిక హృదయం) బాబూజీగారి విరాట్ హృదయంతో కలపబడుతుంది. అలా కలపటానికి బాబూజీ తన దివ్యశక్తి నిచ్చి, స్పిరిట్యువల్ ట్రయినింగ్ ఇస్తారు. స్పిరిట్యువల్ హార్ట్, డివైన్ పవర్‌తో విరాట్ హృదయంతో కలపబడుతుంది. ఈ ట్రయినింగ్ బాబూజీ మహరాజ్ ఒక్కరే ఇవ్వగలరు.

నేను మాట్లాడుతున్నప్పుడు మధ్యలో ఉమాజీ నాకు సపోటా పండ్లు తినమని ఇచ్చారు. నేను వారితో "నాకు బాబూజీ మహరాజ్ గురించి మాట్లాడుతూ ఉంటే శక్తి వస్తుంది, ఇంక ఈ పండ్లు ఎందుకు?" అని అన్నాను. నేను ఆ దివ్యశక్తితోనే జీవిస్తున్నాను.

"God is not perfect" భగవంతుడు పరిపూర్ణుడు కాడు. How can people expect them to be perfect. పూర్వపు రోజుల్లో గాడ్లీ రిజీయన్‌యే ఆఖరి రిజీయన్‌గా అనుకునేవారు. కాని దానిపైన భూమా ఉన్నదని అప్పటి ఋషులకు తెలియదు. బాబూజీ అంతిమం నుండి వచ్చారు. 'వారు' ఒక్కరే అంతిమం గురించి మనకు వివరంగా తెలిపారు. There is something which is more perfect than God. It is **Ultimate**. To reveal that there is other region beyond Godly region which is more perfect. Babuji has come from **Ultimate** to make human beings perfect.

మానవుడు సృష్టించిన విగ్రహానికి మూర్తి పూజ చేస్తాడు. భగవంతుడు చేసిన మానవ మూర్తి హృదయంలో భగవంతుడున్నాడు. వారిని పూజించకుండా ప్రాణప్రతిష్ఠ చేసిన విగ్రహాన్ని పూజిస్తాడు.

మనం బాబూజీ మహరాజ్ దగ్గరకు వెళ్ళాలనుకోగానే మన మనస్సు శరీరానికంటే ముందుగా అక్కడకు వెళ్ళిపోతుంది. అప్పుడు బాబూజీకి మనం రాకముందే మనం వస్తున్నామని తెలిసిపోతుంది. Mind goes earlier than body.

Mind purifies the place and half the work is over. నేను ఏ ప్రదేశానికైనా వెళ్ళాలనుకుంటే ముందుగానే బాబూజీ ఆ ప్రదేశాన్ని క్లీన్ చేసి డివైన్ వర్క్‌కు తయారుగా ఉంచుతారు. అపుడు అభ్యాసులు నా రాకకోసం ఆతురతతో ఎదురుచూస్తూ ఉంటారు. వారిలో క్రేవింగ్ (తపన) మొదలవుతుంది.

మన హృదయం మాత్రం నిర్మలంగానే ఉంటుంది కాని మన బుద్ధి దానిని అపవిత్రం చేస్తుంది. బుద్ధి, పనులు నెరవేరటానికి అవసరమే. గుర్తుపెట్టుకోవటానికి పని చేస్తుంది. ఆ బుద్ధి విచక్షణతో పనిచేస్తేనే హృదయం నిర్మలంగా, పవిత్రంగా ఉంటుంది.

ఈశ్వరుడు, జీవి (ఆత్మ) రెండూ నాశనము లేనివి. ఈశ్వరుని చేరటం మానవుని ధర్మం లేదా కర్తవ్యం. ఆ ధర్మాన్ని నెరవేర్చాలి. ఈ భూమి మీద పుట్టిన వారిని ఈశ్వరుని దగ్గరకు చేర్చడం ఎలా?

బాబూజీ మహరాజ్ తమ దివ్యశక్తితో ఈశ్వరుని దగ్గరకు తీసుకువెళ్ళటమే కాదు, వారిలో లయం చేస్తారు. ఈశ్వర ప్రాప్తి కలిగిస్తారు. భారత యుద్ధంలో దుర్యోధనుడు కర్ణునితో రేపు మీ బాణంతో అర్జునుని సంహరించండి అని అంటాడు. ఆ అస్త్రాన్ని నేను ఒక్కసారి మాత్రమే ప్రయోగించగలను, అని కర్ణుడు అంటాడు. ఆ అస్త్రానికి ఏదీ ఎదురు నిలువలేదు. అది ప్రయోగించినప్పుడు శ్రీకృష్ణుడు రథాన్ని క్రిందకు దించి అర్జునుని రక్షిస్తాడు. శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి రక్షణ కల్పిస్తూన్నంతవరకు ఏ అస్త్రం వారిని సంహరించలేదు. అలాగే లాలాజీగారు బాబూజీ రక్షణకోసం వారిలో లయమయ్యారు. రాత్రి 2.00 గం॥లకు లాలాజీ బాబూజీతో "పెరట్లో దొంగలు తిరుగుతున్నారు జాగ్రత్త" అని హెచ్చరించారు. వారిని కాపాడటం లాలాజీ, తమ బాధ్యతగా తీసుకున్నారు.

సమ్ (సమస్తం) + అర్పణ = సమర్పణ

భక్తి, ప్రేమలతో మనలను వారికి అర్పించుకోవాలి.

దశరధునికి రాముని స్వరూపం మీద ప్రేమ. ఆ రూపం వారికి దూరమవ్వగానే ఎడబాటు భరించలేక మరణించాడు. కౌసల్యకు రాముని అంతర్ రూపం మీద అనగా దివ్య రూపం మీద ప్రేమ. ఆ దివ్య రూపం ఎప్పుడూ ఆమెలోనే ఉండేది కాబట్టి ఎడబాటు ఫీల్ కాలేదు.

సహజమార్గం – సహజమైన జీవన మార్గం.

అభ్యాసీలు పూజలో (ధ్యానంలో) కూర్చుంటే పూజ చేశామని సంతోషిస్తారు. పూజలో కూర్చోకపోతే అయ్యో! ధ్యానం చేయలేదే అని బాధపడతారు. కాని దైవం గురించి ఆలోచించరు. ప్రేమ, భక్తి లేకుండా ధ్యానం ఒక నియమంగా భావించి చేస్తే ఫలితం ఉండదు. ధ్యానంలో కలిగిన అనుభూతిలో నివసించాలి. ధ్యానంలోనే ఉండాలి. అంటే దైవంతోనే ఉండి ప్రాపంచికమైన పనులు చేసుకోవాలి.

బాబూజీ మహరాజ్ జన్మదినం సాధారణ మానవులు జరుపుకునే పుట్టినరోజు లాంటిది కాదు. ఎందకంటే, దివ్యపురుషులు, అవతార పురుషులు గర్భం నుండి జన్మించరు. 'వారు' అవతరిస్తారు. సర్వమానవాళిని అనంతానికి తీసుకువెళ్ళటానికి దివ్య శక్తి భూమి మీదకు దివ్యపురుషుని రూపంలో అవతరించిన విషయం ప్రకటించటానికి జన్మదినం జరుపుతాము. అందుకే బాబూజీ జన్మదినోత్సవాన్ని **DIVINE DESCENDED DAY** అని అనండి. మనకు వరదానం ఇవ్వటానికి ఈ భూమిమీదకు వచ్చారు. వారే మనకు పెద్ద వరదానం. అంతరికీ ఆ వరదానం ప్రాప్తించాలని నేను బాబూజీ మహరాజ్‌ని ప్రార్థిస్థన్నాను.

ధ్యానం, నిర్మలీకరణ, ప్రార్థన సాధనకు మూడు అంశాలు. ఈ సాధన నియమంప్రకారం చేస్తే ప్రయోజనం ఉండదు. సాధన ద్వారా దైవంలో మునిగి వారిలో లయం కావాలి.

రామాయణం రాముని కథ, భాగవతం శ్రీకృష్ణ పరమాత్ముని కథ; కాని మన సహజమార్గం చెప్పటానికి, వినటానికి కథలాంటిది కాదు. అనుభవపూర్వక ఆధ్యాత్మిక దశల జీవన మార్గం సహజమార్గం. అనుభూతి చెందాలేకాని వినడం వలన, చదవటం వలన ఫలితం ఉండదు.

మీరాబాయి, సూరదాస్ భక్తులు. వారు భక్తితో తన్మయత్వాన్ని, ఆనందాన్ని అనుభవించారు. ఇది ఆనందం మాత్రమే. పనమానంద దశలో శరీరం అన్ని పనులూ బాబూజీ యొక్క ఇచ్ఛాశక్తితో చేస్తుంది. పని చేస్తున్నామను స్పృహ మనకు ఉండదు. పరమానందంలో మునిగి ఉంటాం. చెవులు శబ్దాన్ని వింటూ ఉంటాయి. నోరు మాట్లాడుతూ ఉంటుంది. కాని మనస్సు బాబూజీ మహరాజ్ దివ్యత్వంలో మునిగి ఉంటుంది. ధ్యానంలోనే ఉంటూ జీవితాన్ని గడపాలి.

ఈ భూమి మీద పుట్టిన ప్రతిఒక్కరం మరణించక తప్పదు. మరణిస్తామని తెలిసి భయపడటం ఎందుకు? జీవితం అశాశ్వతం. జీవితకాలాన్ని వృథా చేసుకోవటం ఎందుకు? జీవిత లక్ష్యాన్ని నెరవేర్చుకుందాము.

బాబూజీ మహరాజ్ మన హృదయంలో ఉన్నారు. మనలో ఎన్ని మాలిన్యాలు ఉన్నా వారు శుభ్రం చేస్తారు. అక్కడే ఉంటారు. మాలిన్యాలు ఉన్నాయని మనల్ని వదిలిపెట్టి వెళ్ళిపోరు. 'వారు' ఎల్లప్పుడూ మనలోనే ఉంటారు. మనమే వారిలో ఉండము.

శ్రీరామచంద్ర మిషన్‌కు బాబూజీ తల్లిలాంటి వారు. పిల్లలందరూ సంతోషంగా ఉండాలని తల్లి కోరుకుంటుంది. బాబూజీ ఎప్పుడూ మనలను కాపాడుతూ ఉంటారు. బాధలలో, కష్టాలలో మనతోనే

ఉంటారు. వాటిని భరించే శక్తిని మనకు ఇస్తారు. అందరినీ ఒక్కలాగే ప్రేమతో చూస్తారు. అందరినీ క్షమిస్తారు. తల్లి, పిల్లలను శిక్షించదు. కాని తప్పులు చేస్తూ పోతే ప్రకృతి సహించదు. శిక్ష తప్పదు.

ఒకసారి బాబూజీని అడిగారు – ఇంతమంది అభ్యాసులు ఉన్నారు కదా! అందరితో ఎలా మాట్లాడుతున్నారు? అని. అప్పుడు బాబూజీ అన్నారు – "నేను మాట్లాడటానికి రాలేదు. రియాలిటీని బహిర్గతం (రివీల్) చేయటానికే వచ్చాను. అందరిని ఆ రియాలిటీతో కలపటానికి వచ్చాను" అని.

ప్రేమ అంటే పరమ + Aim – పరమలక్ష్యం. అంటే దైవాన్ని చేరుకోవటం – దైవంమీద మనకు ఉన్న బంధమే ప్రేమ. ప్రేమ లేకుంటే ఏ పని ఫలితానివ్వదు. ఎప్పుడైతే దైవాన్ని ప్రేమిస్తామో వారు మనకు సంతోషాన్ని ఇస్తారు.

మనం మన శరీరాన్ని (మనస్సు) ప్రేమిస్తాం. కాని వారిని ప్రేమించం. ప్రేమలేని సాధన నిష్ప్రయోజనం. ఎన్ని రోజులు చేసినా ఫలితం ఉండదు. మనం ఎంతో సౌభాగ్యవంతులం. ఆ సౌభాగ్యంతో మన సంస్థను ప్రేమతో అభివృద్ధి చేయాలి. హృదయం ఎప్పుడూ బాబూజీ మహరాజ్‌తో కనెక్ట్ అయి ఉండాలి. వారి సంతోషంకోసమే అన్నీ చేస్తున్నామన్న భావన కలిగి ఉండాలి. మనస్సులో వారి కొక్కరికే చోటు ఉండాలి. బాబూజీ మహరాజ్ సంకల్పమే మన సంకల్పం కావాలి. మనకు మన పరివారానికి ఏమీ ఇబ్బంది కలుగకుండా వారే చూసుకుంటారు.

"నేను ఒక కస్తూరి కోసం రాలేదు. సర్వమానవాళి కోసం వచ్చాను. నాకు డబ్బు, పేరు అక్కర్లేదు. నాకు కావలసినది మీ ప్రేమ" అని బాబూజీ అనేవారు. మనం వారిని మరచిపోయినా 'వారు' మనలను ఎల్లప్పుడు గుర్తుపెట్టుకుంటారు. 'వారు' వచ్చింది మనకోసం కాబట్టి వారే మనలను గుర్తుంచుకుంటారు. మనల్ని ఉద్ధరించటానికి వచ్చారు.

ప్రేమ, ప్యార్ శాబ్దాలు రచన రెండు వేరు, అవి వేరు స్థితులను తెలుపుతాయి. లక్ష్య సాధన కోసం భగవంతునితో పెంచుకునేది ప్రేమ. భౌతికమైన అనుబంధాలు కల్పించుకునేది ప్యార్.

సహజమార్గం చాలా కష్టమైనది అంటారు. అది ఎంతో తేలికైనది. ముఖ్యంగా స్త్రీలకు ఇది చాలా సులభం. వంట చేస్తున్నా, పిల్లల పని చేస్తున్నా, ఏ పని చేస్తున్నా, వారి సంతోషం కోసం చేస్తున్నామని చేస్తే చాలు, వారిలోనే లయమై జీవిస్తారు. ఈ జీవితం మీ కోసమే బాబూజీ అని మనం వారి స్మరణలోనే జీవించాలి.

**అభ్యాసీ యొక్క ఆధ్యాత్మికతలో ప్రిసెప్టర్ పాత్ర ఏమిటి?** అని ఒక అభ్యాసీ అడుగుగా నేను ఇలా చెప్పాను:

ప్రిసెప్టర్ అంటే సిట్టింగ్ ఇచ్చే వ్యక్తి కాదు. వారి ద్వారా వచ్చే ట్రాన్స్‌మిషన్ అంటే దివ్యశక్తి సాయంతో అభ్యాసీ హృదయాన్ని శుభ్రపరచి లక్ష్యాన్ని చేరుకోవటానికి సాధనలో అభ్యాసీకి తోడ్పడతాడు. అభ్యాసీలో ప్రేమ, భక్తిని పెంపొందిస్తాడు. ఆ దివ్యశక్తిని అభ్యాసీవైపు మరల్చి అభ్యాసీ యొక్క ఆధ్యాత్మిక పురోగమనానికి తోడ్పడతాడు. వీటన్నిటికీ బాబూజీ మహరాజ్ దివ్యశక్తే పనిచేస్తుంది. ప్రిసెప్టర్ ఒక మీడియమ్ మాత్రమే. సాధనలో ఏవైనా సమస్యలు వస్తే ప్రిసెప్టర్ దానికి పరిష్కార మార్గం సూచిస్తాడు. సహజమార్గం, బాబూజీ మహరాజ్, మిషన్ గురించి క్రొత్తవారికి చెప్పటానికి వారు తోడ్పడతారు.

ఒకసారి శ్రీ రాఘవేంద్రరావుగారు, “బాబూజీ! మీరు ఇక్కడకు వచ్చినప్పుడు ఆ భగవంతుడే మా సమక్షంలో ఉన్నట్లు అనిపిస్తుంది” అని అంటే బాబూజీ అన్నారు –“అయితే నేను వెళ్ళిపోతే దైవం వెళ్ళిపోయినట్లేనా? ఒక కాలేజికి ప్రిన్సిపల్‌వు. ఇదా నీవు దైవం గురించి అర్థం చేసుకున్నది?” అని.

నేను జన్మించింది మీకందరికి సిట్టింగ్ ఇచ్చి దివ్యశక్తి సాయంతో మిమ్మల్ని బాబూజీతో కలపటానికి. వారి సేవ చేసుకోవటానికే.

అయోధ్య తీర్పు (Judgement) గురించి మాట్లాడుతూ తీర్పు చెప్పటానికి 8,000 పేజీలు Judgement చదవాల్సిన అవసరం లేదు. ‘అవును’ లేదా ‘కాదు’ – ఒక వాక్యంతో చెపితే సరిపోతుంది కదా! భగవంతుడు ఒక్కడే. వారికి మందిరం, మసీదు, చర్చ్ ఇలా వేరు, వేరు ప్రార్థనా స్థలాలు అవుసరం లేదు. ఒక్కరికి ఇన్ని అవసరమా!

బాబూజీ అంటూ ఉండే వారు. “అభ్యాసీల హృదయంలో దైవాన్ని ప్రతిష్టించాను. సహజమార్గాన్ని ఇచ్చాను. దివ్యశక్తిని ప్రసారం చేస్తున్నాను. ఇన్ని ఇచ్చి సాధన చేసి లక్ష్యాన్ని చేరుకోండి అంటే సాధన చేయ నంటారే!” అని బాబూజీ బాధపడేవారు.

సుందరత, అసుందరత అనే పదాల అర్థం చెపుతూ

ఆత్మ – సుందరం, నిర్మలం, శాశ్వతం, పవిత్రం.

శరీరం – అసుందరం, ఆశాశ్వతం, అపవిత్రం.

జీవి, ప్రాణం గురించి వివరిస్తూ,

జీవి అంటే ఆత్మ, శరీరం కాదు.

ఆత్మ – పరమాత్మ అంశ. అపరిమితము, శాశ్వతము.

ప్రాణం – శక్తి, పరిమితం, అశాశ్వతం.

బాబూజీ అనేవారు, “నేను వచ్చింది నా గురువుగారి సంకల్పం నెరవేర్చటానికే. వారి సంకల్పమే నా సంకల్పం. నా పని ఒక్కటే, ప్రతి మానవునికి ప్రాణాహుతి నిచ్చి, నిర్మలీకరించి, వారి ఆలోచన, ప్రవర్తన, జీవన విధానాన్ని మార్చి, దివ్యశక్తితో నింపి సాక్షాత్కారానికి యోగ్యులుగా తయారు చేయటం.

పతంజలి యోగాన్ని అష్టాంగ యోగ అంటారు. అందులో 8 అంగాలుంటాయి. యమ, నియమ, ఆసన, ప్రాణయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి. మన సహజమార్గ రాజయోగంలో సాధనకు కావలసినవి మూడే.

మూడు అంగాలు –ధ్యానం, నిర్మలీకరణ, ప్రార్థన.

లివింగ్ మాస్టర్ కావాలంటున్నారు. గురువు అంటే శరీరం కాదు. గురువు అంటే ఒక టెక్నిక్. సాంకేతిక పరిజ్ఞానం. వారిలోని ఆ టెక్నిక్ అభ్యాసీల హృదయాలను శుభ్రపరచి, శక్తితో నింపి దైవంతో కలుపుతుంది. అదే దివ్యత్వం.

# బసంత్ పంచమి 2011

అభ్యాసీలు ఇక్కడకు వచ్చినప్పుడు బాబూజీగారి సామీప్యతను అనుభూతి చెందుతారు. వారింట్లో ఉన్నట్లే ఫీలవుతారు. ధ్యానంలో బాబూజీని చూడాలి. వారి గురించితప్ప దేని గురించీ ఆలోచించకూడదు. మన మైండ్ ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటుంది. అది ఆలోచనల వెంట పరిగెడ్తూ ఉంటుంది. అది తప్పు. బాబూజీ మహరాజ్ మనకు దగ్గరగా ఉన్నారు. వారి గురించి కాక వేరే వాటి గురించి ఆలోచిస్తే బాబూజీ మహరాజ్‌ను మరచిపోతాము. కాని బాబూజీ ఒక్కసారి మనలను చూశారంటే మరచిపోరు. మనం ఒక్కసారి తలచుకుంటే చాలు వారు ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటారు.

ఒకసారి నాకు ఎడమ భుజం చాలా నొప్పిగా ఉన్నది. ఎవరైనా నమస్కరిస్తే వారికి తిరిగి చేతులు జోడించాలంటే వీలుకాలేదు. అభ్యాసీలను చూడగానే నాకు అసలు నొప్పి తెలియలేదు. ఎందుకంటే బాబూజీ మహరాజ్ సేవలో ఉంటే సర్వం వారిలోనే ఉంటుంది. వేరే వాటికి అక్కడ తావులేదు. అంతా బాబూజీలోనే నిండి ఉంటుంది.

బాబూజీ మహరాజ్ ఎవరి ఇంటికైనా వెళ్తే అక్కడ ఉన్నవారు చీరలు మార్చుకుని ఫ్రెష్‌గా తయారవుతారు. ఒకసారి మా ఇంటికి వచ్చారు. అప్పుడు "అందరూ చీరలు మారుస్తారు కదా! మరి నీవెందుకు మార్చలేదు?" అని అడిగారు. అప్పుడు నేను "బట్టలైతే మార్చుకోవచ్చు కాని హృదయాలను మార్చుకోలేము కదా! మీరు ఒక్కరే మా హృదయాలను మార్చగలరు" అని అన్నాను.

బాబూజీగారి ప్రేమకు అవధులు లేవు. అభ్యాసీలంటే ఎంత ఇష్టమో చెప్పలేము. తల్లిదండ్రులు కూడా పిల్లలమీద అంత ప్రేమ కలిగి ఉండరు. బాబూజీ ప్రేమ అపారం, అనంతం. దానిని వేటితోను కొలవలేము.

డెన్‌మార్క్ అభ్యాసీ ఒకరు 'బసంత్'కు (meaning) అర్థం నిన్న చెప్పారు. నాకు అర్థం కాలేదు. తిరిగి చెప్పండి అని అడిగాడు. అప్పుడు సిస్టర్‌గారు ఇలా చెప్పారు –

'బస్' అంటే హిందీలో ఆగిపోవటం (Stop) అని అర్థం. 'అంత్' అంటే ముగింపు (end) అని అర్థం. అంటే Freedom from 'I' ness or end of 'I' ness. 'I' ness ఆగిపోయి అంతమౌతుంది.

**ప్రశ్న: బసంత్ ఉత్సవంలో ఉన్న కండిషన్ ఆ తరువాత ఉండదు. ఎందుకని?**

**జవాబు:** బసంత్ ఉత్సవంలో మీరు బాబూజీతో కనెక్ట్ అయి ఆ ధ్యాసలో ఉంటారు. ఇంటికి వెళ్ళిన తరువాత బాహ్యామైన పనులలో మునిగిపోతారు.

**ప్రశ్న: ఆలోచనలు ఎక్కువుగా వస్తున్నాయి.**

**సోదరి:** ఆలోచనలు వాతావరణంలో తిరుగుతూ ఉంటాయి. మన దగ్గరకు రావు. మనమే వాటి దగ్గరకు వెళ్తాము. వాటి గురించి మనమే ఆలోచిస్తూ ఉంటాము. అంటే బాబూజీని మరచిపోయినట్లే. మీ స్మరణలో బాబూజీ మహరాజ్ ఉంటే అవి మీ దగ్గరకు రావు. వాటి దగ్గరకు వెళ్ళరు. కాబట్టి హృదయంలో నిరంతర స్మరణ కలిగి ఉండాలి.

బాబూజీ మహరాజ్‌ని మీరు అన్ని ప్రశ్నలకు జవాబు అడగలేరు. మీ సిస్టర్‌ని నేనున్నాను. నన్ను ఎన్ని ప్రశ్నలైనా అడగండి అన్నప్పుడు ఒక అభ్యాసీ ఇలా అడిగాడు: "గతజన్మ గురించి మనకు ఎందుకు తెలియదు? తెలిస్తే బాగుంటుంది కదా!" అని. దానికి జవాబుగా నేను ఇలా చెప్పాను: తెలియకుండా ఉండటమే మంచిది. ఎందుకంటే, గత జన్మలో మన మెవరమో, ఏ ఇంట్లో పుట్టామో, అక్కడి పరిస్థితులు, ఆశలను ఈ జన్మలో లభించని వాటితో పోల్చుకుని బాధపడతూ బాగా డిస్టర్బ్ అవుతాము. దానిని గురించి తలచుకుంటూ ఈ జన్మ కూడా వృథా చేసుకుంటాము. అందువలన గతజన్మ స్మృహ మనకుండదు. ఇది ప్రకృతి యొక్క విధానం (Nature's Management) కనీసం ఈ జన్మనైనా సార్థకం చేసుకోవటానికి వీలు కలుగుతుంది.

సైంటిస్ట్‌లు Hearing aids (చెవిటివారు వినడానికి ఉపయోగించే పరికరాలు) కనిపెట్టారు. వాటితో మనం ప్రాపంచికమైన, భౌతికమైన శబ్దాలు వినగలుగుతాము. కాని 'ఆ' (sound) శబ్దం అంటే– భగవంతుని గొంతు వినలేము. రియాలిటి, రియాలిటినే. ఆ స్వరమే మనం వినవల్సింది.

**ప్రశ్న: How to get close to Babuji Maharaj? బాబూజీ మహరాజ్‌తో సామీప్యత ఎలా పెంపొందించుకోవాలి?**

**జవాబు:** వారిపై హృదయ పూర్వకమైన ప్రేమ కలిగి, వారి స్మరణలో ఉంటే వారికి దగ్గరవుతాము. ఆ స్మరణ ఒక్కటే సరిపోదు. ప్రేమపూర్వక స్మరణ అవసరం. అప్పుడు వారితో బంధం ఏర్పడుతుంది. ఆ బంధమే వారికి దగ్గరగా చేరుస్తుంది. దీనికి కొంత సమయం పడుతుంది. శ్రద్ధగా సాధన చేయాలి.

ఒక అభ్యాసీ బాబూజీని "మీరు మమ్మల్ని వెంటనే ఎందుకు కలుసుకోరు?" అని అడిగాడు. అందుకు బాబూజీ ఇలా అన్నారు– "మీరు, నేను మీ ఎదురుగా ఉన్నానని మీరు నా ఎదురుగా ఉన్నారని నన్ను దూరం చేసి చూస్తున్నారు. మీరు మీలో మిమ్మలను చూస్తున్నారు. కాని నన్ను చూడటం లేదు. నేను వేరుగా, దూరంగా, బయట ఉన్నానని అనుకుంటున్నారు" అని. బాబూజీ మహరాజ్ మనలోనే ఉన్నారని వారిలోనే పూర్తిగా మునిగి ఉన్నామని భావించాలి. బాబూజీ ఎదురుగా ఎక్కడో ఉన్నారని అనుకోకూడదు.

బాబూజీతో ఒకరు, **"మీరు ఎవ్వరు?" Who are you?** అని అడిగారు. అప్పుడు బాబూజీ మహరాజ్, "మీరు ఎవ్వరో నేనూ అదే. నన్నే మీరు ఎవ్వరని అడుగుతున్నారు. మిమ్మల్ని మీరు తెలుసుకోలేరు కనుక నన్ను కూడా తెలుసుకోలేకపోతున్నారు" అని అన్నారు. బాబూజీయే మన దైవం. 'వారు' మనలోనే ఉన్నారు. మనలో ఉన్నవారినే మీరు ఎవరని మనం అడుగుతున్నాం.

ఒకసారి బాబూజీ మహరాజ్ ఈశ్వర సహాయ్‌గారిని ఒక గ్లాస్ మంచి నీళ్ళు తెమ్మన్నారు. వారు తీసుకుని వచ్చి ఇచ్చారు. "నీళ్ళు ఎక్కడ, తీసుకుని రాలేదా?" అని అక్కడే ఉన్న నీటిని చూస్తూ అన్నారు బాబూజీ. ఈశ్వర సహాయ్‌గారు నీటిని చూపించారు. అపుడు బాబూజీ, "నీళ్ళు నాకు కనపడటం లేదే!" అని అన్నారు. వారికి అంతా ప్రేమయే కనపడుతోందిగాని నీళ్ళు కనపడటంలేదని దీని అర్థం. వారు అంతటా ప్రేమనే తప్ప ఇంకేమీ చూడరు. ఈశ్వర సహాయ్‌గారు తెచ్చిన నీటిలో నీరు కనపడలేదు. వారికి ప్రేమయే కనపడింది.

మనం చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు చిన్నగా ఉంటాము. మనలోని 'I' ness కూడా తక్కువగా ఉంటుంది. మనం పెరిగేకొద్దీ మన శరీరం, మైండ్ రెండూ పెరుగుతాయి. వాటితోపాటు 'I' ness కూడా పెరుగుతుంది. నేను ఇది చేస్తున్నాను, అది చేస్తున్నాను అని భావిస్తాము. అహం పెరిగిపోతుంది.

అభ్యాసీ సోదర సోదరీమణులు ఎక్కువమంది బాగా చదువుకున్నారు. నేను ఏమీ చదువుకోలేదు. కాని బాబూజీ మహరాజ్‌ని చూశాక వారి గురించి తెలుసుకోవాలని, వారిని పొందాలని అనిపించింది. అంతేకాని రాముని గురించి, కృష్ణుని గురించి తెలుసుకోవాలని అనిపించలేదు. మీరు బాబూజీని నిజంగా ప్రేమిస్తే మిగిలిన వాటనన్నిటిని వదిలివేస్తారు. ఇతర పూజా విధానాలను మానివేస్తారు. భక్తుడు, భగవంతుడు భక్తితో ఒకటవుతారు. ఆ భక్తినే మనం అభివృద్ధి చేసుకోవాలి. బాబూజీ మా ఇంటికి మొదటిసారి వచ్చినపుడు "వీరు నా వారు" అన్న ఫీలింగ్ కలిగింది. మొదట 'వారు' బయట ఉన్నట్లనిపించింది. కాసేపటికి 'వారు' బయట కాకుండా నా లోపలే ఉన్నట్లు అనుభూతి చెందాను.

ధ్యానంలో మీకు తరచు ఎవరైనా కనిపించినా మీరు బాబూజీ మహరాజ్‌నే చూస్తున్నారు. ఆ వ్యక్తిని కాదు అని అనుకుంటే ఆ వ్యక్తి ధ్యానంలో ఎప్పుడూ కనిపించరు.

**ప్రశ్న: నిజమైన ప్రేమ అంటే ఏమిటి? What is real love?**

**జవాబు:** అది ఎవరికీ తెలియదు. మీకు ఒక స్థితిలో బాబూజీ స్మరణ తప్ప ఇంకేమీ గుర్తుకు రాదు. ఆ స్థితిలో అసలు ప్రేమంటే ఏమిటో మీకు తెలుస్తుంది. ఒకసారి నాకు నా చేతిని నేను పట్టుకుంటే బాబూజీ మహరాజ్ నా చేయి పట్టుకున్నట్లు అనిపించింది. ఆ దివ్య స్పర్శ నాకెంతో ఆనందం కలిగించింది. కాని ఆ స్థితి ఒక అరగంట మాత్రమే ఉన్నది. అపుడు నేను బాబూజీని ఆ స్థితిలో కనీసం మూడురోజులైనా ఉంచమని అడిగాను. అందుకు బాబూజీ ఇలా అన్నారు – "నీవు ఈ సమాజంలో జీవిస్తున్నావు. ఆ స్థితిలో చూసి నిన్ను ఎవరూ తప్పుగా అనకోకూడదు. అందుకే ఎక్కువ సమయం ఆ కండిషన్‌లో ఉంచలేను."

సిస్టర్‌గారు గెస్ట్‌హౌస్‌కి రాగానే అభ్యాసీ లందరిని క్షేమంగా ఉన్నారా? అని పలకరించారు. బాబూజీ మహరాజ్ మిమ్మల నందరినీ తలచుకుంటున్నారు. ఎందుకంటే, మీరందరూ వారిని ప్రేమతో హృదయపూర్వకంగా తలచుకుంటున్నారు. మీరందరూ ఆధ్యాత్మికంగా ఇంకా, ఇంకా పురోగమించాలని బాబూజీ మహరాజ్‌ని ప్రార్థిస్తున్నాను. మిమ్మల్నందర్నీ చూస్తుంటే నాకు చాలా ఆనందంగా ఉంది. ఎందుకంటే మీ అందరి హృదయాలు బాబూజీ మహరాజ్ మీద ప్రేమతో నిండి ఉన్నాయి.

మిమ్మల్ని ప్రశ్నలు అడగమంటే మీరు అడగటంలేదు. నేనే మిమ్మల్ని ఈ ప్రశ్న అడుగుతున్నాను–

**బాబూజీ మహరాజ్‌ని మీరు ఎందుకు ప్రేమించాలి? "Why you love Babuji?"**

దీనికి జవాబు నేనే చెబుతాను. 'వారు' అందర్నీ ప్రేమిస్తున్నారు కనుక మనం వారిని ప్రేమించాలి. **"You love Him because He loves you all"** మన హృదయాలన్నీ ప్రేమతో, వారితో కలుపబడి ఉన్నాయి. "Love" అంటే Nothing. అంటే మీరు Nothing అయినప్పుడు, శూన్యమైనప్పుడు బాబూజీ అక్కడ ఉంటారు. మీరు అక్కడ ఉండరు. ఒక అభ్యాసీ అవివేకంగా (Foolish) బాబూజీని అడిగాడు, నేను ఇక్కడ లేకపోతే మిమ్మల్ని ఎవరు గుర్తుపెట్టుకుంటారు అని.

"మీరు లక్ష్యాన్ని చేరేవరకు నన్ను గుర్తుపెట్టుకుంటారు" అని అన్నారు బాబూజీ. గమ్యాన్ని చేరాక వారిలో కలసిపోయాక వారి స్మరణ ఉండదు.

మనం ఎప్పుడూ మన పిల్లలందరూ క్షేమంగా ఉండాలని తపిస్తూ ఉంటాము. అలాగే బాబూజీ మహరాజ్ కూడా మనలను వారితో కనెక్ట్ చేసుకుంటే సంతోషిస్తారు. మనమేకాదు మన కుటుంబ సభ్యులందరినీ ఆధ్యాత్మికంగా వారితో కనెక్ట్ చేస్తే ఇంకా సంతోషిస్తారు. అది స్పిరిట్యువల్ కనెక్షన్.

దైవం మనలోనే ఉన్నాడు. మనమే వారినుండి వేరు (Separate) అయ్యాము. మిమ్మల్ని మీరు మరచిపోతే మనలో ఉన్న 'I' శూన్యమౌతుంది. అప్పుడు బాబూజీ మహరాజ్ అక్కడ ఉంటారు. మిమ్మల్ని గుర్తుంచుకుంటారు. 'I' ని మనకు ఎందుకు ఇచ్చారంటే దైవాన్ని గుర్తుంచుకోవటానికి. వారిని గుర్తు చేసుకుంటే మిమ్మలను మీరు మరచిపోతారు. వారిని పొందుతారు.

ప్రశ్న: శ్రీరామచంద్రుడు, శ్రీకృష్ణభగవానుడు భారతదేశంలోనే ఎందుకు జన్మించారు?

ప్రపంచం చాలా పెద్దదని మనం భావిస్తాం. కాని అదంతా ఒక్కటే. అంటే దైవం ఒక్కడే. నిన్ను ప్రపంచంలో ఉన్న ఒక వ్యక్తిగా భావిస్తే, ప్రపంచం పెద్దదిగా, వేరుగా కనిపిస్తుంది. 'నేను' ను వారికి అర్పించండి.

దైవానికి అందరి గురించి అన్ని తెలుసుంటాయి. అలాగే అందరికీ భగవంతుని గురించి తెలుసు. ఎందుకంటే, అందరూ భగవంతునితో కలపబడి ఉన్నారు. ఆ కనెక్షన్ మనం మరచిపోతున్నాం. ఆ కనెక్షన్ని గుర్తుపెట్టుకొని మన హృదయంలో దైవం ఉన్నాడని అనుభూతి చెందితే అప్పుడు వారిని తెలుసుకంటాము. మీ అబ్బాయి లండన్లో ఉంటే ఆ అబ్బాయిని మీరు ఎప్పుడూ గుర్తుకు తెచ్చుకుంటూ ఉంటారు. మీ అబ్బాయి శరీరం మాత్రమే లండన్లో ఉంది. కాని హృదయం మాత్రం మీతో కనెక్ట్ అయి ఉంది. రెండు హృదయాలూ కనెక్ట్ అయి ఉన్నందువలన మీరు గుర్తుకు వస్తారు.

భగవంతుడు ఎప్పుడూ భూమి మీదకు రాడు. కాని మనలను భగవంతునితో కలపటానికి వారిని గుర్తు చేయటానికి ఎవరినైనా భూమి మీదకు పంపుతాడు. బాబూజీ అందుకే క్రిందకు దిగి వచ్చారు. మానవాళికి అనంతాన్ని గుర్తుచేసి, అక్కడికి తీసుకువెళ్ళటానికి వచ్చారు.

**ప్రశ్న: బాబూజీగారు ఈశ్వర సహాయ్‌గారికి "Efficasy of Rajyoga" డిక్టేట్ చేశారు. అప్పుడు మీరు అక్కడ ఉన్నారు కదా! బాబూజీ ఎలా డిక్టేట్ చేశారు?**

**జవాబు:** అప్పుడు అక్కడ నేను లేను. ఎలా డిక్టేట్ చేశారో అప్పుడు నాకు తెలియదు. కాని ఎలా డిక్టేట్ చేశారో ఇప్పుడు నేను చెప్పగలను. నేను వ్రాసిన గీతాలు, పుస్తకాలను నా చెయ్యి వ్రాసింది. దానికి పేరు కూడా వారే పెట్టారు. ఏది వ్రాశానో నాకు తెలియదు. అంతా వ్రాశాక చదివితే ఇది ఎవరు వ్రాశారు అని అనిపించేది. ఆ దివ్యశక్తి ఎవరితో వ్రాయించాలనుకుంటే వారితో వ్రాయించుకుంటుంది.

**ప్రశ్న: బాబూజీ డివైన్ పర్సనాలిటీ అని మీకు ఎప్పుడు తెలిసింది?**

**జవాబు:** సంస్థలో చేరిన ప్రతి ఒక్కరికి మొదటి రోజే వారు దివ్యపురుషులన్న అనుభూతి కలుగుతుంది. నాకు అలాగే కలిగింది వారిని చూసిన రోజే వారు దివ్యపురుషులు అని.

విశ్వమంతా దైవం వ్యాపించి ఉన్నాడు. అతడు ఒక్కడే కాని అన్నింట, అందరిలోను కనిపిస్తాడు. అతడు సర్వవ్యాపి కనుక అంతటా నిండి ఉన్నాడు.

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు మన ముందుకు రాలేదు. బాబూజీ మహరాజ్ మన దగ్గరకు ఎందుకు వచ్చారు? మనల నందరిని సరియైన మార్గం గుండా తీసుకువెళ్ళి దైవంతో చేర్చటానికి వచ్చారు. మైండ్‌తో మనం గుర్తుపెట్టుకుంటే ఆ మైండ్ వ్యక్తి చనిపోయిన తరువాత పని చేయదు. కాని హృదయం మాత్రం నావారని ఎప్పుడూ చెప్తూనే ఉంటుంది. కాబట్టి మైండ్‌తో కాకుండా హృదయంతో గుర్తుపెట్టుకోవాలి.

ఒకసారి బాబూజీ నాతో నీవు బ్రహ్మాండ మండలం దాటి పరబ్రహ్మాండ మండలమునకు చేరావు. ఆ బ్రహ్మాండ మండలంలో ఎంతమంది ఉన్నారో చెప్పగలవా? అని అడిగితే నేను చెప్పలేనన్నాను. ఎందుకంటే బ్రహ్మాండ మండలం ఒక ప్రాంతం. రైల్వేస్టేషన్ లాంటిది. అక్కడికి కొన్ని రైళ్ళలో జనం వస్తుంటారు. మరికొన్ని రైళ్ళలో మరి కొంతమంది వెళ్ళిపోతుంటారు. అనేకులు వస్తుంటారు, పోతుంటారు కాబట్టి ఇంతమంది అని చెప్పలేము.

ఇది ఆధ్యాత్మిక యాత్ర. ఈ యాత్రలో ముందుకు వెళ్ళటం జరుగుతుంది. అందరూ గమ్యంవైపు వెళ్తూ ఉంటారు. ఈ యాత్రకు ఏ వాహనమూ అవసరం లేదు. ప్రేమ, భక్తితోనే యాత్ర సాగించి గమ్యాన్ని చేరాలి. లక్ష్యాన్ని అందుకోవాలి.

**ప్రశ్న: ఆలోచనలు ఎక్కడి నుండి వస్తాయి?**

**జవాబు:** మైండ్ నుండి వస్తాయి. శరీరంలోని అవయవాలు శరీరం పనిచేయటానికి తోడ్పడతాయి. హృదయం ఆధ్యాత్మిక పనులకు ఉపయోగపడుతుంది.

ఒకసారి నేను ఒక అందమైన గుడికి వెళ్ళాను. అక్కడ ఇద్దరు వ్యక్తులు నన్ను పూజ (ధ్యానం) ఎందుకు చేస్తున్నానని అడిగారు. అప్పుడు నేను ఇలా చెప్పాను: మీరు సాధనలో మూర్తిని పూజిస్తున్నారు అంటే విగ్రహ పూజ చేస్తున్నారు. మూర్తి పూజలో క్రియ మాత్రమే మిగులుతుంది. పూజ ఉండదు.

**ప్రశ్న: ఏ స్థితికి చేరిన తరువాత ముక్తి లభిస్తుంది?**

**జవాబు:** మన హృదయంలో బాబూజీ మహరాజ్‌ని అనుభూతి చెందితే ముక్తి లభిస్తుంది. ప్రాపంచిక వ్యామోహాలు దూరమైతే మోక్షం లభిస్తుంది. బాబూజీతో అనుబంధంవలన దివ్యత్వంతో నింపబడి సెల్ఫ్ వేరై భగవంతునికి అర్పితమవుతుంది. ఇది ముక్తి, శాశ్వతం.

బాబూజీ మహరాజ్‌కు అభ్యాసులందరితో కనెక్షన్ ఉంది. ఒక అభ్యాసీ సోదరీ, సోదరుడు బాబూజీ కొరకు స్వీట్స్ కొని తీసుకు వెళ్ళారు. బాబూజీ వారిని చూడగానే, “నాకోసం స్వీట్స్ తెచ్చారు కదా!” అని అన్నారు. “బాబూజీ! మేము స్వీట్స్ తెచ్చినట్లు మీకెలా తెలుసు?” అని అభ్యాసీలు అన్నారు. అప్పుడు బాబూజీ ఇలా అన్నారు: మీరు స్వీట్స్ దుకాణంలో స్వీట్స్ కొంటున్నప్పుడు మీ హృదయం చాలా తీయగా ఉంది. అప్పుడు మీరు కొంటున్నట్లు తెలిసింది. మీ స్వీట్ హార్ట్ మీ గురించి తెలిపింది. హృదయంలో వారే ఉంటే మనం ఏమీ చేస్తున్నామో వారికి తెలుస్తుంది. ప్రేమ మాధుర్యాన్ని ‘వారు’ గుర్తిస్తారు.

మీరు వారి నుండి విడిపోయారని అనుకోకండి. వారు మనతో ఎప్పుడూ కనెక్ట్ అయి ఉంటారు. మనం వారిని మరచినా వారు మనలను గుర్తుపెట్టుకుంటారు, మరచిపోరు.

"మీరు చనిపోయేటప్పుడు నేను ఎప్పుడూ మీ ప్రక్కనే ఉంటాను" అన్నారు బాబూజీ. వారు మనకు హృదయాన్నిస్తారు. ఆ హృదయం దివ్య హృదయంతో ఎప్పుడూ కనెక్ట్ అయి ఉంటుంది. మీరు వారి నుండి వేరు (Separate) అయ్యారని ఎప్పుడూ అనుకోకండి. 'వారు' ఎల్లప్పుడూ మనలోనే ఉంటారు.

ఒక అభ్యాసీ తన అనుభవాన్ని ఇలా చెప్పాడు: "నేను ధ్యానంలో కూర్చున్నప్పుడు నా శరీర భాగాలను బయటకు వచ్చినట్లు చూశాను. ధ్యానంలోనూ ఒక శరీరం కూర్చొని ఉంది."

ఇది మంచి అనుభవం. అహం కరిగిపోయాక మనం అందులో నుండి బయటకు వచ్చినప్పుడు ఇలా జరుగుతుంది. ఇది మీ సూక్ష్మశరీరం. నాకు కూడా ఒకసారి ఇలాంటి అనుభవం కలిగింది. ఇది ఆధ్యాత్మిక పురోగమనాన్ని తెలుపుతుంది.

ఆ అభ్యాసీ ఇంకొక అనుభవం చెప్పాడు. "నేను ధ్యానంలో కూర్చున్నప్పుడు ఇదివరకు నేను పూజించని వారు కూడా ధ్యానంలో కనిపిస్తున్నారు. ఎందుకు? ఉదాహరణకు నేను గౌతమ బుద్ధుణ్ణి పూజించలేదు. వారు ధ్యానంలో కనిపిస్తున్నారు.

మీరు ధ్యానంలో కూర్చున్నప్పుడు కలిగిన డివైన్ ఎట్‌మాస్ఫియర్ (దివ్య వాతావరణం)తో కనెక్ట్ అయి ఉన్నవారు ఆ వాతావరణంలో అక్కడ ఉన్నందువలన కనిపిస్తారు. మనం వారిని చూసి ఉండకపోయినా అక్కడున్న వారు ధ్యానంలో కనిపిస్తారు.

తులసీదాసు, త్యాగరాజు, రామదాసు పాటల్లో, 'నన్ను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ" అని సీతమ్మ తల్లిని ప్రార్థిస్తారు. సీతమ్మ తల్లి ద్వారా ప్రభువుకు చెప్పటం ఎందుకు? వారే దైవాన్ని బ్రోవమని అడగవచ్చు కదా!

**ప్రశ్న: కండిషన్ (స్థితి) మారుతున్నట్లు ఎలా తెలుస్తుంది?**

**జవాబు:** కండిషన్ మారినపుడు మన దృష్టి మారుతుంది. మన దృష్టి బాహ్యంగా ఉన్నపుడు వీరు నల్లచీర ధరించారు, వీరు తెల్లచీర ధరించారని బయట ఉన్న రంగులను గుర్తిస్తాము. ఎప్పుడైతే మన దృష్టి అంతర్ముఖమవుతుందో అపుడు మనకు బాహ్య స్పృహ ఉండదు. ఆ దైవం మీదే దృష్టి నిలుపుతాము. వారు తప్ప మనకు ఏది గోచరించదు. రంగులేవీ ఉండవు. ఒక్క రియాలిటీనే ఉంటుంది.

శరీరం, హృదయం (Body, Heart) గురించి మనం ఈ విధంగా అర్థంచేసుకోవాలి: మొదట మన దృష్టి శరీరం మీద ఉంటుంది. అది శాశ్వతమైనది కాదు. ఈ శరీరమే జీవితం అనుకుంటాం. ఎప్పుడైతే బాబూజీని చూస్తామో, అప్పుడు 'వారు' మనవారు, మనలను అంతిమానికి తీసుకు వెళ్ళటానికి వచ్చారు. రమ్మని మనలను ఆహ్వానిస్తున్నారు. దివ్యత్వం, దివ్యశక్తితో నింపుతున్నారు. గమ్యానికి చేర్చుతున్నారు. అలా మనం ఫీల్ అవుతున్నాం. అపుడు నకిలీ శరీరం మీద దృష్టి చెరిగిపోయి, హృదయంలో అసలు తత్వం (రియాలిటీ) మీద మన అంతర్‌దృష్టి నిలుస్తుంది.

నా చిన్న తమ్ముడు నన్ను ఇలా అడిగాడు: "ప్రహ్లాద్ అంటే నేను పలుకుతాను. ఈ నేను అనేది ఎవరు?" అని.

బాబూజీ ఒక చక్కని విషయం చెప్పారు. ఒకసారి ఒక అమ్మాయి బాబూజీ దగ్గరకు వచ్చినప్పుడు బాబూజీ 'నీ పేరు ఏమిటి" అని అడిగారు. ఆ అమ్మాయి "నా పేరు ద్వారక" అన్నది. అప్పుడు బాబూజీ "ద్వారక" ఇక్కడ ఎక్కడ ఉంది. అది పట్టణం కదా! నీవు ద్వారకవు ఎలా అవుతావు? అన్నారు. అది ఈ శరీరానికి పేరు. ఆ పేరుతో పిలిస్తేనే పలుకుతావు. హృదయానికి పేరు లేదు. ఎందుకంటే, హృదయంలో ఉన్న దైవానికి ఏ నామమూ లేదు.

సీతమ్మ తల్లి లంకలో ఉన్నా, ఆమె మనసు ఎప్పుడూ శ్రీరామచంద్రునితోను, అయోధ్యతోనే ఉన్నది అని తులసీదాసు అన్నారు. అలాగే మన ఆధ్యాత్మిక శిక్షణ ద్వారా మనం ఎప్పుడూ బాబూజీతోనే బంధం కలిగి ఉండాలి. ఎక్కడు ఉన్నా, ఏమి చేస్తున్నా వారిలో లయమై ఉండాలి. వారి స్మరణలో మునిగి ఉండాలి.

"నేను మీ హృదయంలోనే ఉన్నాను. మీతో కలిసే ఉన్నాను. మీ గురించి ఆలోచిస్తూ ఉంటాను. కాని మీరు నన్ను తలచుకోకపోతే నేనేమి చేసేది చెప్పండి" అని బాబూజీ అనేవారు.

దైవం మీలోనే ఉంటే మీరు వారిని దూరంచేసి బయట ఎక్కడో గుళ్ళలో ఉన్నారని పూజలు చేస్తారు. మీలో ఉన్న దైవాన్ని అంతర్దృష్టితో గుర్తించి పూజిస్తే వారు ఆనందిస్తారు. మనలను ఆధ్యాత్మికంగా ఉన్నతికి తీసుకు వెళ్ళటానికి 'వారు' క్రిందకు దిగి వచ్చారు. మనలోని సెల్ఫ్‌ని తీసివేస్తారు. పైకి తీసుకు వెళ్ళతారు. సెల్ఫ్ లేనప్పుడు మన పురోగమనం వేగవంతమవుతుంది.

ఈరోజు (7.02.2011 – బసంత్ పంచిమి) మనం జరుపుకుంటున్న లాలాజీ జన్మదినోత్సవం చాలా శ్రేష్టమైనది. సాధారణంగా జరుపుకునే పుట్టినరోజు కాదు. సమర్థ సద్గురువు, ఆదిగురువు, నూతన ఆధ్యాత్మిక శకం ఆవిర్భవించిన రోజు. మహాత్ములు ఊరికినే ఈ భూమి మీదకు రారు. ప్రకృతి (నేచర్) వారి రాక కోసం నిరీక్షించినపుడు, మానవాళిని అనంతానికి, ఆధ్యాత్మిక ఉన్నత స్థితుల ద్వారా తీసుకు వెళ్ళటానికి వారు అవతరిస్తారు. సాధనలో మనం ధ్యానం మాత్రమే చేస్తాం. మిగిలినవ్నీ ఆ దివ్యపురుషులే చేస్తారు. వారిని మన హృదయంలో నిలుపుకుంటాము. ఎవరైతే "బాబూజీ నావారు" అని భావించి, వారి స్మరణలో ఉంటారో వారు బాబూజీకి సమీపంగా వచ్చి గమ్యానికి చేరువ అవుతారు. బాబూజీ మనకు సరియైన మార్గాన్ని ప్రసాదించారు. సహజమార్గం చాలా సహజమైనది, సరళమైనది. అది రియలైజేషన్‌కు దగ్గర మార్గం. అన్నీ బాబూజీ చేస్తారు. ఫలితం మనం పొందుతాము.

మొదట్లో బాబూజీ మన ఎదురుగా ఉన్నట్లు ఫీల్ అవుతాము. కొంత సాధన తరువాత బాబూజీ మనలోనే ఉన్నారు, మన హృదయంలోనే ఉన్నారనిపిస్తుంది. ఆ తరువాత బాబూజీ లోపల బయటా అంతటా ఉన్నారు, మనలను గమ్యానికి తీసుకు వెళ్తున్నారని తెలుస్తుంది. మనకు వారు దివ్యశక్తిని ప్రసాదించి మనలోని అనవసరమైన వాటిని, చెడు గుణాలను (Negative things) తీసివేస్తారు. మన లోపాలను సరిచేస్తారు. మన హృదయాలను, ప్రవర్తనను మారుస్తారు. "బాబూజీ నావారు" అని ఫీలయితే, మనలో ఉన్న 'I' కరిగిపోయి అక్కడ బాబూజీ ఉంటారు. ఇప్పుడు మన సహజమార్గ విధానం చాలా సులభమైనది. నేను రెండో సిట్టింగ్ తీసుకున్నప్పుడే నాకు చాలా మార్పు కనపడింది. మనం గుడికి రోజూ వెళ్ళినా మన కండీషన్‌లో మార్పు ఉండదు. రోజూ ఒకే విధమైన ఫీలింగ్ ఉంటుంది. కాని మన సహజమార్గంలో రోజు, రోజుకు మన ఫీలింగ్

మారుతుంది. వారిని తలచుకుంటే చాలు వారి ప్రేమ, కృపా వర్షం మనపై కురుస్తుంది. మన స్మరణ, మన హృదయం వారి ప్రేమతో నిండినపుడు వారి శక్తిని మనం అధికంగా పొందుతాము. వారు మనకు దగ్గరగా ఉన్నారని ఫీలయితే వారు నిజంగానే మన దగ్గర ఉంటారు. ప్రతి ఒక్కరూ వారి హృదయాలను బాబూజీ మహరాజ్‌కు సమర్పించుకోవాలి. ఆ రోజుకోసం ఆతురతతో వేచి ఉండాలి. మీరు వారికి సరండర్ (శరణాగతి) అయితే వారు మీకు సరండర్ (శరణాగతి) అవుతారని బాబూజీ చెప్పారు. ఈ సహజమార్గం మనకు లభించటం మన అదృష్టం. నా హృదయంలో బాబూజీ ఉన్నారని అనుకుంటే వారు తప్పకుండా అక్కడ ఉంటారు, ఉన్నారు కూడా.

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు అవతరించాలని ఋషులు, మునులు ప్రార్థించారు. వారు గాడ్లీ రిజీయన్ నుండి అవతరించారు. కానీ లాలాజీ అవతరించాలని ఎవరూ ప్రార్థించలేదు. ప్రకృతే లాలాజీ మహరాజ్‌ను, బాబూజీ మహరాజ్‌ను భూమిమీదకు తీసుకువచ్చింది సమస్త మానవాళిని అంతిమానికి తీసుకువెళ్ళటానికి.

ఈ జన్మదినోత్సవాన్ని మనం జరుపుకుంటున్నాము. ఇది ఉత్సవం కాదు, రియాలిటీ. ప్రకృతి, ప్రాపంచికం నుండి మానవాళిని దూరంచేసి దైవంలో కలపటానికి పరిపూర్ణశక్తితో ఒక దివ్యపురుషుడు అవతరించాలని ప్రార్థించింది. లాలాజీగారు ఆ పని –నేను చేస్తానని వారి గురువుతో చెప్పారు. లాలాజీగారి జన్మదినం మనం జరుపుకుంటున్నాం. మనమందరం ఆధ్యాత్మికతను పూర్తిగా పొందుతున్నాం. బాబూజీని దర్శించే భాగ్యాన్ని లాలాజీ మహరాజ్ మనకు ఇచ్చారు. మనం చాలా శక్తిమంతులం. నేను అనారోగ్యంగా ఉన్నప్పుడు డాక్టర్లు నేను అసలు లేచి నిలబడలేనని అన్నారు. కాని నేను ఏ పనినైనా పూర్తిగా చేయగలనన్న విశ్వాసం నాకుంది. నేను బాబూజీ మహరాజ్‌ను కలిసినప్పుడే నా సెల్ఫ్‌ను వారికి అర్పించి, “నేను మీదానను, నేను సర్వం మీకు ఇచ్చేశాను” అన్నాను. మీరు కూడా బాబూజీ మహరాజ్‌కి మీ సెల్ఫ్‌ను సమర్పించుకోండి. త్వరగా సాక్షాత్కారం (రియలైజేషన్) లభిస్తుంది. స్వల్పకాలంలోనే ఆధ్యాత్మికతను అంతా పొందగలరు. బాబూజీగారిని ఈ భూమి మీదకు లాలాజీగారు తీసుకువచ్చారు. వారి దివ్యప్రేమతో, మనకు ఆధ్యాత్మిక పురోగమనాన్ని, దివ్యస్థితులను వారి ట్రాన్స్‌మిషన్ ద్వారా కలిగిస్తారు. వారి దివ్యప్రేమ మనలను ముందుకు నడుపుతుంది. ఈ రోజు ఉన్న కండిషన్ మరుసటి రోజు మారిపోతుంది. పరమానందం కలుగుతుంది.

లాలాజీ, బాబూజీ మనలను వారి బిడ్డలుగా స్వీకరించారు. బాబూజీ మహరాజ్ ఎప్పుడూ నేను అభ్యాసీల సేవకుడిని అనేవారు. ధ్యానం, నిర్మలీకరణ, ప్రార్థన అన్ని వారి కోసం వారి ప్రజన్స్‌లో జీవిస్తూ చేస్తున్నామనుకోండి. అప్పుడు తప్పకుండా వారి దివ్యత్వాన్ని ఫీల్ అవుతారు. బాబూజీ మహరాజ్‌ని త్వరలో కలుసుకుంటామన్న విశ్వాసం ఏర్పడుతుంది. ‘వారు’ మనకు చాలా దగ్గరవుతారు. తప్పకుండా వారిని త్వరలో పొందుతాము. మనం బాబూజీ పిల్లలము. మన కర్తవ్యం (డ్యూటి) మనం చేయాలి. ఏదైనా పని చేస్తున్నప్పుడు మిమ్మల్ని బాబూజీ మహరాజ్‌కి సమర్పించుకుని పని చేయండి. మీ సెల్ఫ్‌ను సమర్పించండి కాని మీరు చేస్తున్న పనిని కాదు.

**నిరంతర స్మరణ (Constant Remembrance)**: ఒకరిని ఇంకొకరు గుర్తుపెట్టుకోవటం. అంటే అక్కడ ఇద్దరూ ఉంటారు, అభ్యాసీ, బాబూజీ.

**నిరంతర బంధం (Constatnt Connection)**: రెండు హృదయాలు కలుపబడి ఒకటైపోతుంది. అక్కడ బాబూజీ ఒక్కరే ఉంటారు.

**Devotion:** Drown yourself in Divine Ocean and don't come out.

భక్తి అంటే దివ్య సముద్రంలో మునిగి బయటికి రాకుండా ఉండటం. మీలో ఉన్న 'I' ness పోతేనే మీరున్న దివ్యస్థితిని గుర్తించగలరు.

ఈశ్వర సహాయ్‌గారు బాబూజీని అడిగారు, "మీకు ఎప్పుడూ సందేహాలు రావా?" అని.

బాబూజీ చెప్పారు– జవాబు ఎప్పుడూ నాదగ్గర ఉంటుంది. జవాబు నేను మరచిపోతే లాలాజీ సాహెబ్ సమాధానం ఇస్తారు.

సహజమార్గం ఒక స్కూలు. దానికి ప్రిన్సిపల్, టీచర్, ట్రెయినర్ అన్నీ బాబూజీనే. ప్రిసెప్టర్లు అక్కడ సేవకులు (Servants). ఈ స్కూలులో ప్రవేశం (Admission) దొరకటం చాలా కష్టం. సీటు దొరికితే చాలు డిగ్రీ రావటం ఖాయం. అంటే గమ్యాన్ని తప్పక చేరతాము. సృష్టి జరిగినపుడు మనం కేంద్రంలో పుట్టి, ముద్రలు, ఆవరణలు ఏర్పరుచుకుంటూ కేంద్రానికి దూరంగా వెళ్ళి ఉపరితలం చేరుకున్నాం. ఆ ఆవరణలను తన దివ్యశక్తితో తొలగించి తిరిగి మనలను కేంద్రమువైపు తీసుకు వెళ్ళటానికి బాబూజీ మహరాజ్ కేంద్రం నుండి దిగి వచ్చారు.

నేను సాధనలో మూడు దశలలో బాబూజీ మహరాజ్‌ని చూశాను. మొదట 'వారు' మన కెదురుగా వెలుపల కూర్చుని ట్రాన్స్‌మిషన్ ఇస్తున్నారని అనిపిస్తుంది. బాబూజీ అక్కడ కూర్చుంటారు. కాబట్టి ఆ ప్రదేశాన్ని క్లీన్ చేయాలి. కొన్ని రోజుల సాధన తరువాత వారిని మన హృదయంలో ఉన్నట్లు ఫీలవుతాము. వారు మన అతిథి. మన హృదయంలో కూర్చుని ఉన్నారు. వారిని మనం గౌరవించాలి. వారిమీదే దృష్టి సారించాలి. మూడవ దశలో మనం బాబూజీగారితో కలిసిపోతాము. ఇక పూజ లేదు, క్లీనింగ్ లేదు. అన్నీ వారే తమ దివ్యశక్తితో చేసి దైవంతో కలుపుతారు.

మీరంతా సాధన బాగా చేసి ప్రేమ పుష్పాలుగా మారాలి. ఆ పుష్పాలను బాబూజీ మహరాజ్‌కు సమర్పించాలి. దైవం మనకోసం దివ్యశక్తి నిచ్చి అంతిమానికి తీసుకు వెళ్ళటానికి వచ్చారు. రోజ రోజుకు మీ కండిషన్ మారుతుంది. బాబూజీ మన మందరమూ త్వరగా లక్ష్యాన్ని చేరుకోవాలని ఆతురతతో వేచి ఉన్నారు. కాబట్టి మనం వారి స్మరణలోనే ఎల్లప్పుడూ ఉండాలి. వారు మన ఆధ్యాత్మిక తల్లి (Spiritual Mother). అన్నీ వారే చూస్తున్నారు. మనం చేయవలసినదంతా మన హృదయాన్ని వారి దివ్య విరాట్ హృదయంతో కనెక్ట్ చేసుకోవటమే. మీరందరూ ప్రోగ్రెస్ అవుతున్నారు. బాబూజీ మహరాజ్ మన జన్మదాత. దివ్యశక్తిని మన కివ్వటానికే వచ్చారు. ఇస్తారు, ఇస్తున్నారు, ఇస్తూనే ఉంటారు. వారి పని వారు చేస్తున్నారు. మన పని మనం చేస్తే ప్రేమే మన కుటుంబ వాతావరణాన్ని మారుస్తుంది. అందరం బాబూజీ పాదాలను చేరుకుంటాము.

**ప్రశ్న: ప్రాణ్, మన్, ఆత్మ వీటి మధ్యన ఉన్న బంధం ఏమిటి?**

**జవాబు:** ప్రాణం లేకపోతే జీవి మరణిస్తాడు.

మన్ – Mind లేకపోతే శరీరం పనిచేయదు.

ఆత్మ లేకపోతే శరీర మనుగడ ఉండదు.

మూడూ ఒక దాని మీద ఒకటి ఆధారపడి ఉంటాయి. ఒకటి లేకపోతే ఇంకొకటి ఉండదు.

------

**ఎవరు ఆర్హులో వారు లాభాన్ని పొందుతారు. సహచరుడు అర్హుడు, యోగ్యుడు, ఋజువర్తనుడై ఉండాలి. ఎల్లప్పుడు మాస్టర్‌ను తనవైపు ఆకర్షించుకొనునది అనుచరుని (శిష్యుని) సామరస్యమే! ఈ సామరస్యం కూడా ముందుగా అనేక స్థితులు దాటిన వానికే చేకూరుతుంది. 'సత్యం'పట్ల ద్యాసయే ధ్యానం. క్రియాశీలం, సమగ్రమైన ధ్యాస ఉండాలి. కానీ (పని లేకుండా) నిష్క్రియగా ఉండటం మాత్రం కాదు. ధ్యానంలో ఎరుకతో కూడిన కృషి అవసరం.**

**ఒకడు ఎప్పుడైతే తనకు ఉన్నదంతా అర్పిస్తాడో**

**తీసుకున్న వారి దగ్గర కల సంపత్తి, అర్పించిన వారిలో కలుస్తుంది.**

**అభ్యాసీ మాస్టర్ నుండి తిరిగి పొందుతాడు.**

**బంధువులతోగల సంబంధం ఏ విధంగా ఉండాలంటే ఆంతరిక బంధం సడలునట్లే ఏర్పరచుకోవాలి. అయినప్పటికీ వారి కష్టసుఖాలలో పాలుపంచుకోవాలి.**

**ఆధ్యాత్మికంగా తన పని చేయించుకొని ఇతరులను అలా మలచుటకు సిద్ధపడని వానిని స్వార్థపరుడని అంటారు. ఒకే ఒక వ్యక్తినైనా సంపూర్ణంగా తయారుచేసిన, అతడు మాస్టర్ ఋణాన్ని తీర్చినవాడవుతాడు.**

**ప్రేమతో ప్రతి దానిని సాధించవచ్చు. ధ్యానం తదితర సాధనలు దీనితో పోల్చి చూసినట్లయితే ప్రాముఖ్యం లేనివిగా అవుతాయి.**

------

